ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-6-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 137 పేజీలు: 10+4 వెల: 6.50

ముంచెత్తుతున్న భారీ వర్షాలు 5

9 ఎయిరిండియా విమానాలు రద్దు

# మండుతున్న మధ్యప్రాచ్యం

## ఇరాన్, ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు ముమ్మరం

పశ్చిమాసియాలో ఎయిర్‌పోర్టులు మూసివేత


టెల్ అవివ్‌పై క్షిపణుల వర్షం కురిపించిన టెహ్రాన్

పలు యుద్ధవిమానాలు ధ్వంసం

జి-7 సదస్సు నుంచి ట్రంప్ అర్ధాంతరంగా అమెరికా పయనం

తక్షణమే టెహ్రాన్‌ను వీడాలని భారతీయులకు ఎంబసీ సూచన

ఖమేనీ అంతంతోనే యుద్ధం ముగింపు: నెతన్యాహు




ఇరాన్ దాడులకు మంటల్లో కాలిపోతున్న ఇజ్రాయెల్‌లోని హైఫాలో ఓ ఫ్యాక్టరీ

**టెల్‌అవీవ్, జూన్ 17:** ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధం ఐదో రోజుకు చేరుకుంది. ఆ దేశాలు ప్రతీకార చర్యలతో రగిలిపోతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమాసియా వ్యాప్తంగా ఎయిర్‌పోర్టులను మూసివేయడంతో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గగనతలాలపై ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గగనతలాన్ని ఇరాన్ పూర్తిగా మూసివేయగా.. అత్యంత కీలకమైన >>2

### మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ క్షిపణుల వర్షం

**టెహ్రాన్, జూన్ 17:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య దాడులు తీవ్రరూపం దాల్చుతున్నాయి. అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ గగనతల దాడులు చేస్తుండగా.. ఆ దేశంలోని వ్యూహాత్మక ప్రాంతాలపై ఇరాన్ క్షిపణులను ప్రయోగిస్తోంది. ఈ >>2



# 'బనకచర్ల'పై యుద్ధభేరి!

## ఏపి తలపెట్టిన లింక్ ప్రాజెక్టుపై పోరాటం ఉధృతం చేసిన తెలంగాణ సర్కార్

నేడు సిఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష ఎంపీల సమావేశం

అన్ని పార్టీల ఎంపీలకు లేఖ రాసిన మంత్రి ఉత్తమ్

పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చే అవకాశం

కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి కూడా ఆహ్వానం

**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:** గోదావరి జలాలను అక్రమంగా తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం పోరాటం తీవ్రతను పెంచింది. తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రికి, అటవిపర్యావరణశాఖ మంత్రికి వరుసగా రెండు రోజులు లేఖలు రాసి టెండర్లును నిలిపివేయాలని ప్రాజెక్టు నిర్మాణం అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ఉన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న తెలంగాణ బిజెపి ఎంపిలపై కూడా ఒత్తిడి పెంచేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డతూ రాజకీయ అనివార్యతన సృష్టించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టును నిలిపివేసేందుకు పావులు కదుపుతున్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందులోభాగంగానే బుధవారం నాడు సాయంత్రం 4 గంటలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. అఖిల రాజకీయ పార్టీల పార్లమెంట్ సభ్యులకు సచివాలయంలోని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కార్యాలయంలో గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు పై పవర్ పాయింట్ ప్రెసెంటిషన్ ఇవ్వబోతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రులు >>2

# గో సంరక్షణకు సమగ్ర విధానం

## ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీ

తొలి దశలో నాలుగు ప్రాంతాల్లో అత్యాధునిక గోశాలలు

అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్



మంగళవారం గోశాలలపై సమీక్ష జరిపిన సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి ఉన్నతాధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** రాష్ట్రంలో గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సీఎం నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని, స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సీఎం సూచించారు.ప్రముఖ >>2

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ ఆలస్యం!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్17:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ తమకు గెజిట్ పంపించిందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆ గెజిట్ తాము యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించామని ఆయన తెలిపారు. ఉప ఎన్నిక ఎప్పుడు నిర్వహించాలో కేంద్ర ఎన్నికల సంఘం డిసైడ్ చేస్తుందని చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే స్థానం ఉప ఎన్నిక ఈ ఏడాది డిసెంబర్‌లోగా జరగాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం చాలా సంస్కరణలను తీసుకువస్తోందని ఆయన వెల్లడించారు. బిఎల్‌ఓ, బూత్ లెవెల్ ఏజెంట్స్, ఈఆర్‌ఓలతో ఇంటరాక్ట్ కార్యక్రమాలు చేపడుతోందని, బిఎల్‌ఏ,బిఎల్‌ఓలకు ట్రెనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్ల సంఖ్య 1500 నుంచి 1000కు కుదించిందని గుర్తుచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఆంక్షలను 200 మీటర్ల నుంచి 100మీటర్లకు తగ్గించిందని వెల్లడించారు. పోలింగ్ సెంటర్స్ వద్ద ఇక నుంచి మొబైల్ ఫోన్స్ కోసం డిపాజిట్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణలో 24వేల డబుల్ ఓటర్లను >>2

### పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు కెటిఆర్ లీగల్ నోటీసులు



తప్పుడు ఆరోపణలు చేసినందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** ఫోన్ ట్యాపింగ్ పేరిట పీసీసీ అధ్యక్షుడు చేసిన అసత్య ఆరోపణలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ మహేష్ కుమార్ గౌడ్ కు లీగల్ నోటీసులు పంపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ సర్కారు తన చేతికానీతాన్ని కప్పిపుచ్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాద్ధాంతం చేస్తోందని దుయ్యబట్టారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా తమపై, తమ పార్టీ నేతలపై ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెంటనే బేషరతుగా మహేష్ కుమార్ గౌడ్ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.చట్టాలను గౌరవించే వ్యక్తులుగా అక్రమంగా పెట్టిన కేసు విచారణకు సైతం హాజరై సహకరించా మని తెలిపారు. ఆరు గ్యారెంటీలను,420 హామీలను పూర్తిగా గాలికొదిలేసి ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు. అడ్డగోలుగా మాట్లాడితే బీఆర్‌ఎస్ శ్రేణులు కూడా చూస్తూ ఊరుకోబోరని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో ప్రజల్ని తప్పుదోవ పట్టించాలనే దురుద్దేశంతోనే మరోసారి ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు తప్ప, ఈ లొట్టపీసు కేసుతో ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ అబద్ధాలు చెప్పడంలో పోటీపడుతున్నట్టు కనిపిస్తోందని, రాష్ట్రాన్ని నడిపించే సత్తా, సామర్థ్యం లేకపోవడంతోనే ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ కుట్రలతో కాలం వెల్లదీసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.కేవలం రాజకీయంగా పబ్బం కడుక్కునేందుకు చేసే ఇలాంటి దుర్మార్గపూరిత వ్యాఖ్యల పైన మహేష్ కుమార్ గౌడ్ లాంటి నాయకులను కోర్టులకు ఈడుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికైనా పరిపాలన పైన దృష్టి పెట్టి, అటెన్షన్ డైవర్షన్ డ్రామా లను పక్కన ప్రతిపక్ష నాయకులపైన ప్రాపగాండాచేయడం మానాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి చేసే అంశాల పైన దృష్టి సారించాలని హితవు పలికారు.

బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి హైకోర్టులో మళ్లీ చుక్కెదురు 2



### రైతు భరోసా రెండో రోజు రూ.1,552 కోట్లు జమ

-వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతు భరోసా కింద రెండో రోజు రైతుల బ్యాంకు ఖాతాల్లో 1,551.89 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో నేటి రెండో రోజున 3 ఎకరాల వరకు ఉన్న రైతులందరి ఖాతాలలోకి ఎకరానికి 6 వేల రూపాయలు చొప్పున రైతు భరోసా నిధుల జమ చేయడం జరిగిందని వివరించారు. ఈ మొత్తాన్ని రాష్ట్రంలోని 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకు జమ చేశామని చెప్పారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారం దరికి రైతు భరోసా నిధులు జమ చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 3,85,615 మంది రైతులకు 3,03,90,00, 838 రూపాయలను, >>2

### పిఇ సెట్‌లో 94.96% అర్హత

జులై చివరి వారంలో కౌన్సెలింగ్

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో బిపిఇడి, డిపిఇడి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పిజికల్ ఎడ్యుకేషన్(పిఈ) సెట్–2025కి సంబంధించిన ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలకు హాజరైన వారిలో 94.96 శాతం మంది అర్హత సాధించారు. పిఈ సెట్ కౌన్సెలింగ్‌ను జులై చివరి వారంలో నిర్వహించనున్నారు. పిఈ సెట్–2025 ఫలితాలను ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, పాలమూరు యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్, ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి రమేష్ బాబు, పిఈ సెట్–2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ ఎస్ దిలీప్ పాల్గొన్నారు. ఈ నెల 11నుంచి 14వరకు ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలను మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో >>2





మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలంలో సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేస్తున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

# అభివృద్ధిని ఆగనివ్వం

## ఎన్ని ఇబ్బందులు ఉన్నా వేలకోట్లతో సంక్షేమ పథకాలు

సబ్‌స్టేషన్ల శంకుస్థాపనలో డి.సిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

**భూపాలపల్లి, జూన్ 17, ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని వెనకబడనివ్వం.. అభివృద్ధిని ఆగనివ్వమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 140 లక్షలతో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం మొరంచపల్లి నుండి మంజూరునగర్ వరకు వరకు సాగిన పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించగా, ఈ ర్యాలీలో అతిథులు ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం మంజూరునగర్లో నవాబుపేట, ధర్మారావుపేట, మంజూరునగర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి >>2

# 2023 ఎన్నికల్లో భారీగా ఫోన్ ట్యాపింగ్!

## సిట్ విచారణలో వెలుగు చూస్తున్న కొత్త విషయాలు

మావోయిస్టు సానుభూతిపరుల పేరిట గిట్టని వారి ఫోన్లు రివ్యూ కమిటీకి పంపిన ఎస్ఐబి?

ట్యాపింగ్ బాధితుల్లో షర్మిల, మరికొందరు నాటి విపక్షనేతలు

నేడు సిట్ విచారణకు మళ్లీ ప్రభాకర్ రావు.. సిట్‌కు వాంగ్మూలం ఇవ్వనున్న బిజెపి నేతలు

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులో ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావును విచారణ చేయడం మొదలు పెట్టాక సంచలన నిజాలు వెలుగు చూస్తున్నట్లు తెలిసింది. ప్రభాకర్ రావు ఎస్ఐబి బాస్‌గా పనిచేసిన సమయంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి తన కింద పనిచేసే అధికారులు, సిబ్బందికి ప్రతీరోజు రెండు గంటల పాటు బ్రీఫింగ్ ఇచ్చేవారని ఈ కేసును విచారిస్తు న్న సిట్ అధికారుల తాజా విచారణలో తేలినట్లు తెలిసింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతల ఫోన్‌లతో పాటు అధికార పక్షంలో దిక్కా ర స్వరం వినిపించే వారి ఫోన్లను ఫోన్ ట్యాపింగ్ యూనిట్ అధికారులు ఒక పద్ధతి ప్రకారం ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు తాజాగా గుర్తించిందని సమాచారం. అప్పట్లో జరిగిన దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల వేళ బిజెపి తరపున పోటీచేసిన రఘునందన్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరుల వద్దడబ్బులు భారీగా పట్టుబడడం వెనుక ఫోన్ ట్యాపింగ్ హస్తం వుందని సిట్ తేల్చిందని తెలిసింది. దీంతో పాటు హైదరాబాద్‌లో వివేక్ >>2

'సిట్' ఎదుట వాంగ్మూలం ఇచ్చిన పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ 7



గత వారం అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిర్ ఇండియా విమానం పైలట్ కెప్టెన్ సుమీత్ అంత్యక్రియలకు ముందు ముంబయిలో మంగళవారం నివాళులర్పిస్తున్న తండ్రి పుష్కరాజ్ సభర్వాల్

## పిఇ సెట్‌లో 94.96% అర్హత

>> నిర్వహించినట్టు తెలిపారు. 11న 732 మందికిగాను 517 మంది హాజరయ్యారని అలాగే 12న 775 మందిగాను 515 మంది, 13న 535 మందిగానూ 323 మంది, చివరి రోజైన 14న 566 మందికిగానూ 397 మంది హాజరయ్యారు. మొత్తంగా 1507 మంది పురుషులకు గానూ 1032 మంది పరీక్షలకి హాజరుకాగా.. 1101 మంది మహిళలకు గానూ 720 మంది హాజరయ్యారు. పిఈ సెట్‌లో 2608 మంది ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా.. 1767 మంది హాజరయ్యారు. బిపిఈడిలో 1833 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1307 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 1252 మంది అర్హత సాధించారు. పరీక్షలకు హాజరైన వారిలో 95.79 శాతం అర్హత సాధించారు. డిపిఈడిలో 724 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 460 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 426 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 92.61 శాతం అర్హత సాధించారు. మొత్తంగా పిఈ సెట్-2025లో 94.96 శాతం మంది అర్హత సాధించారు. జులై చివరి వారంలో కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు.

## 'బనకచర్ల'పై యుద్ధభేరి!

>> కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లతోపాటు ఇతర బిజెపి ఎంపిలు గైర్హజరు కానున్నట్లు తెలిసింది. లోక్‌సభ, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి, బి ఆర్ ఎస్, ఎం.ఐ.ఎం పార్టీల ఎంపిలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా ఫోన్‌చేసి ఆహ్వానించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లకు ఫోన్ చేసి హాజరై తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరుగబోయే నష్టనివారణకు అనుసరించే విధానం రూపొందించేందుకు సహాయ సహకారాలు అందించాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలని ప్రతిపాదించడటంతోపాటు, జూన్2నజరిగిన ఢిల్లీలో జరిగిన సమావేశంకు హాజరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అధికారులు ముందస్తు సాధ్యత నివేదిక (ప్రీఫీజుబిలిటిరిపోర్టు)ను భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ, ఆర్థిక మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు అమిత్‌కుమార్ ఝా, సజ్జన్‌యాదవ్‌లకు ఇవ్వగా వారు డిపిఆర్‌ను సిడబ్ల్యుసికి ఇవ్వాలని సూచించారు. ప్రాథమిక అధ్యయనంలోఈ ప్రాజెక్ట్ 1980 నాటి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను ఉల్లంఘించినట్లు కనిపిస్తోంది. ఊహించిన విధంగా ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ప్రజల నీటి హక్కులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొంటూ 22 జనవరి 2025న కేంద్ర ఆర్థిక, జలశక్తి మంత్రులకు భారత ప్రభుత్వానికి లేఖలు రాశానని ఉత్తమ్ ఎంపిలకు రాసిన లేఖలో పేర్కొన్నారు. గోదావరిబనకచర్ల అనుసంధాన పథకం యొక్క డిపిఆర్ భారత ప్రభుత్వానికి అందలేదని, అది అందిన తరువాత 'ప్రస్తుత మార్గదర్శకాలు, ప్రస్తుత ట్రిబ్యునల్ అవార్డులు/అంతర్ రాష్ట్ర ఒప్పందాలు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 కింద వివిధ నిబంధనల ప్రకారం పరిశీలిస్తుందని' హామీ ఇస్తూ కేంద్ర జల శక్తి మంత్రి పాటిల్ 28 మే 2025 సమాధానం ఇచ్చారని ఆ లేఖ ప్రతులు కూడా జతపరుస్తూ ఉత్తమ్‌కుమార్ ఆహ్వానలేఖను ఎంపికలకు పంపినారు. గోదావరి బనకచర్లపై అభ్యంతరాలు ఇతర సమస్యల కోసం కేంద్ర మంత్రి పాటిల్‌ను జూన్ 03, 2025న న్యూఢిల్లీలో జల్‌శక్తి మంత్రి కార్యాలయంలో తెలంగాణ ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు కలిసినట్లు ఆయన తెలిపారు. ఈ లేఖలో, ప్రస్తుతం జల్ శక్తి మంత్రిత్వ శాఖ సిడబ్ల్యుసి సమీక్షలో ఉన్న గోదావరిబనకచర్ల పథకం ప్రీఫీజిబిలిటీ నివేదికను తిరస్కరించాలని డిపిఆర్, టెండర్లు చేపట్టవద్దని అభ్యర్థించినట్లు ఉత్తమ్ కుమార్ ఎంపిలకు తెలిపారు.

## అభివృద్ధిని ఆగనివ్వం

>> విక్రమార్క మాట్లాడుతూ... ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి మేలు చేయాలన్న తలంపుతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్యాబినెట్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించబోతున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలల్లో పెద్ద సంఖ్యలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎసిబికి కెటిఆర్ మొబైల్స్ ఇవ్వాల్సిన అవసరం లేదని సూచించిన న్యాయవాదుల బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** ఫార్ములాఈ కేసు అనేది ప్రభుత్వ లావాదేవీకి సంబంధించినదే తప్పా.. వ్యక్తిగత సంభాషణకు సంబంధించి కాదని కెటిఆర్ న్యాయవాదులు స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశానికి సంబంధించిన అవగాహన ఒప్పందాలతో పాటు ఆయా సంస్థలతో జరిగిన ఒప్పందాలన్నీ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని, జరిగిన ప్రతి నగదు లావాదేవీ అధికారికంగా బ్యాంకుల ద్వారా జరిగినప్పుడు, అప్పట్లో మంత్రిగా ఉన్న కేటీఆర్ వ్యక్తిగత సమాచారం అడిగే హక్కు ఏసీబీకి లేదన్నారు. ఇవన్నీ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న సమయంలో కేవలం రాజకీయ వేధింపుల కోణంలో మొబైల్ ఫోన్ అడగడం వెనుక న్యాయసమతమైన కారణాలు లేవని న్యాయవాదులు పేర్కొన్నారు. విచారణ సంస్థలు ఒక పౌరుడి నుంచి సేకరించిన సమాచారాన్ని తిరిగి అదే పౌరుడిపై వాడే కుట్ర చేయడం అన్యాయమని గతంలో హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చాయని న్యాయవాదులు గుర్తు చేశారు. పైగా వ్యక్తిగతంగా వాడే ఫోన్లను ఎలాంటి కోర్టు తీర్పు లేకుండా.. వాటితో నేరుగా ఆరోపణల సంబంధం లేనప్పుడు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అంతేకాక, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం.. ఐటీ చట్టం ప్రకారం, ప్రైవసీ హక్కులకు విఘాతం కలిగించేలా ఉంటుందన్నారు. ఈ చట్టాల ప్రకారం కేవలం కోర్టు తీర్పు ఉన్నప్పుడు మాత్రమే విచారణ సంస్థలు మొబైల్, ల్యాప్‌టాప్ లాంటి పర్సనల్ డివైజ్‌లు అడగవచ్చని వివరించారు.

## వైరల్ ఫీవర్‌తో ఆసుపత్రిలో చేరిన మాజీ మంత్రి హరీష్

### పరామర్శించిన బిఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్ (బేగంపేట), జూన్ 17,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సోమవారం రాత్రి సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై (వైరల్ ఫీవర్ తో) బాధపడుతూ బేగంపేట లోని సన్‌షైన్ కిమ్స్ ఆస్పత్రిలో చేరారు. అయితే ఈ విషయం తెల్సుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెశిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆస్పత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలంటూ వైద్యులకు సూచించారు. అనంతరం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా హరీష్ రావును పరామర్శించారు. మంగళవారం ఉదయం సమయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్ ,ఎమ్మెల్యే లక్షణ్ రెడ్డి, ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించారు. ఆయనకు డాక్టర్ సుధేష్ పాటిల్ ఆధ్వర్యంలోని వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు.

## గో సంరక్షణకు సమగ్ర విధానం

>> దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరి గుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికే పల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వ విద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని సీఎం సూచించారు. భక్తులు అత్యధిక భక్తిశ్రద్ధలతో సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సీఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని సీఎం తెలిపారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని సీఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సీఎంకు అందజేశారు. సిఎం వద్ద జరిగిన సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శులు వి. శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 18-06-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
సప్తమి మ.1.35
పూర్వాభాద్ర రా.12.24
వర్జ్యం రా.9.48-12.38
దు.ఉ.11.42-మ.12.35
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం :** సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు. సోదరుల నుండి ధనలాభం పొందుతారు.

**వృషభం :** పోటీ పరీక్షలలో, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మిథునం:** చేజారిన విలువైన డాక్యుమెంట్లు లభ్యమవుతాయి. కోర్టుకేసులనుండి బయటపడతారు.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం :** కొత్త కార్యక్రమాలను చేపట్టినా సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**తుల :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** అకారణంగా వివాదాలు ఏర్పడతాయి. జాగ్రత్త అవసరం. సమస్యలు కొంతవరకు తీరుతాయి.

**ధనుస్సు:** రాజకీయ, పారిశ్రామిక రంగాలవారు అరుదైన సత్కారాలు పొందుతారు. వస్తులాభం.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారంవల్ల కొంత ఊరటచెందుతారు.

**కుంభం :** ఉన్నత హెూదాల్లోని వారితో పరిచయాలు ఏర్పడతాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**మీనం :** పనులు శ్రమానంతరం పూర్తికాగలవు. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ధన లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మండుతున్న మధ్యప్రాచ్యం

>> అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇజ్రాయెల్ మూసివేసింది. దీంతో లెబనాన్, జోర్డాన్, ఇరాక్‌లోనూ విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు, తమ అణు స్థావరాలను ధ్వంసం చేయడంతో అత్యున్నత సైనికాధికారులను పొట్టనపెట్టుకున్న ఇజ్రాయెల్‌కు తగిన గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో సోమవారం ఉదయం క్షిపణుల వర్షం కురిపించింది.

టెల్‌అవీవ్, పెటా తిక్వా ప్రాంతాల్లో భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. దట్టమైన నల్లటి పొగ అలముకుంది. ఈ దాడుల్లో కనీసం 8 మంది ఇజ్రాయెల్ పౌరులు మృతి చెందారు. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ క్రమంలో టెహ్రాన్ విమానాశ్రయమే లక్ష్యంగా టెల్‌అవీవ్ దాడులు చేసింది. రెండు ఎఫ్-14 యుద్ధ విమానాలు ధ్వంసం అయ్యాయి. దీనిని సంబంధించిన విడియోను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ విడుదల చేసింది.

**జి-7 సదస్సు నుంచి అర్థాంతరంగా ట్రంప్ పయనం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోని సిట్యుయేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి. జి-7 సదస్సు నుంచి హుటాహుటిన స్వదేశానికి పయనమయ్యారు. దీంతో పశ్చిమాసియాలో ఏవో కీలక పరిణాలు చోటుచేసుకుంటున్నాయన్న సంకేతాలు ప్రపంచానికి వెళ్లాయి. గతంలో అల్‌ఖైదా అగ్రనేత బిన్‌లాడెన్, ఐసిస్ నాయకుడు అబూబకర్ అల్ బాగ్దాదీని అమెరికా సేనలు మట్టుపెట్టినప్పుడు కూడా అగ్రరాజ్యాధినేత ఈ గదిలోనే ఉండి ఆపరేషన్లు పరిశీలించారు.

**తక్షణమే టెహ్రాన్‌ను వీడండి.. ఇండియన్ ఎంబసీ అడ్వైజరీ**

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో భారతీయులకు ఇండియన్ ఎంబసీ తాజాగా మంగళవారం మళ్లీ అడ్వైజరీ జారీ చేసింది. టెహ్రాన్‌లోని భారతీయులంతా వెంటనే నగరాన్ని వీడి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. ఇప్పటివరకు ఎంబసీని సంప్రదించని భారతీయులు.. తక్షణమే అధికారులతో మాట్లాడి తమ లోకేషన్లను షేర్ చేయాలని సూచించింది. ఈ క్రమంలో హెల్ప్‌లైన్ నంబర్లు +98 9010144557, +98 9128109115, +98 9128109109 లకు తమ వివరాలు తెలియజేయాలని కోరింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతోంది. అమెరికా రాయబార కార్యాలయంతోపాటు పలు కార్యాలయాలను ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి 'ఆలస్యం చేయకుండా నగరాన్ని వీడాలి' అంటూ భారతీయుల కోసం భారత రాయబార కార్యాలయం అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం ఇరాన్‌లో సుమారు 10,000 మంది భారతీయులు ఉన్నట్లు ఓ అంచనా. వీళ్లలో ఆరు వేల మందికిపైగా విద్యార్థులే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**ఇరాన్ నుంచి 110 భారతీయ విద్యార్థుల తరలింపు**

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తం అయింది. భారతీయులను అలర్ట్ చేసింది. తక్షణమే ఖాళీ చేయించాలని సూచించింది. ఇందులో భాగంగా 110 మంది భారతీయ విద్యార్థులతో కూడిన మొదటి బ్యాచ్ అర్మేనియాం చేరుకుంది. బుధవారం ఉదయం కల్లా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు తరలించనున్నారు. ఈ మేరకు భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసింది. ఇక సొంత వనరులు కలిగిన వారు కూడా తరలి వెళ్లాలని పేర్కొంది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

**ఖమేనీ అంతంతోనే యుద్ధం ముగింపు: నెతన్యాహు**

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా ఖమేనీని అంతం చేస్తేనే యుద్ధం ముగుస్తుందని స్పష్టం చేశారు. ఖమేనీని హత్య చేసేందుకు వేసిన ప్లాన్‌ను ట్రంప్ వ్యతిరేకించారంటూ అమెరికా అధికారులు ధ్రువీకరించిన తర్వాత నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ ఆలస్యం!

>> తొలగించామన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల ఈనెల 26,27 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర బిఎల్ఏ, బిఎల్ఓలకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇస్తోందని చెప్పారు. నేషనల్ లెవెల్ లీగల్ కాన్ఫరెన్స్ కోసం ముగ్గురు న్యాయవాదులకు శిక్షణ ఇస్తోందని అన్నారు. రూరల్‌లో 87శాతం, అర్బన్‌లో 67శాతం ఓటర్, ఆధార్ కార్డ్ లింక్ జరిగిందని స్పష్టం చేశారు. రెండు, మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వచ్చిందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ ఇప్పుడే రాకపోవచ్చునని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ జూన్ 8న అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. దీంతో జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి హైకోర్టులో మళ్లీ చుక్కెదురు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఓ బెదిరింపుల కేసుకు సంబంధించి ఆయన దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ పై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. కమలాపురం మండలం వంగపల్లిలో గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్న మనోజ్ అనే వ్యాపారిని కౌశిక్ రెడ్డి బెదిరించారని ఆరోపణలు ఉన్నాయి. క్వారీ సక్రమంగా నడుపుకోవాలంటే తనకు రూ.50 లక్షలు ఇవ్వాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారని మనోజ్ భార్య ఉమాదేవి హనుమకొండ జిల్లా సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్ట్ అయ్యే అవకాశం ఉందన్న భావనతో పాడి కౌశిక్ రెడ్డి ముందస్తు బెయిల్ కోరుతూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం, పోలీసులు అరెస్ట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న కౌశిక్ రెడ్డి అభ్యర్థనను తోసిపుచ్చింది. కౌశిక్ రెడ్డి విజ్ఞప్తిని కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఉన్నత న్యాయస్థానం ప్రకటించింది.



మంగళవారం కోల్‌కతాలో సెక్రటేరియట్ ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

## హైదరాబాద్ నుంచి ఆఫ్రికాకు మొట్టమొదటిసారి విమాన సర్వీసు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** హైదరాబాద్ నుంచి ఆఫ్రికాకు నేరుగా మొట్టమొదటిసారి విమాన సర్వీసు అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాకు నాన్‌స్టాప్ సర్వీసులను ప్రారంభించారు. దీంతో హైదరాబాద్‌కు ఉన్నటువంటి గ్లోబల్ కనెక్టివిటీ మరింత బలపడింది. ఈ సేవలను ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ అనే సంస్థ నిర్వహిస్తోంది. హైదరాబాద్ నుంచి అడ్డిస్ అబాబాకు మంగళ, గురు, శనివారాల్లో, అడ్డిస్ అబాబా నుంచి హైదరాబాద్‌కు సోమ, బుధ, శుక్రవారాల్లో సర్వీసులు నడపనున్నారు. ఈ విమాన సర్వీసుతో అడ్డిస్ ఇథియోపియాతో భారత పర్యాటక, వ్యాపార ప్రయాణికులకు అనుకూలత లభించనుంది. మరోవైపుభారత్‌లో వైద్యం చేయించుకునేందుకు ఆఫ్రి కాలోని ఇథియోపియా, టాంజానియా, ఉగాండా, రువాండా, నైజీరియా, జాంబియా, కేమరూన్, కెన్యా దేశాల నుంచి అనేక మంది రోగులు వస్తుంటారు. అలాంటి వారికి ఈ విమాన సర్వీసు చాలా రకాలుగా ఉపయోగపడనుంది.

## 2023 ఎన్నికల్లో భారీగా ఫోన్ ట్యాపింగ్!

>> వెంకటస్వామికి చెందిన క ంపెనీ డబ్బులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల కంపెనీ డబ్బులు కూడా ఇదే రకంగా పోలీసులు ట్యాపింగ్ సహకారంతోనే పట్టుకున్నారని సిట్ అధికారుల విచార ణలో తేలిందని తెలిసింది. ముఖ్యంగా పోల్...2023 వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసిన ఫోన్ ట్యాపింగ్ యూనిట్ ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని సిట్ అధి కారుల విచారణలో తేలిందని తెలిసింది. అప్పట్లో ప్రతిపక్ష నేతల కదలికలను నిరంతరం గుర్తించేందుకు, ఎన్నికల కోసం వారు తరలించే డబ్బులను పోలీసుల సహకారంతో పట్టుకునేందుకు ఎస్ఐబి ఫోన్ ట్యాపింగ్ యూనిట్ సహకరించేందని సిట్ విచారణలో తేలిందని తెలిసింది. దీంతో పాటు బిఆర్ఎస్‌లో వుంటూ ది క్కార స్వరం వినిపించే నాయకులు, ప్రభుత్వంపై కన్నెర చేసిన బ్యూరోక్రాట్లు, తమకు వ్యతిరేకంగా వున్నట్లు అనుమానించిన జర్నలిస్టులు, జడ్జిలు, బడా వ్యా పారులు, సినీ తారలు, సెలబ్రటీల ఫోన్‌లను కూడా ఇదే విధంగా ట్యాపింగ్ చేసినట్లు సిట్ విచారణలో తేలిందని తెలిసింది. ముఖ్యంగా దిక్కార స్వరం వినిపి ంచిన బిఆర్ఎస్ నాయకులను దారికి తెచ్చుకునేందుకు ఫోన్ ట్యాపింగ్ యూనిట్ తనవంతుగా సహకరించిందని సిట్ విచారణలో తేలిందని తెలిసింది. వీరితో పాటు అప్పట్లో తెలంగాణలో పాదయాత్ర చేసిన వైకాపా నాయకురాలు వై.ఎస్ షర్మిల, నాటి ఎపి ప్రతిపక్ష నేతలు, తెలంగాణ బిజెపి నేతల ఫోన్‌లను కూడా ఫోన్ ట్యాపింగ్ యూనిట్ ట్యాపింగ్ చేసిందని సిట్ విచారణలో తేలిందని తెలిసింది. అప్పట్లో తెలంగాణలో బిజెపి తరపున విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఈ టల రాజేందర్, బండి సంజయ్, అర్వింద్, ప్రేమేందర్, రఘునందన్ రావుల ఫోన్‌లను ఎస్ఐబి ట్యాపింగ్ చేసి వారి కదలికలను సర్కారుకు నిరంతరం చేరవే సిందని సిట్ గుర్తించిందని తెలిసింది. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌కు చెందిన ఇద్దరు అధికారులు వ్యాపారులు, సినీ తారలను బెదిరించి కోట్లాది రూ పాయలు దండుకున్నారని సిట్ నిర్ధారించిందని తెలిసింది. అయితే దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని సిట్ విచారణలో తేలిందని సమాచారం. నిబంధనల మేరకు రివ్యూ కమిటీ ట్యాపింగ్ చేయాల్సిన నంబర్లు ఎవరివి...? వారు నిజంగానే అసాంఘీక శ క్తులకు సహకరిస్తున్నారా...? శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారా...? అనేది చూడాల్సి వున్నా ఎస్ఐబి అందించిన చిట్టాను గుడ్డిగా ఆమోదించిందని సిట్ విచారణలో వెల్లడయినట్లు తెలిసింది. అప్పట్లో కొన్నిసార్లు రోజుకు 500 నుంచి 600పైగా ఫోన్‌లు ట్యాపింగ్ అయినట్లు సిట్ విచారణలో వెలుగు చూసిందని తేలింది. మొత్తం మీద అప్పట్లో నాలుగు వేల 500 వరకు ఫోన్‌లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ నిర్ధారించిందని తెలిసింది. మొత్తం మీద అప్పట్లో 4200పైగా ఫోన్లను ఎస్ఐబి ట్యాపింగ్ చేసినట్లు సిట్ విచారణలో తేలిందని సమాచారం.

**నేడు సిట్ ఎదుట విచారణకు ప్రభాకర్ రావు...నలుగురు నిందితులతో కలిపి విచారించే అవకాశం...?**

ఇదిలావుండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు బుధవారం నాడు మరోసారి సిట్ ఎదుట విచారణకు రానున్నారు. ఆయనను ఇ ప్పటికే మూడుసార్లు విచారించడం తెలిసిందే. నాలుగవసారి జరగనున్న విచారణలో ఆయనతో పాటు ఈ కేసులో వున్న నలుగురు నిందితులను కూడా భాగ స్వామ్యం చేయాలని సిట్ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఈ కేసుకు సంబంధించి తాజాగా వెలుగు చూసిన వివరాలతో పాటు మంగళవారం నాడు కొం దరు సాక్షులు, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రభాకర్ రావును విచారించేందుకు సిట్ సిద్దమవుతోంది. మరోవైపు బుధవారం నాడు బిజెపి నేతలు ఈటల రాజేందర్‌తోత పాటు మరో ఇద్దరు సిట్ కార్యాలయానికి వచ్చి ఫోన్ ట్యాపింగ్‌పై తమ వాంగ్మూలం ఇవ్వనున్నారని సమాచారం. దీని తరువాత మరి కొందరు కూడా వాంగ్మూలం ఇవ్వనున్నట్లు తెలిసింది.

## ఇరాన్ క్షిపణుల వర్షం

>> క్రమంలోనే ఐదో రోజు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ దాడికి పాల్పడింది. అత్యంత కచ్చితత్వంతో మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై క్షిపణుల వర్షం కురిపించినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. అంతేకాకుండా గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ మిలటరీ ఇంటెలిజెన్స్ కాంప్లెక్స్ పైనా క్షిపణి ప్రయోగించినట్లు తెలిపింది.

ఇజ్రాయెల్ పక్కా ప్రణాళికలతో దాడులు చేస్తోందంటే.. దానికి కారణం కచ్చితంగా మొస్సాద్ సంస్థే. ఇరాన్‌లో అణుస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయన్న సంగతి నుంచి.. కీలక అధికారులు, శాస్త్రవేత్తల గృహాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఇజ్రాయెల్‌కు చేరవేసింది. అంతేకాకుండా ముందుగానే ఇరాన్‌కు భారీ మొత్తంలో డ్రోన్లను తరలించి ఇజ్రాయెల్ కోవర్ట్ ఆపరేషన్ నిర్వహించడం వెనుకా ఈ సంస్థ హస్తముంది. ఈ నేపథ్యంలోనే మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ క్షిపణి ప్రయోగించినట్లు తెలుస్తోంది.

మరోవైపు చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మధ్యవర్తుల ద్వారా అటు ఇజ్రాయెల్, ఇటు అమెరికాలకు సమాచారం ఇచ్చిన ఇరాన్.. దాడులు మాత్రం ఆపడం లేదు. ఇరు దేశాల మధ్య మొదలైన ఈ సంఘర్షణపై ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి ఇది ఎక్కడి వరకు దారితీస్తుందో తెలియని పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే కెనడాలో జరుగుతున్న జి-7 సదస్సుకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మధ్యలోనే తన పర్యటన ముగించుకొని ఆగమేఘాల మీద అమెరికా పయనమయ్యారు. ఇరాన్ చేపడుతున్న అణుకార్యక్రమానికి నిజమైన ముగింపు ఉండాలని ఆయన చెప్పడం.. యుద్ధం తీవ్రత మరింత పెరుగుతుందన్న సంకేతాలు ఇస్తోంది.

## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులకు సహాయం అందించేందుకు, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి లభించిన తాజా సమాచారం ప్రకారం, ఇప్పటి వరకు తెలంగాణకు చెందిన ఎవరూ ప్రభావితమైనట్టు సమాచారం లేదు. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడమైనది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశానుసారం, తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. సహాయం కోసం ప్రజలు ఈ కింది నెంబర్లను సంప్రదించవచ్చునని ప్రభుత్వం తెలిపింది.

వందన, పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్ -+91 9871999044
జి. రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ - +91 9643723157
జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్ - +91 9910014749
సిహెచ్. చక్రవర్తి, పౌరసంబంధాల అధికారి - +91 9949351270.

## రాష్ట్రానికి భారీ వర్ష సూచన

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** దక్షి ణ ఒడిశా వద్ద ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో పలు చోట్ల ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేదీన తెలంగాణలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ బిగ్ రెయిన్ అలర్ట్ ప్రకటించింది. రాష్ట్రంలోని భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలతో పాటు, ఇతర జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉదని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

## రెండో రోజు రూ.1,552 కోట్లు జమ

>> అలాగే అత్యల్పంగా మల్కాజిగిరి జిల్లాలో 4,302 మంది రైతులకు గాను 2,57,67,428 రూపాయలను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. కాగా రాష్ట్రంలో ఎవరైతే కొత్తగా పట్టాదారు పాస్ బుక్కులు పొందిన రైతలకు ఈ వానాకాలం సీజన్ నుంచి రైతు భరోసా అమలు చేయనున్నట్లుగా ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 5 వరకు పాస్ బుక్కులు పొందిన వారి నుంచి కొత్తగా దరఖాస్తులను స్వీకరిస్తుంది. ఇందుకు గడువు ఈనెల 20తో ముగుస్తుండటంతో పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా, ఆధార్ జిరాక్స్‌లతో సంబంధిత ఏఈవోల వద్ద రైతులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. వెరిఫికేషన్ పూర్తయ్యాక అర్హులైన వారి ఖాతాలో పెట్టుబడి సాయాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు.

# అసలా.. నకిలీయా?



**హైదరాబాద్‌లో భారీగా దొంగనోట్ల చెలామణి**

**ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా మోసపోయినట్లే**

**నకిలీ కరెన్సీపై లోపించిన పోలీసుల నిఘా**

**దృష్టిసారించాలంటున్న వ్యాపారస్తులు, ప్రజలు**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** నగరంలో దొంగనోట్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ కనిపిస్తుండడంతో ఏదీ అసలు..నకిలీ తెలుసుకునే పరిస్థితి లేకుండా పోతోంది. బస్తీలు, మురికివాడలు, నిరక్షరాస్యులు, వృద్ధ వ్యాపారులే టార్గెట్‌గా అక్రమార్కులు దొంగనోట్ల లావాదేవీలు జరుపుతున్నారు. ఇది కాస్తా చేతులుమారి ఒక ముఠాగా ఏర్పడి నకిలీ కరెన్సీ రాజ్యమేలుతోందని అర్థమవుతుంది. పేద వ్యాపారస్తుల నుంచి హోల్‌సేల్ దుకాణాలు, ఆపై డిస్ట్రిబ్యూటర్స్‌తో అంతటా వ్యాపిస్తోంది. పలు ప్రాంతంలో నకిలీ నోట్లు చలామణి కావడంతో గుబులుపుట్టిస్తోంది. సాధారణంగా చేతులు మారుతున్న అంతగా గమనించకపోవడంతో బహిరంగం కావడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. విద్యావంతులు, బ్యాంకు అధికారులే నోటును గుర్తించే అవకాశం ఉంటుంది

**చిన్నవ్యాపారస్తులు, సంస్థలే టార్గెట్...**

అసలు నోటుకు, నకిలీకి చిన్నపాటి తేడా కనిపిస్తుంది. గ్రీన్ రంగులో ఉన్న రూ.500 నోటులో దొంగనోటులో రంగు పులిమినట్లు కనిపిస్తుంది. ఇవన్నీ సామాన్య వ్యాపారస్తులకు తెలియకపోవడంతో రూ.500 నుంచి 10వేల వరకు లావాదేవీలు జరుపుతున్నారు. తెలిసేలోపు మరో పదంతుల నష్టం మోసపోతున్నారు. నగరంలోని సికింద్రాబాద్, అమీర్‌పేట, లక్డీకాపూల్, ఎల్బీనగర్, ఉప్పల్, అంబర్‌పేటతో పాటు ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నకిలీవి కలాపాలు సాగుతున్నాయి. ఏళ్ల నుంచి దందా సాగుతున్న పోలీసుల కంటపడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే అక్రమార్కులు కూడా గుర్తుపట్టకుండా అసలు పైన నకిలీ నోటు కింద అమరుస్తూ గందరగోళాన్ని సృష్టిసున్నట్లు తెలుస్తోంది. అసలు నోటుకు కమిషన్ అనేది లేకుండా జాగ్రత్త పడుతున్నారు. చిన్నపాటి కిరాణాలు, వివిధరకాల సంస్థలు, క్యాబ్, ఆటోలు ఇలా అక్కడకక్కడ పంపిణి చేస్తున్నారనే విషయాలు వెలుగుచూస్తున్నాయి.

**ఇలా గుర్తించండి...**

రూ.500 కరెన్సీ నోటుపై కొన్ని చిహ్నాల ఆధారంగా నకిలీ నోటును గుర్తించవచ్చు. ప్రధాన ఫీచర్ లో నోటుపై కనిపించే సెక్యూరిటీ థ్రెడ్ ఒకటి. కంటికి ఎదురుగా పట్టుకుని చూసినట్లయితే.. నోటు మధ్యలో గ్రీన్ కలర్ థ్రెడ్ అనేది కనిపిస్తుంటుంది. కొంచెం వంచి చూస్తే అది నీలం రంగులోకి మారుతుంది. ఎదురుగా ఆకు పచ్చ రంగులో ఉన్న థ్రెడ్, 45 డిగ్రీల కోణంలో బ్లూ రంగులోకి మారుతుంది. ఈ మార్పు నకిలీ కరెన్సీ నోట్లలో ఉండదు. ఇది కేవలం నోట్ల ముద్రణాలయంలోనే రహస్యంగా ఉంచుతారు. అదేవిధంగా కరెన్సీ ఎడమ వైపున కింది భాగంలో ఓ ఇమేజ్ కనిపిస్తుంది. దీనినే లాటెంట్ అంటారు.

**నకిలీ కరెన్సీపై పోలీసుల దృష్టి ఏదీ?**

సాధారణ నేరాలపై పోలీసులు తనిఖీలు, దర్యాప్తులని నకిలీ కరెన్సీలపై దృష్టిసారించడం లేదని తెలుస్తోంది. గతేడాది బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీనోట్ల గుట్టురట్టయింది. తర్వాత నగరంలో పెద్ద ఎత్తున అక్రమార్కుల ముఠా అక్కడదక్కడ రహస్యంగా చెలామణి చేసుందని విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి వ్యాపారసంస్థలు, మిడిల్‌క్లాస్ సంస్థలు, కిరాణాలతో పాటు తదితర లావాదేవీలు జరిగే చోట పోలీసులు నిఘా పెట్టడమే కాకుండా దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

జిరాక్స్ సెంటర్లు, తదితర కలాపాలపై నిరంతరం కన్నేసి ఉంచాలి. ఇలాగే వదిలేస్తే పెనుముప్పు వాటిల్లే అవకాశం ఉందని బ్యాకింగ్‌రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అప్పుడు అసలుకు విలువలేకుండా పోతుందని పేర్కొంటున్నారు.

## నేటి నుంచి టెట్-2025 పరీక్షలు

**30 వరకు సిబిటి విధానంలో ఎగ్జామ్స్**

**ఉదయం 9 నుంచి 11.30 వరకు..**

**మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు**

**15 జిల్లాల్లో 66 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు**

**పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్**


**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) -2025 పరీక్షలు నేటి(బుధవారం-జూన్ 18) నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఈ నెల 30 వరకు కొనసాగనున్నాయి. పరీక్షలను రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 66 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్య డైరక్టర్ ఈ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను 9 రోజులపాటు 16 సెషన్‌లలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షలను ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్ధిపేట, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేసినట్టు అధికారులు తెలిపారు. పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య శాఖ ఇప్పటికే జారీ చేయగా.. అభ్యర్థులకి సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 9 నుంచే అందుబాటులో ఉంచారు. పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటీ) విధానంలో నిర్వహించనున్నారు. రోజూ రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. మొదటి సెషన్‌ను ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు నిర్వహించనుండగా మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి 4:30 గంటల వరకు నిర్వహిస్తారు. టెట్ పరీక్షలకి సంబంధించిన షెడ్యూల్‌లో పరీక్షల నిర్వహణ తేదీలు, సెషన్లు, సబ్జెక్టులు, జిల్లాల వివరాలతో పూర్తి షెడ్యూల్‌ను పాఠశాల విద్య శాఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. టెట్-2025కి సంబంధించిన దరఖాస్తులను ఏప్రిల్ 15 నుంచి 30వరకు స్వీకరించిన విషయం తెలిసిందే. టెట్ పరీక్షలకు రాష్ట్రంలో 1,83,653 దరఖాస్తులు వచ్చాయి. అందులో పేపర్-1కి 63,261 మంది, పేపర్-2కి 1,20,392మంది దరఖాస్తు చేసుకోగా.. 2 పేపర్లకు కలిపి 15,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందుకు సంబంధించిన పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

## ధరణి పోర్టల్‌లో అక్రమాలపై కేరళ ప్రభుత్వ సంస్థకు ఫోరెన్సిక్ ఆడిట్

**హైదరాబాద్ జూన్ 17 ప్రభాతవార్త:** ధరణి పోర్టల్లో అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని తీసుకున్న నిర్ణయం తాజాగా ప్రారంభం అయింది. కాగా అక్రమాలపై ఆడిట్ బాధ్యతలను కేరళ ప్రభుత్వ సంస్థకు ఫోరెన్సిక్ ఆడిట్ కి అప్పగించారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలో మొదట ఆడిట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ఫలితాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. ఈ ఆడిట్‌లో 2020 అక్టోబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు జరిగిన లావాదేవీలపై దర్యాప్తు కొనసాగనుంది. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ పరిధిలో నిషేధిత భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం అందుతుంది. 4 నెలల్లో రెండు జిల్లాల ఆడిట్ నివేదికలు పూర్తి చేసి డిసెంబర్ నాటికి రాష్ట్ర స్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం ముందు సాగుతుంది. కాగా బిఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణతో 2014 నుంచి 2023 వరకు లక్షల ఎకరాలు అక్రమంగా చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే.

## నేడు మంత్రులతో ముఖాముఖిలో తుమ్మల

**హైదరాబాద్, జూన్ 17,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ప్రతి బుధవారం గాంధీ భవన్ లో జరుగుతున్న మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని కాంగ్రెస్ గాంధీభవన్ పిఆర్‌వో కప్పర హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ భవన్ లో జరిగే మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వినతులు సమర్పించుకోవాలని ఆయన కోరారు.




## బహరేన్‌లో తొమ్మిది మంది అరెస్ట్

**సహాయం కోసం ప్రవాసీ ప్రజావాణిని**

**ఆశ్రయించిన బాధిత కుటుంబ సభ్యులు**

**హైదరాబాద్(బేగంపేట), జూన్ 17,ప్రభాతవార్త:** బహరేన్ లోని అల్ మోయ్యాద్ కంపెనీలో డ్రైవర్లు గా పనిచేస్తున్న తొమ్మిది మంది తెలంగాణ వాసులను ఇంధనం దుర్వినియోగం కేసులో ఇటీవల అరెస్ట్ చేసిన విషయం వెలుగు లోకి వచ్చింది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన డ్రైవర్ బొమ్మిడి సుదర్శన్‌తో పాటు మరో ఎనిమిది మంది ఈ కేసులో ఈ నెల 4న అరెస్ట్ అయ్యారని, వారికి న్యాయ సహాయం అందించాలని ఆయన కుమారుడు నితిన్ మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లోని ప్రవాసీ ప్రజావాణీలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పేరుతో వినతి పత్రం సమర్పించారు. ఎన్నారై అడ్వయిజరీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్లు సింగిరెడ్డి నరేష్ రెడ్డి ,గుగ్గిళ్ల రవిగౌడ్, నంగి దేవేందర్‌రెడ్డితోపాటు బొజ్జ అమరేందర్ రెడ్డిలను కలిసిన నితిన్ తన తండ్రిని, మరో ఎనిమిది మందిని బహరేన్ జైలు నుంచి విడిపించాలని కోరారు.

## హైదరాబాద్ నుంచి ఆఫ్రికాకు విమాన సేవలు

**శంషాబాద్ జూన్ 17, ప్రభాతవార్త :** జీఎంఆర్ హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుండి ఆఫ్రికా ఖండానికి నేరుగా విమాన సేవలు ప్రారంభం అయ్యాయి. , ఇథియోపియన్ ఎయిర్ లైన్స్ హైదరాబాద్ నుండి అడ్డిస్ అబాబాకు నాన్ స్టాప్ సేవలను ప్రారంభించింది . దేశీయ అంతర్జాతీయ విమాన సేవల విస్తరణలో మరో కీలక ఘట్టాన్ని ప్రారంభించింది. అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో విమానాశ్రయాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలుస్తుండగా, ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాలోని బోల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు నేరుగా ప్రారంభమైన ఈ సర్వీసు మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ ఎయిర్పోర్ట్ సీఈవో. మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ పనికర్ సీనియర్ అధికారులతో పాటు, ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సేవలను ఆఫ్రికాలో అతిపెద్ద, అత్యంత విశ్వసనీయమైన విమానయాన సంస్థ అయిన ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది.




రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్సీ కవిత

## 42 శాతం ఇవ్వకపోతే ఎన్నికలు జరగనివ్వం

**ఢిల్లీకి సెగ తాకేలా జూలై 17న రైల్ రోకో**

**తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి తో బిసిలు ఉద్యమించాలి: ఎంఎల్సీ కవిత**

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 17, ప్రభాత వార్త:** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో నేడు బీసీ యువకులు, మహిళలు, విద్యార్థులు తమ హక్కుల సాధనకు ఉద్యమ చేయాలని బీఆర్ ఎస్ ఎంఎల్సీ కవిత పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం లోని హెచ్ కన్వెన్షన్‌లో యునైటెడ్ పూలే ఫ్రంట్ , తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ లకు 42 రిజర్వేషన్ కామారెడ్డి డిక్లరేషన్ పెయిన్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్సీ కవిత మాట్లాడుతూ బీసీలు పోరాడాల్సి న సమయం లో మౌనంగా ఉంటే నష్టపోతారని ఇప్పటికైనా అన్ని బీసీ కులాలు ఐక్యంగా పోరాడాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ పైన చేసిన ఉద్యమ ఫలితంగానే అసెంబ్లీ లో బిల్లు పెట్టారన్నారు. కానీ అసెంబ్లీలో బిల్లు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఇప్పుడు డిల్లీకి తెలంగాణ బీసీల పౌరుషం ఎలా ఉంటుందో చూపించాల్సి న సమయం వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడి కులగణన చేశారని అ గణన సరైంది అయితే గ్రామాల్లో పంచాయితీ లో పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ లెక్క తెలెవరకు స్థానిక ఎన్నికలు జరగనివ్వం అని హెచ్చరించారు. ఢిల్లీ కి సెగ తగిలేలా జూలై 17 న రాష్ట వ్యాప్తంగా రైల్ రోకో కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అన్ని బీసీ సంఘాలని ఏకం చేస్తామని అందులో భాగంగాని అన్ని జిలాల్లో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నాం అన్నారు. బీసీ ఓట్లతో గెలిచిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజు బీసీల కోసం మాట్లాడలేదన్నారు. ఆయనకు చిత్త శుద్ధి ఉంటే ఢిల్లీ లో బీసీ బిల్లు ఆమోదం పొందేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో యూపీఎఫ్ స్టేట్ కన్వీనర్ బొల్లా శివశంకర్, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, నాయకులు సంపత్ గౌడ్, ఈగ సంతోష్, నరేందర్ యాదవ్, లింగం, ఆనంద్, లలిత యాదవ్, మహేందర్ ముధిరాజ్, శ్రీకాంత్, రాధాకృష్ణ, తేజ, యూపీఎఫ్ స్టేట్ కో ఆర్డినేటర్ ఆలకుంట హరి, కో కన్వీనర్లు కొట్టాల యాదగిరి, విజయేంద్ర సాగర, కుమారస్వామి, గోపు సదానందం, కార్మిక సంఘం నాయకుడు ఎల్. రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎసిబికి అందనున్న కెటిఆర్ సెల్‌ఫోన్లు

**మ్యాక్ బుక్, లాప్‌టాప్‌లోని సమాచారం ఆధారంగా మలిదఫా విచారణకు ఎసిబి సన్నద్ధం**

**ఫార్ములా ఇ కార్ రేసు కేసు**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసులో మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ నాయకుడు కెటిఆర్ రేసింగ్ సమయం లో వాడిన సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్‌ను బుధవారం నాడు ఎసిబి అధికారులకు అందించనున్నారని తెలిసింది. సోమవారం నాడు ఈ కేసుకు సంబంధి ంచి ఎసిబి అధికారుల విచారణలో కెటిఆర్ పాల్గొనడం తెలిసిందే. మొత్తం ఎనిమిది గంటల పాటు సాగిన ఈ విచారణలో ఎసిబి అధికారులు అనేక అంశాలపై ఆయనను విచారించడం తెలిసిందే. ఈ విచారణపై ఎసిబి అధికారులు మీడియాకు ఎలాంటి వివరాలు వెల్లడించనప్పటికీ కార్ రేసు సమయంలో కెటిఆర్ వాడిన సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్‌ను ఇవ్వాలని కోరారు. అయితే ఇవి తన వద్ద ఇప్పుడు లేవని కెటిఆర్ చెప్పగా బుధవారంలోగా తమకు అప్పగించాలని ఆదే శించారు. అయితే ఎసిబి విచారణపై కెటిఆర్ భిన్నంగా స్పందించారు. తనను ప్రశ్నల పేరిట ఎసిబి విసిగించిందని తెలిపారు. ఇదో పనికిమాలిన కేసుగా ఆయ న అభివర్ణించారు. కార్ రేసు సమయంలో కెటిఆర్ వాడిన సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్ ఎసిబికి ఇచ్చేందుకు కెటిఆర్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. బు ధవారం మధ్యాహ్నం వీటిని ఆయన ఎసిబి అధికారులకు అందజేయనున్నారని తెలిసింది. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా ఎసిబి విచారణకు సహకరిస్తానని కె టిఆర్ చెప్పడం తెలిసిందే. మరోవైపు తాను గతంలో వాడిన సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్‌ను ఎసిబికి అప్పగించే విషయమై న్యాయ నిపుణుల సలహా తీ సుకోవాలని కెటిఆర్ భావిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. దీనిపై బుధవారం మధ్యాహ్నం తరువాత స్పష్టత వచ్చే వీలుంది. కాగా కెటిఆర్ అప్పగించే వస్తువుల కో సం ఎసిబి అధికారులు కూడా ఎదురు చూస్తున్నారు. కెటిఆర్ నుంచి అందే సెల్‌ఫోన్లు, మ్యాక్ బుక్, లాప్‌టాప్‌ను ఓపెన్ చేసి అందులోని సమాచారాన్ని క్రోడీక రించి ఫార్ములా ఈ కార్ రేసుపై మలిదఫా విచారణ చేయాలని ఎసిబి అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ ఇందులో సరైన సమాచారం లేకుంటే ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపి డిలిట్ అయిన సమాచారాన్ని తిరిగి వెలికితీయించాలని వారు భావిస్తున్నారు. ఇలా జరిగితే మలిదఫా విచారణ ఆలస్యం అయ్యే వీలుంది. దీని తరువాత ఈ కేసులో నిందితులుగా వున్న సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, బిఎల్‌ఎన్ రెడ్డిలను మరోదఫా విచారించాలని ఎసిబి అధికారులు భావిస్తున్నారు. వీరిని విచారించిన తరువాత వెలుగుచూసే సమాచారం ఆధారంగా కెటిఆర్‌ను ఇంకోసాని విచారించి ఆ తరువాత అవసరమైతే ఒకరిద్దరిని అరెస్టు చేసి, చివరగా దీనిపై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాలని ఎసిబి అధికారులు భావిస్తున్నారు.

## ఘనంగా శ్రీచైతన్య ఐరావత్ ఛాంపియన్స్ వేడుక

**విశిష్ట అతిథులుగా ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు, నటుడు అడివి శేష్**

**శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు**




**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ఆరాష్ట్రంలో జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటి-జెఇఇ(మెయిన్ అండ్ అడ్వాన్స్‌డ్), నీట్-2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి తన అగ్రస్థానాన్ని నిరూపించుకుని, ఆలిండియా నంబర్ వన్‌గా నిలిచిన సందర్భంగా "ఐరావత్ చాంపియన్స్ వేడుక" ను ఘనంగా నిర్వహించింది. హైటెక్ సిటీ శిల్ప కళావేదికలో అంగరంగ వైభవంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య టాపర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున ఈ స్ఫూర్తిదాయక వేడుకలో పాల్గొన్నారు. ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమంగా, సాధకులను సత్కరించే వేదికగా "ఐరావత్" నిలిచింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు, సినీ నటుడు అడివి శేష్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా శ్రీచైతన్య డైరెక్టర్లు శ్రీధర్ యలమంచిలి, సుష్మా బొప్పన, సీమ బొప్పన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక సన్మానాలు చేశారు. శాస్త్రీయ శిక్షణతో, అత్యాధునిక మౌలిక వసతులతో ముందంజలో ఉన్న శ్రీచైతన్య విజయం వెనుక ఉన్న కలలు, కృషిని ఈ వేడుక మరోసారి చాటిచెప్పింది. గుకేష్ దొమ్మరాజు మాట్లాడుతూ "చదరంగం మాదిరిగానే, జెఇఇ అండ్ నీట్ వంటి పోటీ పరీక్షల విజయానికి వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, మానసిక స్థైర్యం ఎంతో అవసరం. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ఈ నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రేరణనిచ్చే అవకాశాన్ని నేను నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. సినీ నటుడు అడివి శేష్ మాట్లాడుతూ.. "202565 జెఇఇ అండ్ నీట్ పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన ప్రతి శ్రీచైతన్య విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు. ఈ విజయాల వెనుక ఉన్న ప్రణాళిక, అంకితభావం అభినందనీయం. ఇంజనీరింగ్, మెడికల్ రంగాల్లో దేశవ్యాప్తంగా ప్రతిభావంతులను అందిస్తూ శ్రీచైతన్య విద్యాసంస్థలు ఓ మార్గదర్శక శక్తిగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ.. భారతీయ చెస్ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన గుకేష్ దొమ్మరాజును బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. చిన్న వయస్సులోనే గుకేష్ సాధించిన అసాధారణ విజయాలు పాఠశాల విద్యార్థుల నుండి జెఇఇ, నీట్ అభ్యర్థుల వరకు ప్రేరణగా నిలిచాయి. శ్రీచైతన్యలో, మేము విద్యార్థులను సమస్య పరిష్కారం, విశ్లేషణాత్మక నైపుణ్యాలతో అభివృద్ధి చేసేందుకు మేము అంకితభావంతో ఉన్నాము. గుకేష్ సామర్థ్యాలు, సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటానికి అవసరమైన నైపుణ్యాలతో పోటీ పరీక్షలలో విజయాన్ని సాధించడంలో విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటాయి.

శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమా బొప్పన మాట్లాడుతూ.. "గుకేష్ దొమ్మరాజు శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించటం గర్వకారణం. గుకేష్ ప్రేరణతో విద్యార్థులు మరింత దృఢంగా ముందుకు సాగుతారని మేము నమ్ముతున్నాం" అని తెలిపారు.

## స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలు చేయాలి

**మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళా సాధికారత**

**బిసి గురుకులాల్లో ఒక్క సీటు ఖాళీగా ఉండకూడదు**

**రవాణా, బిసి సంక్షేమ శాఖల సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలను నిర్వహించాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోని బిసి గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకుండా చూడాలన్నారు. బిసి సంక్షేమ శాఖతోపాటు రవాణా శాఖపై మంత్రి పొన్నం మంగళవారం సచివాలయంలో రెండు శాఖల అధికారులతో సమీక్షను నిర్వహించారు. సమీక్షా సమావేశంలో రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, బిసి సంక్షేమ శాఖ సెక్రటరీ శ్రీధర్, గురుకుల సెక్రటరీ సైదులు, రవాణా శాఖ జేటిసిలు, ఆర్‌టిసి అధికారులు, బిసి సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా స్కూల్స్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో చేసిన కార్యక్రమాలు పాఠశాలలో నిరంతరం చేపట్టాలని, ప్రతి స్కూల్‌లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్ నెస్ పార్కులు ఏర్పాటయ్యేలా రవాణా శాఖ అధికారులు స్థానిక నాయకులతో కలిసి సమన్వయం చేసుకోవాలన్నారు. వేసవి సెలవుల అనంతరం స్కూల్స్ ఇప్పుడిప్పుడే ప్రారంభం అయినందున నిరంతరం స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-పాలసీ ఫలితాలు అందిస్తుందని ఎక్కువగా ఈ వాహనాలు వైపు మొగ్గుచూపుతున్నారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌టిసిలో ఇప్పటి వరకు 186.5కోట్ల మంది మహిళలు రూ. 6222 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణాన్ని చేశారని పేర్కొన్నారు. మహాలక్ష్మీ పథకం విజయవంతానికి ఆర్‌టిసి ఉద్యోగుల శ్రమను అభినందించారు. ఉద్యోగుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత తమ తొలి ప్రాధాన్యం అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలో హైదరాబాద్‌లో నడిచే ఆర్‌టిసి బస్సులు పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే ప్రయత్నంలో వాటి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల వారి ఆదాయం ఆదా అవడంతో పాటు మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి పొన్నం పేర్కొన్నారు. రాష్ట్రంలోని బిసి గురుకులాల్లో అడ్మిషన్‌ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఏ ఒక్క గురుకులంలో కూడా ఖాళీ సీట్లు కనిపించకూడదని ఆదేశించారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం గత సంవత్సరం మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిన తరువాత గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## మెడికల్ కాలేజీల నోటీసులపై అసత్య ప్రచారం

**ఫ్యాకల్టీ కొరత, మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నాం**

**విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని కాలేజీలకు అనుమతులు వస్తాయి: వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరేంద్ర కుమార్**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసి) రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు నోటీసులు జారీ చేయడంపై అసత్య ప్రచారం జరుగుతోందని వైద్య విద్య డైరెక్టర్(డిఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ అన్నారు. ఎన్ఎంసి నోటీసులపై వివరణ ఇస్తూ డిఎంఈ మంగళవారం ఒక వీడియో విడుదల చేశారు. సాధారణంగా అకడమిక్ ఇయర్ ప్రారంభానికి ముందు, మెడికల్ కాలేజీలలో ఎన్ఎంసీ ఇన్‌స్పెక్షన్లు చేయడం, నోటీసులు ఇవ్వడం సహజంగా జరిగే ప్రక్రియేనని డిఎంఈ తెలిపారు. గత 4 సంవత్సరాలుగా నోటీసులు వస్తూనే ఉన్నాయని.. నోటీసుల్లో పేర్కొన్న వాటిని సరిచేసుకుంటూనే ఉంటామన్నారు. ఈ సంవత్సరం కూడా ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక సహా అన్ని రాష్ట్రాల్లోని కాలేజీలకూ ఎన్ఎంసి నుంచి నోటీసులు వచ్చాయని తెలిపారు. మన రాష్ట్రంలోని కాలేజీలకు మాత్రమే నోటీసులు వచ్చినట్టుగా, నోటీసులు రావడం ఇదే మొదటిసారి అన్నట్టుగా అపోహలు సృష్టించి, తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఒకేసారి ఎక్కువ కాలేజీలు ఏర్పాటు చేయడం వల్ల ఫ్యాకల్టీ కొరత, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. వాటన్నింటినీ అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డిఎంఈ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. అందుకోసం అవసరమైన బడ్జెట్ కేటాయిస్తూ జీవోలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే అన్ని మెడికల్ కాలేజీలకూ పర్మిషన్లు వస్తాయని.. ఎలాంటి ఇబ్బంది ఉండదదని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు.

**BEFORE THE HONE'BLE DEBTS RECOVERY TRIBUNAL-II**
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
**O. A. No.197 of 2025**

**BETWEEN**
HDFC Bank Limited ...Applicant
And
M/s. Shri Agarwal Enterprises and Other ...Defendant(s)

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
1. **M/s. Shri Agarwal Enterprises,** Rep by its Partners, Registered Office at 16-7-91, Old Grain Market, Opp: Ganga Hospital, Warangal - 506 002, Talangana State. -Borrower
2. **Mr. Mohammed Ayub Khan,** S/o. Yousuf Khan Mohammed, Age: 62 Years, Occ: Business, 15/308, Papaiahpet, Opp: Key High School, Warangal - 506002, Telangana State. -Partner
3. **Mr. Manish Kumar Agarwal,** S/o. Agarwal Pradeeep, Age: 40 years, Occ: Business, H. No. 7-1-29, Sain Nagar, Balasamudram, Hanmakonda - 506001, Telangana State. -Partner
4. **Mr. Mirza Haseeb Baig,** S/o. Mirza Habib Rahman Baig, Age 71 Years, Occ: Business, 12-2-800/45, Dilshad Nagar Colony, Mehdipatnam, Humayun Nagar, Hyderabad - 500028, Telangana State. -Partner
5. **Mr. Deva Mahender,** S/o. Sammaiah, Age: 47 years, Occ: Business, 15-03-229, Muncipal Offie road, Opp. Musical Garden, Rangampet, Warangal - 506007, Telangana State. -Partner
6. **Mrs. Deva Latha,** W/o. Deva Mahender, Age: Major, Occ: Business, 15-3-229, Muncipal Office Road, Opp. Musical Garden, Rangampet, Warangal - 506007, Telangana State. -Partner
7. **M/s. Maheswara Industries,** rep. by its Managing Partners, Mr. Deva Mahendar & Mrs. Deva Latha, 15-3-229, Muncipal Office Road, Opp. Musical Garden, Rangampet, Warangal - 506007, Telangana State. -Proforma Party ...Defendants

Please take the summons in the above **O.A. No. 197 of 2025** filed by the Applicant for recovery of money of **Rs. 1,22,30,504.66 Ps**against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"Vaartha" Hyderabad and Warangal Editions"** Newspaper and posted the matter to **28-07-2025.**

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **28.07.2025 at 10.30 a.m.** at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001 in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this the **12th day of June 2025.**
(By order of the Court)
Asst. Registrar
Debts Recovery Tribunal - II

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G లిమిటెడ్**
**ఆపరేషన్ బంజారాహిల్స్ సర్కిల్**
**టెండర్ ప్రకటన. 03/2025-26 (పత్రికా ప్రకటన)**
TGSPDCL ఈ క్రింద పేర్కొన్న వివరణలలో అనుభవం ఉన్న వివిధ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు మరియు సీల్డ్ బిడ్స్ ఆహ్వానిస్తూ ఉద్దేశిస్తోంది. 1) అమీర్‌పేట సబ్ డివిజన్‌లో అన్ని తయారీల RMUల యొక్క వార్షిక ప్రివెంటివ్ నిర్వహణ, బ్రేక్‌డౌన్ నిర్వహణ మరియు ఫ్యాక్టరీ మరమ్మతు. 2) జూబ్లీహిల్స్ సబ్ డివిజన్‌లో అన్ని తయారీల యొక్క RMUలకు. 3) బంజారాహిల్స్ సబ్ డివిజన్‌లో కూడా అన్ని తయారీల యొక్క RMUలకు. 4) సనత్‌నగర్ సబ్ డివిజన్ కూడా అన్ని తయారీల యొక్క RMUలకు. 5) గ్రీన్‌ల్యాండ్స్ సబ్ డివిజన్‌లో కూడా అన్ని తయారీల యొక్క RMUలకు. అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్, గ్రీన్‌ల్యాండ్స్ ఐదు సబ్ డివిజన్‌లలో వార్షిక ప్రివెంటివ్ నిర్వహణ, బ్రేక్‌డౌన్ నిర్వహణ మరియు ఫ్యాక్టరీ మరమ్మతు ఉద్దేశిస్తూ టెండర్లు మరియు సీల్డ్ బిడ్స్ ఆహ్వానిస్తోంది. తదుపరి వివరాలకు దయచేసి www.tgsouthernpower.org వీక్షించండి.
DIPR.No.3678-PP/CL/Advt/1/2025-26, తేది: 17.06.2025 సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ బంజారాహిల్స్ సర్కిల్

వార్త


ఒక్కొక్కప్పుడు మన సందేహాలే మనలను మోసం చేస్తాయి. సందేహం కలిగినప్పుడు భయం వల్ల మన ప్రయత్నాన్ని విరమిస్తాం. మనం సాధించగలిగే దాన్ని సైతం పోగొట్టుకుంటాం.

-ఫిలిప్స్

# సకల జనగణన సాధ్యమే!

దేశంలో 15ఏళ్ల అనంతరం జరిగే జనగణనకు సైరన్ మోగింది. 16వ జనగణన ఇది. ప్రతి పదేళ్లకూ ఒకసారి దేశ జనగణనకుఆనవాయితీగా ఉన్నా 2020లో జరగాల్సిన జనగణన 'కరోనా' రీత్యా వాయిదాపడింది. స్వాతంత్య్రానికి ముందు 15 జనగణనలు పూర్తయ్యాయి. జనగణనతోపాటు ఈసారి తొలిసారి కులగణన చేపట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. 2027 మార్చి1వ తేదీ నాటికి జనగణన పూర్తవుతుంది. జనాభా లెక్కల సేకరణ అంతా డిజిటల్ విధానంలో జరుగుతుంది. సమాచార సేకరణ, బదిలీ, డేటా భద్రత వంటి అన్ని విషయాలనూ కట్టుదిట్టంగా చేయాలని కేంద్రం తలపెట్టింది. రెండు దశల్లో జరిగే జనగణనలో తొలిదశలో అక్టోబరు 1, 2026 నాటికి జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్, లడక్, హిమాచల్‌ప్రదేశ్‌లలో పూర్తవుతుంది. జనగణన కోసం సోమవారం కేంద్ర హోంమంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జనవరి 1, 2027 నుంచి జనగణన ప్రారంభమౌతోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కల భారత్‌లో జనగణన అంటే అత్యంత కీలక పరిణామం. మంచు ఎక్కువగా కురిసే లడక్ ప్రాంతంలో 1 మార్చి 2027లో మొదలు పెడతారు. కులగణన వల్ల ఆయా కులాల్లో ఉన్న ఆర్థికపరిస్థితి, సామాజిక అంతరాలు వగైరా అంశాలపై విశ్లేషణ వీలవుతుంది. దేశంలో సమగ్ర కులాల వారీ జనాభా లెక్కల ప్రక్రియ బ్రిటిష్ వారి హయాంలో 1881 నుంచి 1931 మధ్య కాలంలో జరిగింది. సుదీర్ఘకాలం జరగడానికి కారణాలు అప్పట్లో కేవలం జనాభా లెక్కలు మాత్రమే జరిగేవి. అప్పట్లోనే కులాల వివరాలను కూడా సేకరించినట్లు చెబుతున్నా అవి వెలుగులోకి రాలేదు. కులాల వారీగా ప్రాతిపదికగా జనగణన ప్రక్రియను తెలంగాణ, బీహార్‌లలో ఇప్పటికే పూర్తి చేశాయి. జాతీయస్థాయి అంశం అయినందున ఎంతో పకడ్బందీగా సేకరించాల్సి ఉంటుంది. కొన్ని రాష్ట్రాలు చేపట్టినా చెబుతున్న జనగణన రాజకీయ కోణంలో చేశారన్న ఆరోపణలున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాలు ఎంతో ముందుచూపుతో చేపట్టిన, అనుసరించిన మార్గదర్శకాలు ఆధునీకరించి, ఆధునిక గణాంక వైఖరితో పారదర్శకంగా జనగణన చేపట్టాల్సి ఉంది. దేశంలో కులగణన చాలా అవసరమని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ఏమైయితే కాంగ్రెస్ పాటులో అన్ని రాష్ట్రాల్లోనూ జనగణన దీక్ష చేపట్టడం స్వాగతించాల్సిన విషయం. తొలిదశలో ఇంటి జాబితాలో ప్రతి ఇంటికి సంబంధించిన గృహనిర్మాణ పరిస్థితులు, ఆస్తులు, సౌకర్యాల గురించి సమాచారం సేకరిస్తారు. రెండో దశ జనాభా గణనలో ప్రతి కుటుంబంలోని వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను రాబడతారు. ప్రజల నుంచి ఏయే వివరాలను సేకరిస్తారో ప్రశ్నావళిని విడుదల చేయాల్సి ఉంది. కులగణన విషయంలో కాంగ్రెస్‌పార్టీ పట్టుపట్టి తెలంగాణలో విజయవంతంగా పూర్తి చేసింది. అందులో అగ్రసత్యాలున్నాయని అసమగ్రమని ఆరోపణలున్నా, జాతీయస్థాయిలో జరిగే కులగణనకు మార్గదర్శకాలను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం ఒకనాడు కులగణన చేయలేమని మండిపడింది. ఆటు పార్లమెంటులో,సుప్రీంకోర్టులోనూ వద్దని వాదించిన కేంద్రప్రభుత్వం కులగణనకు ఉపక్రమించడం మంచి పరిణామం. కాగా సోమవారం విడుదల చేసిన 16వ జనగణన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావన చేయకపోవడం విమర్శలకు గురైంది.ప్రశ్నావళిలో ఉంచి కులగణన వివరాలను విశ్లేషిస్తారేమో చూడాలి. కులాల వారీ ఆర్థిక, సామాజిక వివరాలను క్రోడీకరించడం ద్వారానే ఆయావర్గాల వెనుకబాటు తనాన్ని నిర్ధరించి ప్రత్యేక పథకాలు చేపట్టేందుకు ఈ విశ్లేషణలు పనికివస్తాయి. తెలంగాణ రాష్ట్రంచేపట్టిన కులగణన వివరాలలో క్రోడీకరించిన కులగణనకు కానీ సంబంధం లేదు. జాతీయ జనాభా చట్టం 1948 ప్రకారం అన్ని రాష్ట్రాల్లో ఒకే మాదిరి ఒకే తీరుగా జనగణన చేయాల్సి ఉన్నందున కేంద్ర ప్రభుత్వంతోనంటూ ప్రత్యేక ప్రశ్నావళి, ప్రణాళిక, సేకరణ విధానాన్ని రూపొందించుకుంటోంది. రాజ్యాంగం లోని 246 అధికరణం కింద ఏడో షెడ్యూలులో 69వ అంశంగా జనగణన చేపడ్తారు.సమాజంలోని ప్రతి వర్గానికి, ప్రతి సమ్మిళిత వివరాలు ప్రజల అభివృద్ధి సేకరించే ప్రణాళికలో ప్రభుత్వం ముందుకుకదులుతోంది. ప్రశ్నావళిలో పొందుపరిచే ప్రశ్నలు ఆయా నివాసితుల వ్యక్తిగత వివరాలతోపాటు కులం, ఉపకులం, సొంత ఇల్లా అద్దె ఇల్లా? ఆర్థిక పరిస్థితులు ఉద్యోగ ఉపాధి ఆదాయవనరుల వంటి కీలకమైన ప్రశ్నలుంటాయి. కులప్రస్తావనపై పెద్దగా చర్చలు లేవు 1881లోనే సమగ్ర కులగణన విషయమై బ్రిటిష్వార్లు ముందుచూపుతో జనగణనకు అంకురార్పణ గావించారు.'విభజించు, పాలించు' అనేదీతి అలోచించిన వారికి భవిష్యత్‌లో 'కులం' అతికీలకంగా ఉంటుందని భావించి ఉండొచ్చు.స్వాతంత్య్రం వచ్చాక భారతీయ పాలకులు జనగణన నుంచి 'కుల'ప్రస్తావనగణనలను తొలగించారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో కులాలవారీ సంక్షేమప్రగతి ప్రణాళికలు ప్రధానంగా ఉంటోంది. కులాలకు ప్రాముఖ్యత ఏర్పడి కేంద్రప్రభుత్వం తరఫున 2010 లోనే ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ లోక్‌సభలో హామీ ఇచ్చారు. అత్యధిక రాజకీయ పార్టీలు కులగణన మందిరిని అభిప్రాయపడ్డాయి. 2011లో కులగణన ప్రయత్నం జరిగింది. కానీ బయటకు రాలేదు. తాజాగా 'కులగణన' ఆవసరాన్ని గుర్తించినందున ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో సమగ్ర సర్వేకు ముందడుగు పడింది. ఈ రీత్యా సర్వతోముఖ సాధికారత్వంలో భాగంగా సకల జనుల కోసం సంక్షేమ పథకాలు అందేందుకు కొత్త ప్రయత్నాలన్నీ సానుకూల పడగలవని ఆశిద్దాం.

ఇద్దరి మధ్య వైరం సంభవించినందుకు వారిలో ఒక్కటే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం సాగిందంటే ఇద్దరూ బాధ్యులే.



థామస్ ఫుల్లర్

ఏదైనా ఒక లక్ష్యంతో గట్టిగా కృషి చేసే ప్రతి వ్యక్తికీ నేడు కాకపోయినా రేపైనా విజయావకాశం వచ్చి తీరుతుంది.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య

# ప్రజావాక్కు



### ప్రొవైడర్లకే అనుమతి ఇవ్వాలి

ఇటీవల కేదార్నాథ్ వద్ద జరిగిన హెలికాప్టర్ ప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రారంభమైన చార్‌ధామ్ యాత్రలో ఇప్పటివరకు ఇది ఐదవహెలికాప్టర్ ప్రమాదం కావడం మరింత ఆందోళనకరం. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఆరుగురుమరణించడం దురదృష్టకరం.వరుసగా జరుగుతున్న ఈ ప్రమాదాలు మన వైమానిక రంగంలో లోపాలు, నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పుడు తాత్కాలికంగా హెలికాప్టర్ సేవలను నిలిపివేసినప్పటికీ, దీన్ని శాశ్వత పరిష్కార దిశగా తీసుకెళ్లాలి.అధిక భక్తులు వచ్చే కాలాల్లో హెలికాప్టర్ సేవలను కేవలం నిబంధనలు పాటించే ప్రొ వైడర్లకే అనుమతించాలి. అంతేగాక, ప్రభుత్వం పర్యవే క్షణను మరింత బలపరచాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలి

మన రైల్వేలు దేశ పౌరుల ఇంద్ర వాహనం కానీ తరచుగా ఇటీవల ప్రమాదాలు జరుగుతుండడం వలన రైల్వే ప్రయాణంఅంటే భయభ్రాంతులను కలుగుచున్నవి. మొన్న ముంబైలో జరిగిన లోకల్‌రైళ్లప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం అత్యంత విషాదకరమైన సంఘటన. రెండు రైళ్ల ప్రయాణికుల సంచులు ఒకదానికి ఒకటి తగిలి ప్రయాణికులు క్రిందపడి దుర్మరణం చెందడం భారత రైల్వే చరిత్రలో మొదటిసారి కావచ్చు! గతంలో ప్రమాదాలు రైళ్లు పట్టాలు తప్పడం ఒకదానికి ఒకటి ఎదురెదురుగా, వెనుక నుండి వచ్చి ఢీకొనడం జరిగేవి. కానీ ఇటీవల జరిగిన న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల తొక్కిసాలట,రైల్వేశాఖ నిర్లక్ష్యం ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, అవగాహనరాహిత్యం వలన జరిగినవి.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

### చెక్ డ్యామ్‌లు అవసరం

వర్షాకాలం ప్రారంభం కాబోతుంది. రాష్ట్రంలోని కొన్ని చెరువులలో30నుండి40శాతనీటిసామర్థ్యంతో ఉన్నాయి. ఆగస్టు వరకు కురిసే వర్షాలకు చెరువులు పూర్తిగా నిండి వృధాగా నీళ్లబయటికిపోయే నీటికి లోతట్టు ప్రాంతాలలో చెక్ డ్యాములు ఏర్పాటు చేయాలి. వాగులు, కాలువలకు కూడా చెక్ డ్యాములు నిర్మించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

### యుద్ధం ఆగదు

ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న హోరాహోరి క్షిపణుల దాడుల వల్ల రెండుదేశాలకు జననష్టం,ఆస్తినష్టం తప్ప గెలుపు అనేది ఎన్నటికీ ఎవరి పరం కాదు. ఇజ్రాయెల్ ఇప్పటికీ గాజా మీద దాడులు చేస్తూనే ఉంది. అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌ను సమర్థిస్తూనే ఉంది. ఇండో- పాక్‌ల మధ్య ఈమధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్‌ను తన చాక చక్యంతో సంధి మాటలు చెప్పి యుద్ధాన్ని నాలుగు రోజులలోనే ఆపివేశానని గొప్పలు చెప్పుకుంటున్న ట్రంప్ మహాశయుడు ఉక్రెయిన్ రష్యా మధ్య ఏడాది పైగా ఎడతెరిపి లేకుండా జరుగుతున్న యుద్ధాన్ని ఆపలేకపోయాడు. ఇజ్రాయిల్‌ను అదుపు చేయలేకపోయాడు.అణుయుద్ధానికి ఏ దేశం ఒడిగట్టినా దాని మూల్యం ప్రపంచ దేశాలన్ని చెల్లించుకోవాలి. ఐక్యరాజ్య సమితిలోని సెక్యూరిటి కౌన్సిల్ ఏదేశాన్ని కంట్రోల్ చేయలేకపోతోంది.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### పేదరికం తగ్గింది

భారత్‌లో పేదరికం భారీగా తగ్గి పోయిందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు పేర్కొన్నాయి.ఈ లెక్కలు చెప్పిన వారు పట్టణాల్లో గ్రామాల్లో సర్వేలు చేసే చెప్పాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు ఈ వార్త విన్నవారు. ఏప్రభుత్వ పథకానికి నోచుకోలేని వారు గంజి నీళ్ళకు కష్టపడుతున్నారు. మన దేశం చాలా పేద దేశమని పూర్వ రిజర్వు బ్యాంకు గవర్నరు రఘురామ్ రాజన్ ఈ మధ్యనే అన్నారు. ఈ పేదరికంలో మరోరకం జాతి ఉంది. వీరు చదువుకున్న వారు. ఉద్యోగం చేసి రిటైర్ అయిన వారు. వీరి ఫించను గత దశాబ్ద కాలంపైగా నెలకు కదలని మెదలని శిలలా వెయ్యి రూపాయలు మాత్రమే. వీరి వార్షిక ఆదాయం పన్నెండు వేల రూపాయలు మాత్రమే. అంటే దారిద్ర్య రేఖకు ఎన్నిమెట్లు దిగువున ఉన్నారో కదా!

- డా.ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### జీవవైవిధ్య పరిరక్షణ

మానవునికి ప్రకృతి, జీవవైవిధ్యం రెండు కళ్ల వంటివి. ఆధునిక మానవుని జీవనశైలి మార్పు వలన పర్యావరణ లేమితో పుడమి వేడెక్కిపోవటంతో పాటు జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వన, జల, జీవరాశులున్న దేశాల్లో ఇండియా స్థానం 8వది. భారత్‌లో ఉన్న 18 జీవావరణ ప్రదేశాల పరిరక్షణ కోరకు ప్రజల్లో జీవ, పర్యావరణంపై అవగావనను ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలి.

-షేర్ మీరా, రాజమండ్రి

మన వి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'స్టెమ్' తో పూర్తిస్థాయి విద్యావికాసం!

**ప్రభుత్వాలు విద్యా రంగంలో సంస్కరణలు దిశగా దశాదిశా నిర్దేశం చేసే జాతీయ విద్యాసంస్థలు అనగా కేంద్ర విద్యాశాఖ, యెన్.సి.ఆర్.టి మానవ అభివృద్ధి విభాగం, రాష్ట్ర విద్యారంగ సంస్థల సమన్వయంతో కృషిచేయాలి. అప్పుడే ప్రస్తుత పరిస్థితులకు కావలసిన 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందరి విద్యార్థులకు అందించడం సాధ్యమోతుంది. రాబోవు జాతీయ విద్యా చట్రంలో తగిన సంస్కరణలు చేయడం ద్వారా విద్యార్థి సమగ్రాభివృద్ధికి పునాది ఏర్పడుతుంది. నూతన విద్యా విధానపు విలువైన లక్ష్యాలను చేరుకోగలుగుతాం.**



మల్లాడి శ్రీనగేష్

నూతన విద్యా విధానం 2020 నిజమైన స్ఫూర్తితో రూపు దాలిస్తే దేశంలో పిల్లలు ఎదుర్కొంటున్న అభ్యసనా సామర్థ్యాల సవాళ్లకు ఒక సమాధానమే కాక ఉన్నత విద్యలో విద్యార్థులు సులభంగా తాము అనుకున్న విద్యా లక్ష్యాలను సాధించడానికి, తద్వారా దేశం సమ్మిళిత విద్యా చట్రంలో వివిధ నేపథ్యాల నుండి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు అందరికీ నాణ్యమైన, సమాన విద్యా సామర్థ్యాలు సమకూర్చడానికి సానుకూలత ఏర్పడుతుంది. అంతేకాక విద్యార్థి తన మాతృభాషలో చదువుకొనే వెసులుబాటు కల్గించడం, ఆంగ్లం లేదా స్థానిక భాషలోనే చదవాలనే నిబంధన లేకుండా ఆయా రాష్ట్రాలు భాషా బోధనలో తన నిర్ణయం తీసుకోవచ్చు అనే విషయం కూడా విదితమే. ఈ ప్రతిపాదనలన్నీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి బాలలకు చదువుతో బాటు మనో బలాన్ని అందించడానికి చక్కటి వెసులుబాటు కల్గిస్తుంది. ఈ విద్యా విధానం రూపకల్పన ప్రాథమిక విద్యా స్థాయి నుండి అనుసరించాల్సిన వివిధ వ్యూహాలు మొదలుకొని ఉన్నత స్థాయి విద్య సాంకేతికత వృత్తి విద్య, గ్రామీణ,పట్టణ స్థాయి విధి విధానాలను మేళవించి సమ్మిళిత విద్యా భావనలను పూర్తి స్థాయిలో పొందుపరచినట్లు చెప్పవొచ్చు. దీనికితోడు ఉన్నత విద్యలో ఉన్న విద్యార్థులకు వారి భవిష్యత్ ఉద్యోగ రంగాలను ఎంపిక చేసుకోవడానికి, గ్లోబల్ స్థాయి ఉద్యోగ పోటీని ఎదుర్కోవడానికి, శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో మెరుగైన నైపుణ్యాలను గడించడానికి నూతన విద్యా విధానం సూచించిన స్టెమ్ ఆధారిత విద్య కూడా యువత భవిష్యత్తును ఉజ్వలమయం చేయడానికి తప్పక ఉపకరిస్తుందని చెప్పక తప్పదు. సాంప్రదాయ విద్యాబోధనకు స్వస్తిపలికి, అనుభవాత్మక విద్యకు నాంది పలికి విద్యార్థులకు స్నేహపూరిత తరగతి నిర్వహణలో స్టెమ్ ఒక పటిష్ట వ్యూహంగా వర్ణించవచ్చు. ఈ నేపథ్యంలో స్టెమ్ ఆధారిత విద్య పాఠశాల స్థాయి నుండి మరింత బలోపేతం చేయాలనేది అనేక మంది విద్యా సంస్కర్తల ప్రధాన అభిప్రాయం! స్టెమ్ ఆధారిత విద్య అనగా సైన్స్,టెక్నాలజీ, ఇంజనీరింగ్ మాథమెటిక్స్ అనే అంశాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్గించడం, తదనుగుణమైన వసతులు అనగా స్టెమ్ లాబొరేటరీలు, అటల్ లాబొరేటరీలను ఏర్పరచి దానికి సాంకేతికతను జోడించి విద్యార్థులకు ప్రయోగాత్మకను ప్రోత్సహించడం తద్వారా ఆలోచనాత్మకతను పెంపొందించడం నూతన విద్యా విధాన ప్రధాన ఉద్దేశ్యం.అనగా 21వ శతాబ్దపు నైపుణ్యాల నేర్పరితనాన్ని ముఖ్యంగా 5 'సి'ఐదు' నైపుణ్యాలను అనగా క్రియేటివిటీ (సృజనాత్మకత ), క్రిటికల్ థింకింగ్ (క్లిష్టమైన ఆలోచన), కమ్యూనికేషన్ సమాచారం, సంభాషణ), కొలాబోరేషన్ (సహకారం) సిటిజెన్ షిప్ (పౌరసత్వం) విషయాలలో విద్యార్థులను సమాయత్తం చేయడం నూతన విద్యా విధాన ప్రధాన భూమికయని చెప్పవచ్చు.

ఈ విషయాన్ని నూతన విద్యావిధానం దేశంలో ఒక కొత్త రూపు, ఒక ఒరవడిని దిద్దడానికి రచించబడిందనివిద్యా విధాన రూపశిల్పి కస్తూరి రంగన్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ నేపథ్యంలో బాల్ రక్షా భారత్ (సేవ్ ది చిల్డ్రన్) పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షల సౌజన్యంతో తెలుగు రాష్ట్రాల్లో కాక సుమారు 7రాష్ట్రాల్లో ఏర్పరచిన స్మార్ట్,స్టెమ్ లేబొరేటరీల అనుభవాలను కూడా క్రోడీకరిస్తే విద్యార్థులు ఈ లాబరేటరీలు డిజిటల్ బోధన ద్వారా విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవడమే కాకపాఠ్యాంశాలతో బాటుఆయా అంశాలపై అదనపు సమాచారాన్ని పొందడం స్టెమ్ ప్రయోగాల ద్వారా ప్రత్యక్ష ప్రయోగాత్మక ప్రయోజనాలు చేకూరుతున్నాయని వెల్లడించారు. ఒడిశాలోని కుగ్రామా ల్లో ఉన్న ఉన్నతవిద్యను అభ్యసించే బహుళ భాషానేపథ్యంతో



చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు కూడా స్టెమ్, డిజిటల్ బోధనా భాగ్యాన్ని కొనియాడారు.దీనికితోడు ఈ స్టెమ్ లాబొరేటరీలను జిల్లాలో గల డైట్‌లో కూడా ఏర్పాటుచేయడం వలన స్టెమ్‌విద్యను పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ శిక్షణపొందుతున్న యువ ఉపాధ్యాయులకు ఈస్టెమ్ లాబొరేటరీలు ఒక చక్కటి లెర్నింగ్‌వసతిగా అభివర్ణించారు. ఈ దిశగా ఫ్రైమ్ విద్యా బోధనా పద్ధతి తరగతి గదిలో ప్రస్తుతం సాగుతున్న సాంప్రదాయ విద్యా బోధనా సరళికి స్వస్తిపలికి బోధనలో విద్యార్థుల భాగస్వామ్యం, క్లిష్టమైన విషయాలను సులభంగా అవగాహన చేసుకోవడమే కాక ప్రయోగాత్మకంగా విషయాలను పరిశీలించి విద్యార్థులు సాధారణంగా క్లిష్టమని భావించే సైన్స్, ఇంజినీరింగ్, గణిత సబ్జెక్టులలో సరళరీతిన అభ్యసించే వెసులుబాటు స్టెమ్ ప్రయోగశాలలు కల్పిస్తాయి. అంతేకాక దీని ద్వారా పీర్ లెర్నింగ్ అనగా తోటి విద్యార్థుల ప్రయోగాల ద్వారా మరింత సులభంగా కాన్సెప్ట్‌లను నేర్చుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. ఈ విషయాలు వివిధ రాష్ట్ర విద్యాశాఖలు, స్వచ్ఛంధ సంస్థలు సి.ఎస్.ఆర్‌ల సౌజన్యంతో ఇప్పటికే తెలుగురాష్ట్రాల్లో లోనే కాక దేశ వ్యాప్తంగా స్టెమ్ అటల్ లేబొరేటరీల ద్వారా స్మార్ట్ క్లాసురూముల ద్వారా విద్యార్థుల నుండి, ఉపాధ్యాయుల నుండి సేకరించిన ప్రత్యక్ష సమాచారం ద్వారా ఈ ప్రయోగశాలల వలన పిల్లల్లో ఆసక్తి అనుభవాత్మకత, విశ్లేషణ, విషయపరిజ్ఞానం, సృజనాత్మకత వంటి సూక్ష్మవిషయాల్లో మెరుగైన ఫలితాలు లభించాయని దీని ద్వారా ఉపాధ్యాయులు సైన్స్ గణిత విభాగాల్లో క్లిష్టతరమైన విషయాలను సులువుగా బోధించగలుగుతున్నారని ఉపాధ్యాయుల అనుభవాలద్వారా తేటతెల్లమోతోంది. దానికి తోడు ప్రత్యక్షంగా ఉపాధ్యాయులు విద్యార్థులు కలసి ప్రయోగాలు చేబడుతూ తరగతులు నిర్వహించేలా ప్రతి ప్రయోగం ఎలాచేయాలనే పూర్తి సమాచా రంతో ప్రత్యేక వీడియోలను ప్రయోగ శాలలో ఆన్లైన్‌లో సిద్ధంగా ఉండడం వలన ఉపాధ్యాయులు విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడానికి వెసులుబాటు కలుగుతోంది. ఈ ప్రయోగశాలలు ప్రస్తుతం 6వ తరగతి నుండి 10వ తరగతివరకు ముఖ్యమైన కాన్సెప్ట్‌లను దృష్టిలో ఉంచుకొని అమర్చడం జరిగింది. ప్రయోగాల అనంతరం నెల లేదా రెండు నెలలకు ఒకసారి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వ హించే వెసులుబాటు కూడా వుంది. దీనిద్వారా పాఠశాలలో నిర్వహించే సి.సి.యి (నిరంతర ఎవాల్యుయేషన్) మదింపు ప్రక్రియకు ఈ పరీక్షలను అనుసంధానం చేసుకోవచ్చు. ఈలాబరేటరీలో జరిగే ప్రయోగాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (పెద్ద టెలివిజన్ లాంటి బోధనా పరికరాలతో) అనుసంధానం చేస్తేఫలితాలు మరింత మెరుగైన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు మరింత పెరిగేలా ప్రయత్నించవచ్చు అనడంలో సందేహంలేదు.ఈ అనుభవాల దృష్ట్యాఇదేదిశగా, ప్రతి పాఠశాలలోనూ స్టెమ్ స్మార్ట్ క్లాసురూములను ఏర్పరచడం, డైట్‌లను ఈ రంగంలో బలోపేతం చేయడం ద్వారా ఉపాధ్యాయ శిక్షణకు ఒక కేంద్ర బిందువుగా తీర్చిదిద్దడం, స్టెమ్ విద్యకు నాణ్యమైన సాంకేతిక విద్య గ్రామీణ ప్రాంత విద్యా ర్థులకు చేరేలా ప్రయత్నాలు చాలాబాగా సత్ఫలితాలు సాధించవచ్చని చెప్పవచ్చు. అంతేకాక ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ యోచిస్తున్నట్లు జిల్లా సైన్స్ సెంటర్లను స్టెమ్ సెంటర్లుగా తీర్చిదిద్ది విద్యార్థులను సైన్స్‌తోబాటు సంబంధిత అంశాలపై పిల్లలకు ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి నుండి పూర్తిస్థాయి అవగాహన, శిక్షణ, క్షేత్ర సందర్శన,స్టెమ్ ప్రదర్శన శాలల నిర్వహణద్వారా విద్యార్థులు స్వంతంగాప్రయోగాలు తయారు చేసి ప్రదర్శించేలా ప్రోత్సహించడం స్టెమ్ విద్యను బలోపేతం చేయడంలో ఒక వినూత్న ప్రక్రియగా చెప్పవచ్చు. ఈ విధంగా గ్రామీణ ప్రాంత, ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ముఖ్యముగా నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకారం సాంకేతిక విద్యకు దూరంగా వున్న సుమారు 60శాతంమంది బాలికలను సాంకేతిక విద్యతో విద్యారంగంలో బాలికలు ముందంజ వేసేలా అందరు సమిష్టిగా కృషి చేయడం తప్పనిసరియని అవగతమోతోంది. ప్రభుత్వాలు విద్యా రంగంలో సంస్కరణలు దిశగా దశా దిశానిర్దేశం చేసే జాతీయ విద్యాసంస్థలు అనగా కేంద్ర విద్యాశాఖ, యెన్.సి.ఆర్.టి మానవ అభివృద్ధి విభాగం మరియు రాష్ట్ర విద్యా రంగ సంస్థల సమన్వయంతో కృషిచేయాలి. అపుడే ప్రస్తుత పరిస్థితులకు కావలసిన 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందరి విద్యార్థులకు అందించడం సాధ్యమోతుంది. రాబోవు జాతీయ విద్యాచట్రంలో తగినసంస్కరణలు చేయడంద్వారా విద్యార్థి సమగ్రాభివృద్ధికి పునాది ఏర్పడుతుంది. నూతన విద్యావిధానపు విలువైన లక్ష్యాలను చేరుకోగలుగుతాం. ●

# దళితుల అణచివేత ఇంకెంతకాలం?


గుర్రం రాంమోహన్ రెడ్డి

దాడులు, అవమానాలు, అణిచివేతలు వివక్ష గ్రామ బహిష్కరణలు పునాదులను దళితల వర్గాలు పెకిలి వేయాలి. దళిత బహుజనులపై దాడులు ఇంకెన్నాళ్లు అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. దాడులు, దండన,అవమానాలు మూటలతో దళితులు బ్రతుకు బండిలాగుతున్నారు. చరిత్ర నిర్మాతలు మూలవాసులు దళితులే అన్న చారిత్రక సత్యం సమాజంకు తెలియదా! అన్న ప్రశ్నలు వెంటాతున్నాయి. సమానత్వం స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వం లభిస్తేనే దళితులు అత్మగౌరంతో సమాజంలో జీవనంసాగిస్తారన్న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ మాటాలు ఎప్పుడు నిజం అవుతాయి.నిప్పుల కొలిమిలో అవమానాలు భరించిన దళితులు విముక్తి, సాయుధ, విప్లవ పోరాటాలు నిర్మించి సమిధలైన బతుకు బండికి భరోసా ఏది. శ్రామిక కులాలు విముక్తి పోరాటాలు సాగించడంలో దళిత బహుజనులు అగ్రభూమిక పోషించిన ఎందుకు దాడులు జరుగుతున్నాయి. ప్రతిగడియ, ప్రతి రోజు దళితులపై దాడులు నిత్యకృత్యం అవుతున్నాయి. ఒక వైపు పాలకవర్గాలు మరోకవంక సామాజికంగా ఉన్నతస్థానంలో వున్న వ్యక్తులు శక్తులు దాడులకు, ఒడిగడుతున్నారు. కారంచేడు కన్నీళ్లు ఇంకారుతన్నాయి. పదిరికుప్పం ఘటన జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి. నీరు కొండ సంఘటన నేటికి నిలదీస్తున్నా ఎవరికీ కనువిప్పు కలగడంలేదు. రాష్ట్ర జనాభలో 80లక్షలకు పైగా దళిత జనాభా ఉంది.సిందు మాదిగ, పాముల వంటి 59 కులాలను ఎస్.సి. జాబితాలో చేర్చారు. 23 శాతం ఎస్.సి. జనాభా ఉండగా, 15శాతం రిజర్వేషన్లు అవుతున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దళితులపై, దళిత మహిళలపై అత్యాచారాలకు అంతులేదు.దళితులపై జరిగే నేరాలు సగటున 25శాతం నుంచి30శాతం మధ్యఉన్నట్లు యన్.సి.ఆర్.బి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణాలో చాలా గ్రామాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయని లోక్‌సభలో హోంశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల గ్రామాల్లో అధికంగా దళితులపై దాడలు జరుగుతున్నాయి. 2014-2021 సంవత్సరాల మధ్య దళితులపై 12 వేల 645 దాడులు, దౌర్జన్యాలు జరిగాయి. 2014లో1447, 2019లో 1690, 2021లో 1727, దాడులు జరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో వెల్లడించింది. పెద్ద పల్లి, మహబూబ్నగర్, ఆర్మూర్, ఆదిలాబాద్,నేరళ్ళు, దాడులు, హత్యలు జరిగాయి. ఇసుక మాఫియా దాడుల్లో నేరేళ్ళలో 40 మంది దళితులు మృత్యువాత పడ్డారు. మొత్తంగా గమనిస్తే 1991 నుంచి 2021 మధ్య 7 లక్షలు దాడులు, దౌర్జన్యాలు జరిగాయి. ప్రతీ 12 నిమిషాలల్లో దౌర్జన్యం ప్రతి ఆరుగురు దళిత మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయి. 2019-2021లో దళితులపై దారణాలు 45,961 నుండి 50,900 వరకు అంటే 11 శాతం పెరిగాయని యన్.సి. ఆర్.బి. వెల్లడించింది. బి.జె.పి పాలిత రాష్ట్రాలో ఉత్తరఖండ్, 50శాతం, 46శాతం మధ్యప్రదేశ్, 36శాతం గోవా,యు.పి. 46శాతం, దళితులపై దాడులు జరిగినట్లు విశదమౌతుంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 6 శాతం దళితులపైదాడులు జరిగినట్లు స్పష్టమౌతుంది. తెలంగాణ 32శాతం దారుణాలు జరిగాయి. సమాజంలో మిగిత సామాజిక వర్గాలతోపాటు దళితులలో రాజకీయ, ఆర్థిక సామాజిక, సాంస్కృతిక, విద్యాపరమైన సమాన హక్కులు ఉండాలని బి.ఆర్. అంబేద్కర్ ప్రభోదించిన సూత్రానికి భిన్నంగా ఆధునిక విజ్ఞాన సమాజంలో జరుగుతున్నాయి. ●

# వివాదాల సుడిగుండంలో టిజిపిఎస్సీ

భాస్కర్ యలకంటి

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత వెలువడిన తొలి గ్రూప్1 నోటిఫికేషన్‌ను ఆది నుంచి వివాదాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. లీకేజీ కారణంగా ఒకసారి, హాజరులో వచ్చిన వ్యత్యాసం కారణంగా మరోసారి ప్రిలిమ్స్ పరీక్షలు రద్దుకావడం, తిరిగి కొత్త నోటిఫికేషన్ వెలువడడం, ప్రిలిమ్స్3.0ను నిర్వహించడం, మెయిన్స్ పరీక్షలకు అర్హత జాబితా వెలువర్చడం, తదనుగుణంగామెయిన్స్ పరీక్షలు నిర్వహించబడడం చకచకా జరిగిపోయాయి. అయిననూ వివాదాలు మాత్రం ఇంకా టీజీపీఎస్సీని వెంటాడుతూనే ఉన్నాయి. మెయిన్స్‌పరీక్షల నిర్వహణ తీరుపై, వెలువడ్డ ఫలితాలపై పలు అనుమానాలను వ్యక్తపరుస్తూకొందరు అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు.అటు అభ్యర్థుల తరఫున, ఇటు టీజీపీఎస్సీ తరఫున వాద,ప్రతి వాదనలను విన్న కోర్టు నియామక ప్రక్రియ మీద నిలుపుదల ఉత్తర్వులను విడుదల చేసింది. మరోపక్క అభ్యర్థులు టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణ తీరు మీద, అభ్యర్థులు లేవనెత్తిన పలు అనుమానాల మీద సరైన వివరణ ఇవ్వాలని కోరుతూ గత ఏప్రిల్ 30వ తేదీన టీజీపీఎస్సీకి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ రాయడంతో వివాదం మరింత ముదిరింది. ఆ లేఖలో ఏముంది? టీజీపీఎస్సీ సమాధానం ఏంటి? వివాదాలను అధిగమించేందుకు మధ్యేమార్గంగా పరిష్కార మార్గాలు ఏమైనా ఉన్నాయా? బండి సంజయ్ తన లేఖలో పలు అంశాలకు వివరణ కోరగా, మరికొన్ని అంశాల మీద కొన్ని ప్రశ్నలను సంధించారు. మెయిన్స్ పరీక్షలకుహాజరైన అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ప్రిలిమ్స్‌మెయిన్స్ హాల్ టికెట్ నంబర్లు, వయసు, కేటగిరి, మీడియం,లింగం పేపర్ వారీగా పొందిన మార్కులు వంటి పూర్తి వివరాలు బహిరంగపరచడంతో పాటు పరీక్షా కేంద్రాల వారిగా అసమాన ఫలితాలు చోటు చేసుకోవడంపై సరైన వివరణను కోరారు. అట్లే జనరల్ ర్యాంకింగ్ లిస్టు కంటే ముందే ప్రొవిజినల్ ర్యాంకింగ్ లిస్టు అందించకపోవడానికి గల కారణం ఏంటని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు 15.2, 15.3 ఉల్లంఘనకు గలకారణాలు ఏంటని, అట్లే సుప్రీం కోర్టు ఆదేశానుసారం యూపీఎస్సీ తరహాలో మూల్యాంకన ప్రక్రియను మోడరేషన్ చేయకపోవడానికి గల కారణాలు ఏంటని, బయోమెట్రిక్ హాజరులో వ్యత్యాసం ఎందుకొచ్చిందని, ఫలితాల ప్రకటనకు ముందే డేటా లీక్ ఎలా జరిగిందని, మెయిన్స్ హాల్ టికెట్ల నంబర్లు కేంద్రాల కేటాయింపు యాదృచ్ఛికంగా జరిగినదా? లేదా దానిలో ఏమైనా మానవ ప్రమేయం దాగిఉన్నదా? అంటూ పలు ప్రశ్నలను సంధించారు. టీజీపీఎస్సీ వెంటనే స్పందించి అటు అభ్యర్థులకు ఇటు తెలంగాణ సమాజానికి సమాధానమిచ్చి తన పారదర్శకతను చాటుకోవాలని సూచించారు. కానీ ఇంతవరకు టీజీపీఎస్సీ నుండి ఎలాంటి సమాధానం రాలేదు. ఉద్యోగ



నియామక ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని జీవోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టకపోవడంతో ఆ జీవోలు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ఉన్నాయా? లేవా?అనే విషయాలు తెలియడంలేదని, అట్లే వాటి ప్రభావం నియామక ప్రక్రియలో ఏమేరకు ఉంటుందో అంచనా వేయలేకపోతున్నామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవో 29 రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నదనే ఉద్దేశంతో కోర్టులను ఆశ్రయిస్తే ఆలస్యం కారణంగా పిటిషన్లను కొట్టివేశారని అభ్యర్థులు వాపోతున్నారు. మరోపక్క రాజ్యాంగపరమైన అంశాలపై ఆలస్యం అనే కారణంగా పిటిషన్లను కొట్టివేయరాదని అది గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టం ద్వారానైనా పూర్తి వివరాలను తెలుసుకోవాలని ఆరాటం చెందే వారికి అడుగడుగునా చుక్కెదురవుతున్నదని, ఆ చట్టం సామాన్యునికి అందనిద్రాక్షగానే మిగిలిపోయిందనే నిరాసక్తత బలంగా వినిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యమో లేక వారి ఉదాసీనతో తెలియదు గానీ సమాచారం మాత్రం సామాన్యునికి సకాలంలో అందడంలేదని ఒకపక్క ప్రజాస్వామికవాదులు మరో పక్క సమాచార హక్కుల కోసం నిత్యం నినదించే ప్రతినిధులు తమ వాణిని బలంగానే ప్రతిధ్వనింపజేస్తునారు. ఇలా వరుస వివాదాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న టీజీపీఎస్సీ కాలానుగుణంగా కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టినప్పటికీ ఏదో ఒక రూపంలో సరికొత్త వివాదాలు మాత్రం ఇంకా రాజుకుంటూనే ఉన్నాయి. నియామక ప్రక్రియలో భాగంగా టీజీపీఎస్సీ చేపట్టిన కొన్నివిధానాలు,వాటికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని జీవోలు సరికొత్త వివాదాలకు జీవంపోశాయని మేధావి వర్గం అభిప్రాయపడుతున్నది. వాటిని అధిగమించడం కోసం ఇటీవల టీజీపీఎస్సీ నల్సార్ యూనివర్సిటీతో కలిసి సంయుక్తంగా 'పబ్లిక్‌సర్వీస్ కమిషన్లకు ఎదురవుతున్న న్యాయవివాదాలు పరిష్కారం' అనే జాతీయ సదస్సును నిర్వహించింది.ఆసదస్సు ముగింపు సమావేశంలో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో వివాదాలు తలెత్తకుండా పారదర్శకత పెంచేలా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు పని చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా రాజ్యాంగ విలువలను కాపాడుతూ స్వతంత్రంగా సమగ్రతతో నియామకాలు చేపట్టాలని కూడా సూచించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సంధించిన పలుప్రశ్నలకు సహేతుకమైన సమాధానం ఇస్తూ ఎంపికైన అభ్యర్థుల పూర్తి వివరాలనుబహిర్గతం చేయడం ద్వారా అభ్యర్థులలో పారదర్శకతను పాదుగొల్పాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. కనీసం జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ప్రిలిమ్స్ మెయిన్స్ హాల్‌టికెట్ నంబర్లు, వయస్సు,కేటగిరి, మీడియం,లింగం పేపర్ వారీగా పొందిన మార్కుల వివరాలు, అట్లే బయోమెట్రిక్ హాజరులో వచ్చిన వ్యత్యాసం మీద వివరణ ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు' కాకుండా నియామక ప్రక్రియలో భాగంగా విడుదల చేసే జీవోలను ముందస్తుగానే పబ్లిక్ డొమైన్‌లో పెట్టి అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే అభ్యర్థుల నుంచి నిర్దేశిత సమయంలో స్వీకరించి ఎలాంటి న్యాయవివాదాలకు తావులేకుండా నియామక ప్రక్రియలను సజావుగా ముందుకు తీసుకుపోవాలని అందరూ కోరుకుంటున్నారు. ఆ దిశగా టీజీపీఎస్సీ అడుగులు వేస్తుందని ఆశిద్దాం! ●



మంగుళూరులో కురిసిన భారీవర్షాలకు నేలకూలిన ఇళ్లు



ముంబయిలో కురుస్తున్న భారీవర్షాలకు జలమయమైన రోడ్లు

# ముంచెత్తుతున్న భారీ వర్షాలు

## మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో జనజీవనం అస్తవ్యస్తం

## నీటమునిగిన ముంబయి శివారు ప్రాంతాలు, మహారాష్ట్రలో 18 మంది మృతి

## దేశమంతా విస్తరించిన నైరుతి పవనాలు

### వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

**ముంబయి, జూన్17:** మూడు వారాల పాటు స్తబ్దుగా ఉన్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తిరిగి వేగం పుంజుకున్నాయి. దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమతీర రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముంబై నగరాన్ని వానలు ముంచెత్తగా, కేరళలోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. రానున్న రోజుల్లో మరిన్ని రాష్ట్రాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయని భారత వాతావరణశాఖ వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు మధ్య, ఉత్తర అరేబియా సముద్రంతో పాటు గుజరాత్, విదర్భ, చత్తీస్‌గఢ్, ఒడిశాలోని పలు ప్రాంతాలకు విస్తరించాయి.

కొంకణ్, మధ్య మహారాష్ట్ర, తెలంగాణలో మిగిలిన ప్రాంతాలను కూడా కప్పేశాయి. రుతుపవనాలు మహారాష్ట్ర మొత్తం వ్యాపించి, పొరుగు రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్‌లోకి కూడా ప్రవేశించినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న రెండు, మూడు రోజుల్లో గుజరాత్, మహారాష్ట్రలోని మరిన్ని ప్రాంతాలు, విదర్భ, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లోనూ విస్తరించనున్నాయని అంచనా వేస్తున్నారు. గుజరాత్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం నేడు అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, వాయవ్య బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణశాఖ తెలిపింది. ఈ అనుకూల పరిస్థితుల వల్ల రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో నిన్న కొన్ని చోట్ల వర్షాలు కురిశాయని, రానున్న 24 గంటల్లో కూడా అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

రుతుపవనాల ప్రభావంతో మహారాష్ట్రలో, ముఖ్యంగా ఆర్థిక రాజధాని ముంబైలో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ముంబై నగరం, శివారు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, సబర్బన్ రైళ్లు, మెట్రో రైళ్ల సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాల కారణంగా ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 18 మంది మరణించారని, 65 మంది గాయపడ్డారని మహారాష్ట్ర అధికారులు వెల్లడించారు. రాబోయే 24 గంటల్లో ముంబై, శివారు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనావేసింది. భారీ వర్షాలకు ముంబై, థానే, పాల్ఘర్ తదితర ప్రాంతాలకు 'ఆరెంజ్' అలర్ట్, రాయగఢ్‌కు 'రెడ్' అలర్ట్ జారీ చేశారు.

కేరళలోనూ భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల బస్సులు, రైళ్ల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడింది. నదులు, జలాశయాల్లో నీటి మట్టాలు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో కన్నూర్, కాసరగఢ్ సహా పలు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కన్నూర్‌లోని కక్కడ్ ప్రాంతంలో రహదారిపైకి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాసర్‌కోడ్ జిల్లాలోని వెల్లరికుండ్ ప్రాంతంలో కనీసం 10 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

## దేశవ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో

# వెబ్ కాస్టింగ్ తప్పనిసరి

## ఎన్నికల కమిషన్ నిర్ణయం




**న్యూఢిల్లీ, జూన్ 17:** ఓటింగ్ రోజు అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఎన్నికల ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇప్పటి వరకు సమస్యాత్మకమైనవిగా భావించే వాటితో సహా మొత్తంగా 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే దీనిని నిర్వహించేవారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా నమోదు చేసిన సమాచారాన్ని ఎన్నికల సంఘం అంతర్గత అవసరాలకు వినియోగించుకోనుంది. త్వరలో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలనుంచి 100 శాతం వెబ్‌కాస్టింగ్ నిర్ణయం అమలుకానుంది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులకు ఇసి తెలియజేసింది. రాష్ట్ర స్థాయిలో, ప్రతి జిల్లాలో, అన్ని నియోజకవర్గాల స్థాయిలోనూ వెబ్‌కాస్టింగ్ మానిటరింగ్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తుంది. ప్రతి స్థాయిలోనూ నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుంది. వెబ్‌కాస్టింగ్ కోసం ఇంటర్నెట్ సదుపాయాన్ని వినియోగించుకోనుంది. ఆ సదుపాయం లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా వీడియో చిత్రీకరణ, ఫొటోలు తదితరాలపై ఆధారపడనుంది. మరింత నిశితంగా ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్‌కాస్టింగ్ ఉపయోగపడుతుందని భావిస్తు న్నారు. ఎన్నికల నిబంధనలకు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణల ప్రకారం వెబ్‌కాస్టింగ్ దృశ్యాలు, సిసిటివిల్లో నమోదైన దృశ్యాలను చూసేందుకు ప్రజలను అనుమతించరు.

# ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడి

## కీవ్‌లో అపార్ట్‌మెంట్లు ధ్వంసం, 14 మంది దుర్మరణం



**కీవ్, జూన్ 17:** ఒకవైపు ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న తరుణంలో మరోవైపు రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కీవ్‌పై మాస్కో భీకర క్షిపణి దాడులకు పాల్పడుతోంది. తాజాగా ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై జరిగిన దాడుల్లో 14 మంది ప్రాణాలు కోల్పోగా.. 40 మందికిపైగా పౌరులు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు పేర్కొన్నారు. కీవ్ సైనిక పరిపాలన అధిపతి తైమూర్ ట్కాచెంకో మాట్లాడుతూ రష్యా దాడిలో కీవ్‌లోని డజన్లకొద్దీ అపార్ట్‌మెంట్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. ఇప్పటికే 14 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు.

భవనాల శిథిలాల కింద అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని..దీంతో మృతులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఘటనా స్థలాల్లో సహాయకచర్యలు కొనసాగుతు న్నాయని పేర్కొన్నారు. ఈ దాడిలో ఒక అమెరికా పౌరుడు కూడా మరణించినట్లు వెల్లడించారు. రష్యా ప్రయోగించిన పలు డ్రోన్లను ఉక్రెయిన్ వైమానిక రక్షణ దళాలు కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. అయితే డ్రోన్లశిథిలాలు పడడంతో కీవ్‌లోని పలు ప్రాంతాల్లో మంటలు చెలరేగాయన్నారు. కాగా కెనడాలో జరుగుతున్న 'జి-7సదస్సు'కు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హాజరవ్వనున్నారు.

కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ రష్యా వరుసగా ఉక్రెయిన్‌పై అతిపెద్ద వైమానిక దాడులకు పాల్పడుతోంది. ఇటీవల ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో 80 నివాస భవనాలుసైతం ధ్వంసమయ్యాయి. ఇరాన్ రూపొందించిన షాహెద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించినట్లు అధికారులు పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపడానికి రష్యాపై ఒత్తిడి పెంచాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా, పశ్చిమ దేశాలను కోరారు.



# నిలకడగానే సోనియా ఆరోగ్యం

**న్యూఢిల్లీ, జూన్ 17:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని గంగారామ్ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆదివారం రాత్రి ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. మంగళవారం సోనియా ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ మాట్లాడారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఉదర సంబంధిత సమస్యనుంచి ఆమె పూర్తిగా కోలుకుంటున్నారని తెలిపారు. ఆమె డైట్‌ను పూర్తిగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సోనియాగాంధీ డిశ్చార్జి తేదీని ఇంకా నిర్ణయించలేదన్నారు. డాక్టర్ ఎస్ నండే, డాక్టర్ అమితాబ్ యాదవ్ సోనియా ఆరోగ్య పరిస్థితితోపాటు డైట్‌ను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ నెల 9న మెడికల్ చెకప్ నిమిత్తం సోనియాగాంధీ ఆస్పత్రికి వెళ్లిన విషయం తెలిసిందే.

# భాషల ఆధారంగా విడదీయొద్దు

## దేశంలోని అన్ని రాష్ట్రాలు జాతీయ విద్యావిధానం అమలు చేయాలి: ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ, జూన్ 17:** ప్రపంచంలోనే అత్యంత ఉత్కృష్టమైన భారతదేశాన్ని భాషల ఆధారంగా విడదీయడాన్ని భరించలేమని ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ అన్నారు. దేశ భవిష్యత్తు, శ్రేయస్సును పరిగణనలోకి తీసుకుని ఈ భయంకరమైన 'తుఫాన్'ను అధిగమించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు జాతీయ విద్యావిధానం 2020ని అమలు చేయాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఎందుకంటే ఇది విద్యారంగంలో ఓ 'గేమ్ ఛేంజర్' అవుతుందని, దేశాభివృద్ధిని మరింత పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఎందుకు ఇతర భాషలంటే వ్యతిరేకత?**

పుదుచ్చేరి విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ ఎవరి పేరు ప్రస్తావించకుండా పరోక్షవిమర్శలుచేశారు. దేశంలోని కొంత మందికి ఇతర భాషలు అంటే వ్యతిరేకత ఉందని విచారం వ్యక్తం చేశారు. 'గత దశాబ్దకాలంలో జరిగిన అసాధారణ అభివృద్ధి ఫలితంగా భారత్ ప్రపంచంలోనే అత్యంత ఆకాంక్షాత్మక దేశంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశాన్ని భాష పేరిట ఎలా విభజించగలుగుతాం?' అని ఆయన ప్రశ్నించారు.

**ఇండియా గ్రేట్**

ప్రపంచంలో ఏదేశంలోకూడా భారత్‌లో ఉన్నన్ని భాషలులేవు. సంస్కృతానికి ప్రపంచ ప్రాముఖ్యత ఉంది. మన దేశంలో పాలీ, ప్రాకృతం, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, ఒడియా, మరాఠీ, బెంగాలీ, అస్సామీ అనే 11 శాస్త్రీయ భాషలు ఉన్నాయి. 'పార్లమెంట్‌లో సభ్యులు 22భాషల్లో ప్రసంగించడానికి అనుమతిస్తారు. మన భాషలు దేశ సమగ్రతను సూచిస్తాయి. సనాతన ధర్మం ఒకే ఉన్నత లక్ష్యం కోసం కలిసి పనిచేయడానికి బోధిస్తుంది' అని జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. 'మన దేశ గమ్యస్థానాన్ని చూడండి. భవిష్యత్‌ను పరిగణనలోకి తీసుకోండి. భాషల పేరిట దేశాన్ని విడదీయాలనే వాదనను అధిగమించండి' అని ఆయన కోరారు.

**గేమ్ ఛేంజర్**

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని, ఇది ఒక గేమ్ ఛేంజర్ అవుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు. 'జాతీయ విద్యావిధానం ప్రపంచంలోనే అత్యుత్తమ విధానం. ఇది విద్యార్థులు తమ ప్రతిభను, సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడానికి, ఒకటి కంటే ఎక్కువ కోర్సులు నేర్చుకోవడానికి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అవకాశాన్ని అందిస్తుంది' అని ఆయన అన్నారు. రాజ్యాంగ నిర్మాతలు భాషల విషయంలో రాజకీయ ఘర్షణలు అవసరం లేకుండా విధానాన్ని రూపొందించారు. ఇందులో ఎలాంటి గందరగోళం లేదని అందరూ గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం..

## డిఎన్ఏ పరీక్షల ద్వారా 125 మృతదేహాల గుర్తింపు!

**అహ్మదాబాద్, జూన్ 17:** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో డిఎన్ఏ పరీక్ష ద్వారా ఇప్పటి వరకు 125 మంది బాధితుల వివరాలను గుర్తించినట్లు ఆసుపత్రి అధికారులు తాజాగా వెల్లడించారు. అందులో 83 మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మిగతా మృతదేహాల అప్పగింత ప్రక్రియ కొనసాగుతోంది. మృతదేహాలను గుర్తించడానికి అహ్మదాబాద్‌లో డిఎన్ఏ ప్రయోగశాల 24 గంటలూ పనిచేస్తోంది. 72 గంటల్లో పూర్తవుతుందని చెప్పిన డిఎన్ఏ పరీక్ష 84 గంటలైనా పూర్తి కాకపోవడంతో మృతుల బంధువుల సిటీ సివిల్ దవాఖాన వద్ద పడిగాపులు పడాల్సి వస్తున్నది. అయితే ప్రమాదంలో మృతదేహాలు గుర్తించలేనంత తీవ్రంగా కాలిపోవడంతో ఎముకల్లోని కణజాలాన్ని సేకరించి డిఎన్ఏ పరీక్షలు చేయాల్సి వస్తున్నదని అందుకే మృతదేహాల గుర్తింపు ఆలస్యమవుతున్నదని వైద్యులు తెలిపారు.

గతవారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో దాదాపు 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు విమాన ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పట్టాలెక్కనున్న 200 కొత్త రైళ్లు

## రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్

**న్యూఢిల్లీ, జూన్ 17:** రైలు ప్రయాణికులకు శుభవార్త! కొత్తగా 200 రైళ్లను పట్టాలెక్కించేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ రంగం సిద్ధం చేస్తోంది. 'ప్రయాణికుల సౌకర్యం కోసం కొత్తగా 50 నమో భారత్ రైళ్లు, 100 మెమూ రైళ్లు, 50 అమృత్ భారత్ రైళ్లు' అంటూ రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అత్యాధునిక వసతులతో కూడిన ఈ రైళ్ల విడియోను ఆయన షేర్ చేశారు. అయితే, ఈ రైళ్లు ఎప్పుడు పట్టాలెక్కబోతున్నాయి? ఏయే స్టేషన్లు / డివిజన్లలో అందుబాటులోకి వస్తాయనే వివరాలను మాత్రం పేర్కొనలేదు. మరోవైపు, హర్యానాలోని మనేసర్‌లో దేశంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌ను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సేవల్ని అప్‌గ్రేడ్ చేసేందుకు ఇటీవల ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం ఉన్న మెమూ రైళ్లను 8-12 కోచ్‌ల నుంచి 16-20 కోచ్‌లకు పెంచుతున్నామన్నారు. తద్వారా తక్కువ దూరం ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 100కి పైగా మెమూ రైళ్ల తయారీ కోసం కాజీపేటలో కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, కొత్తగా 50 నమో భారత్ రైళ్లను తయారు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రయాణికులతోపాటు సరకు రవాణాలో రైల్వే శాఖ కృషిని ప్రశంసించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేలు దాదాపు 720 కోట్ల మంది ప్రయాణికులను, 1,617 మిలియన్ టన్నుల సరకును రవానా చేసినట్లు తెలిపారు.

# 9 ఎయిరిండియా విమానాలు రద్దు




## సాంకేతిక లోపాలే కారణం

## సమీక్షించిన డిజిసిఎ

**న్యూఢిల్లీ, జూన్ 17:** ఎయిర్ ఇండియా విమానయాన సంస్థపై డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) చర్యలకు ఉపక్రమించింది. వరుసగా విమానాల్లో సాంకేతిక లోపాలు బయటపడడం, అవి రద్దు కావడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలో మంగళవారం ఎయిర్ ఇండియాతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించింది. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం దృష్ట్యా డిజిసిఎ కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అన్ని బోయింగ్ 787 విమానాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని ఎయిర్ ఇండియాకు రెండువారాల గడువు విధిస్తూ డిజిసిఎ ఆదేశాలు కూడా ఇచ్చింది. అయితే.. ఈలోపే వరుసగా సాంకేతిక లోపాలతో ఘటనలు వెలుగులోకి వస్తుండడంతో డిజిసిఎ అప్రమత్తమైంది. గత 48 గంటల్లో 9 ఘటనలు చోటుచేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలోనే మంగళవారం ఎయిరిండియా ప్రతినిధులతో వర్చువల్ సమావేశం నిర్వహించింది. బోయింగ్ విమానాల్లో సాంకేతిక సమస్యలపై ప్రశ్నలు సంధిస్తూ ఎయిరిండియా ఇంజినీరింగ్ చీఫ్‌కు డిజిసిఎ సమన్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం ఒకేరోజు ఎయిర్ ఇండియాకు చెందిన మూడు అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. శాన్‌ఫ్రాన్సిస్కో-ముంబై, అహ్మదాబాద్-లండన్ సర్వీసు రద్దు కాగా తాజాగా ఢిల్లీ-ప్యారిస్ సర్వీసు కూడా రద్దు అయినట్లు తెలుస్తోంది.

**ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం**

అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే మరో ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానసర్వీసును రద్దు చేశారు. మధ్యాహ్నం 1.10 గంటలకు ఎఐ 159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం లండన్‌కు బయల్దేరాల్సి ఉంది. ఎయిర్‌పోర్టు వచ్చాకే విమానం రద్దు విషయం తెలిసిందని ఓ ప్రయాణికుడు తెలిపాడు. విమాన రద్దుకు కారణంలేదా ఛార్జీల వాపసు వివరాలను సిబ్బంది చెప్పడం లేదని అంటున్నాడు.

**సాంకేతిక సమస్యతో ప్రయాణికుల దించివేత**

ఎయిర్ ఇండియా విమానం (ఎఐ180) శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబయికి వెళ్తోంది. మంగళవారం అర్ధరాత్రి 12.45 గంటలకు కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకుంది. ఈ క్రమంలో విమానంలోని ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని సిబ్బంది వెంటనే గుర్తించి అప్రమత్తమయ్యారు. భద్రతా కారణాల రీత్యా ప్రయాణికులను విమానం నుంచి దించేశారు. విమానంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. అలాగే తాజాగా ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లే ఎయిర్ ఇండియా విమానంలోనూ సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని ఎయిర్‌లైన్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఎఐ 143 రద్దు చేసినట్లు తెలిపింది. ముందస్తు విమాన తనిఖీల్లో సమస్యను గుర్తించినట్లు పేర్కొంది. ఫలితంగా బుధవారం పారిస్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఎయిర్ ఇండియా ఎఐ 142ను కూడా తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. హోటల్ వసతి సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్లు తెలిపింది. సోమవారం హాంకాంగ్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఎఐ 315 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు.

# జి-7లో 'మెలోనీ వైఖరి'పై ఆసక్తికర చర్చ

## ప్రధాని మోడీ రాకముందే వెనుదిరిగిన ట్రంప్

**ఒట్టావో, జూన్ 17:** కెనడాలో జి-7 సదస్సు జరుగుతున్న విషయంతెలిసిందే. ఈ సదస్సులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మధ్య చోటుచేసుకున్న ఆసక్తికర సంఘటనకు సంబంధించిన విడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కెనడాలోని అల్బెర్టా ప్రాంతంలో 51వ జి-7 శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమావేశానికి భారత ప్రధాని నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా వివిధ దేశాల ప్రధానమంత్రులు హాజరయ్యారు. అయితే ఈ సదస్సులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ప్రవర్తించిన తీరు ప్రస్తుతం నెట్టింట చర్చకు దారి తీసింది. సభలో వివిధ అంశాలపై డొనాల్డ్ ట్రంప్ తదితరులు చర్చిస్తున్న సమయంలో జార్జియా మెలోనీ విచిత్రంగా ప్రవర్తించారు. పక్కనే కూర్చున్న ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్.. జార్జియా మెలోని చెవిలో ఏదో చెప్పసాగాడు. దీంతో ఆమె తల దగ్గరగా పెట్టి మరీ ఆసక్తిగా మొత్తం విన్నారు. డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలోనే ఇదంతా జరిగింది. ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాటలను శ్రద్ధగా విన్న జార్జియా మెలోనీ. చివరగా బొటనవేలు పైకి చూపడంతోపాటు కళ్లను ఆర్పుతూ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో అంతా వీరి సంభాషణపై వివిధ రకాలుగా చర్చించుకుంటున్నారు. నెటిజన్లు వారి సంభాషణపై తమకు తోచిన విధంగా ఫన్నీ ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు.

గతంలో అల్బేనియా రాజధాని టిరానాలో జరిగిన యూరోపియన్ పొలిటికల్ కమ్యూనిటీ సమ్మిట్‌కు మెలోనీ హాజరైనసందర్భంలో అల్బేనియన్ ప్రధానమంత్రి ఎడి రామా మోకాళ్లపై నిలబడి మెలోనీకి స్వాగతం పలికిన విడియో తెగ వైరల్ అయింది. అలాగే అమెరికా టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్‌తో జార్జియా మెలోని దిగిన ఫొటోలు కూడా తెగ వైరల్ అయ్యాయి. ఇదిలా ఉండగా అల్బెర్టాలో సోమవారం రాత్రి జరిగిన 51వ జి-7 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన విషయం తెలిసిందే. అయితే ట్రంప్ సదస్సు నుంచి అకస్మాత్తుగా నిష్క్రమించారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితుల కారణంగానే ఇలా త్వరగా వెళ్లినట్లు తెలుస్తోంది. మరోవైపు పదేళ్ల తర్వాత భారత ప్రధాని నరేంద్రమోడీ కెనడాలో అడుగుపెట్టారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు మోడీ ఈ సదస్సుకు హాజరయ్యారు. అయితే ప్రధాని మోడీ కెనడాలో అడుగుపెట్టడానికి ముందే .. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఈ సదస్సు నుంచి అర్థాంతరంగా వెళ్లిపోయారు.

# కర్ణాటక డిప్యూటీ సిఎం సోదరుడు డికె సురేష్‌కు ఇడి సమన్లు

**బెంగళూరు, జూన్ 17:** మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కాంగ్రెస్ నేత, కర్ణాటక ఉపముఖ్యమంత్రి శివకుమార్ సోదరుడు డికె సురేశ్‌కు సమన్లు జారీ చేసినట్లు అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి. మాజీ ఎంపి సురేశ్‌ను ఈ నెల 19న విచారణకు హాజరుకావాలని.. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద వాంగ్మూలం నమోదు చేయాలని కోరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఏప్రిల్‌లో ఐశ్వర్యగౌడ అనే మహిళను ఇడి అరెస్టుచేసింది. ఆ మహిళ అనేకమంది హైప్రొఫైల్ రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉందని చెప్పుకుందని ఇడి ఓ ప్రకటనలో పేర్కొంది. బంగారం, నగదు, బ్యాంకు డిపాజిట్లపై అధిక మొత్తంలో రాబడిని ఎరవేసి మోసి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. డికె సురేశ్ పేరును ఉపయోగించుకుందని.. అతని సోదరి అని చెప్పుకున్నట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. మాజీ ఎంపి సైతం బెంగళూరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.



మంగళవారం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

## ప్రజావాణికి 272 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 17,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 272దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 51దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 74దరఖాస్తులు ,ఇందిరమ్మ ఇండ్ల కోసం 28దరఖాస్తులు, విద్యుత్ శాఖకు 24 దరఖాస్తులు,ప్రవాసీ ప్రజావాణికి 2దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 93దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.సీఎం ప్రజావాణి ఇంచార్జ్ ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలను విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## ఎస్సీ గురుకులాల్లో ముగిసిన అడ్మిషన్లు

### 5 నుంచి 9వ తరగతి వరకు పూర్తి

### సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సి డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్సి గురుకులాల్లోని స్కూల్స్‌లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినట్టు సొసైటీ కార్యదర్శి డాక్టర్ వివిఎస్ అలుగు వర్షిణి తెలిపారు. ఎస్సి గురుకులాల్లోని 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఇప్పటికే నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు వారు సాధించిన మార్కులను బట్టి, కులం, ఆయా జిల్లాలోని గురుకులాల్లో ఖాళీలను బట్టి వారికి సీట్లను కేటాయించడం జరిగిందని గురుకుల కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 5 నుండి 9వ తరగతి వరకు అన్నితరగతులకు 100శాతం పూర్తిగా భర్తీ అయ్యాయని ప్రకటనలో వెల్లడించారు. అడ్మిషన్లలో ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆయా జిల్లాలోని జోనల్ అధికారులను సంప్రదించాలని సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు.

## ఆహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

### టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు

### రెస్టారెంట్‌ను పరిశీలించి, పర్యాటకులతో మాట్లాడిన మంత్రి

**హైదరాబాద్ జూన్17,ప్రభాతవార్త:** హోటల్స్‌లో పరిశుభ్రత పాటించాలని, ఆహారంలో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాహోటల్‌లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ అంతా కలియతిరుగుతూ. ఆహార పదార్థాలను, కిచెన్‌ను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు,అతిథులతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు.అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ హరిత హోటల్స్‌లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామన్నారు.నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్స్ నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిధుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతారణం ఉండేలా హరిత హోటల్స్‌ను తీర్చిదిద్దుతామన్నారు.

## కులగణన చేపట్టకపోతే రోడ్లపైకి వచ్చి యుద్ధమే

### మాజీ పిసిసి చీఫ్ వి.హనుమంతరావు




**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:** జనాభాగణన కోసం కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వులలో కులగణ అంశం పేర్కొనలేదని ఒక వేళ కులగణన చేపట్టకపోతే కులగణన చేయాలని రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని మాజీ పిసిసి చీఫ్,మాజీ రాజ్యసభ సభ్యుడు విహనుమంతరావు హెచ్చరించారు. గాంధీ భవన్‌లో వీహెచ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనగణన అంటుదే, కానీ కులగణన ప్రస్తావన చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగణనతో మాకేం లాభం ఉండదని వనరులపై మాకు మా వాటా దామాషా పద్ధతిలో అందాలంటే కులగణన చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. అగ్రకులంలో ఉన్న రాహుల్, రేవంత్ బిసి కోసం ఆలోచిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. బిసి అని చెప్పుకునే నరేంద్ర మోడీ బిసి కోసం ఆలోచించడం లేదు అని అన్నారు. జనగణన వల్ల బిజెపికి లాభం తప్పా బిసిలకు లాభం లేదు అని ఆయన అభిప్రాయపడ్డారు. కులగణన కోసం అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడాలని ఆయన కోరారు.

## భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం



మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటిని కలిసిన కొత్తగా నియమితులైన కలెక్టర్లు

**హైదరాబాద్ జూన్17,ప్రభాతవార్త:** తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమని గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాలతో రాష్ట్రంలోని ప్రతిగ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని, భూ భారతి చట్టంతో ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు.కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్‌ప్రావీణ్య, సిద్దిపేటకలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి,స్టాంప్స్ రిజిస్ట్రేషన్ స్పెషల్‌సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ మంగళవారం సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు,బాధలకు విముక్తి కల్పించేలా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వచ్చే 2 నెలలు రెవెన్యూశాఖకు అత్యంత కీలకమైనవని భూ సమస్యల పరిష్కారానికి గడువుగా నిర్ణయించిన ఆగస్టు 15నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పని చేయాలని సూచించారు.

## గ్రామ స్థాయి నుంచి బిసిలు ఉద్యమించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు



**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 17 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేంతవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రిజర్వేషన్‌లపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై గ్రామ స్థాయి నుంచి రాజధాని నగరం వరకు బిసిలను చైతన్యవంతం చేస్తామని ఆయన తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి రిజర్వేషన్‌లు పెంచడానికి ప్రభుత్వానికిగల ఇబ్బందులు ఏమిటి?, వాటిని అధికమించడానికి ఏమి చర్యలు తీసుకోవాలని, దీనికి అన్ని పార్టీల మద్దతు ఎలా కూడాగట్టాలి? అనే అంశాలపై ప్రభుత్వం ఏనాడైన ఆలోచించిందా!, ఆదిశగా ప్రభుత్వం ఏమైన చర్యతీసుకుందా ?అని ప్రశ్నించారు. గతంలో బిసిలకు రిజర్వేషన్‌లు ఎన్టీఆర్, విజయభాస్కర్‌రెడ్డి పెంచారని, వారికి మంచి పేరు వచ్చిందని, ఇప్పుడు కూడా ప్రభుత్వం పెంచితే సిఎం రేవంత్‌రెడ్డికే మంచి పేరు వస్తుందన్నారు. ఈ సమావేశంలో బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు, బిసి నేతలు అనంతయ్య, జిల్లపల్లి అంజీ, వేముల రామకృష్ణ, పగిళ్ళ సతీష్, రాందేవ్, కార్మిక నేత చిక్కుడు బాలయ్యముదిరాజ్, కె.సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం లక్ష కోట్లకు పైగా వ్యయం

### 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయలు జమ

### చొప్పదండి, పరిగి శాసనసభ్యులు, మేడిపల్లి సత్యం, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి



**హైదరాబాద్,జూన్17,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 18నెలల కాలంలో వ్యవసాయదారుల సంక్షేమ అభివృద్ధి కోసం లక్ష కోట్లకు పైగా నిధులు వ్యయం చేశామని రైతులు అప్పుల ఊబిలో నుంచి గట్టెక్కించేందుకు 20 వేల 616 కోట్ల రుణమాఫీ చేశామని చొప్పదండి,పరిగి శాసనసభ్యులు మేడిపల్లిసత్యం, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలోని సిఎల్పీ మీడియా సెంటర్‌లో ఇరువురు శాసనసభ్యులు మాట్లాడుతూ రైతు భరోసా పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారని,కేవలం 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాల్లో వేయడం సాహసోపేతమైన చర్య అని అభివర్ణించారు. వరల్డ్ సింగ్‌ను ఛాంపియన్ ఆఫ్ ది ఫార్మర్స్ అన్నట్లుగానే తెలంగాణ పునర్నిర్మాణ నేత రేవంత్ రెడ్డి ఛాంపియన్ ఆఫ్ తెలంగాణ ఫార్మర్స్ అయ్యారని వారు కొనియాడారు.దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చర్యలు రైతుల సంక్షేమం కోసం అమలు చేశారని వారు చెప్పారు. లక్ష రూపాయల రుణమాఫీ కూడా సరిగా చేయలేక ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం చతికిలపడి పోయిందని వారు చేసిన అరకొర రుణమాఫీ వడ్డీకే సరిపోయిందని ఎద్దేవా చేశారు. రైతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదని వారు చరిత్రను గుర్తుచేసుకున్నారు. మా ముఖ్యమంత్రి రైతన్నలకు అండగా నిలుస్తున్నారని. రైతు భరోసా తో ప్రతిపక్ష నాయకులకు నిద్ర లేకుండా పోయిందనీ ప్రతిపక్ష నేతల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయిందని అన్నారు. ఒక నాయకుడు జ్వరంతో ఆస్పత్రిలో చేరారని అపహాస్యం చేశారు. మా ప్రభుత్వాన్ని కొందరు శాపనార్థాలు పెడుతున్నారని,రైతులపట్ల మా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపక్షాలు అభినందించాలని కోరారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి కెసిఆర్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. దేశంలోనే తెలంగాణ రైతులు తలెత్తుకునేలా మా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని 25 లక్షల మంది కి పైగా రైతులకు రైతు భరోసా కింద ఇప్పటివరకు 12,682 కోట్లు చెల్లించామని గణాంకాలతో వివరించారు. ఈ సారి రైతు భరోసా కింద 8,675 కోట్లు చెల్లించబోతున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ కోసం16,691 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్ కోసం43,835 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. రైతు బీమా కోసం.2,181 కోట్లు, పంట నష్టపరిహారం కోసం 260 కోట్లు చెల్లించామని మేడిపల్లి సత్యం, రామ్మోహన్‌రెడ్డి గణాంకాలతో వివరించారు. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని నిరుపేదలకు నిలువ నీడ కల్పించిన ఘనత మా కాంగ్రెస్‌దే అని వారు అన్నారు.మరో విడతఇందిరమ్మ ఇళ్లుత్వరలోనే మంజూరు చేస్తాం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తానని గతంలో కెసిఆర్ మభ్యపెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. పేదలకు కరెంటు బిల్లు లేదు, సన్న బియ్యం ఇస్తున్నాం,రేవంత్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు చూసి తెలంగాణలో కలుస్తామని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు అడుగుతున్నారని ఎమ్మెల్యే లిద్దరు చెప్పుకున్నారు. కెసిఆర్ కుటుంబం సముద్రంలో మునిగిపోయే నావ లాంటిదని ప్రజలు నమ్మడం లేదని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా బిఆర్ ఎస్ నాయకులు అనేక విధాలుగా కుట్ర చేస్తున్నారని అందువల్లే రాబడి తగ్గిందని ఆవేదన వ్యక్తంచేశారు.

# హత్యాకాండను తక్షణమే ఆపాలి

### మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలి

### శాంతి చర్చల కమిటీ నేతల డిమాండ్




మంగళవారం మహాధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్(ధర్నాచౌక్), జూన్ 17, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరిట సాగిస్తున్న హత్యాకాండను తక్షణమే ఆపాలని శాంతి చర్చల కమిటీ, తెలంగాణ రాష్ట్రం నేతలతో పాటు వివిధ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకార్యక్రమంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, ప్రముఖ సినీ నటులు ఆర్.నారాయణమూర్తి,అరుణోదయ నాయకురాలు విమలక్క, ప్రొఫెసర్ హరగోపాల్, కందిమళ్ల ప్రతాపరెడ్డి, పశ్య పద్మ, రమ, మల్లు లక్ష్మి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, కే.గోవర్ధన్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో 2024 జనవరి నుండి మావోయిస్టులను అణిచివేసే పేరిట ప్రారంభించిన హత్యాకాండలో ఇప్పటి వరకు దాదాపు ఐదు వందల మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో రాజ్యాంగం, చట్టాలలో పేర్కొన్న ఆదివాసుల హక్కులను కాలరాయటమే కాకుండా, అక్కడ ఉన్న ప్రకృతి వనరులు, ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పోరేట్లకు ధారాదత్తం చేయటమే లక్ష్యంగాఈ హత్యాకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వమే హత్యలకు పాల్పడటం, గిరిజన బిడ్డలను పొట్టనపెట్టుకోవటం దారుణమన్నారు. నక్సల్ సమస్య సామాజిక అసమానత సమస్య కాబట్టి, శాంతి చర్చల ద్వారానే పరిష్కారం అవుతుందని అభిప్రాయపడ్డారు. టెర్రరిస్టులను ప్రోత్సహించిన పాకిస్తాన్‌తో శాంతి చర్చలు జరిపిన మోదీ ప్రభుత్వం ప్రజల కొరకు పనిచేస్తున్న మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం కొరకు కృషి చేయకపోవటం రాజ్యాంగానికి వ్యతిరేకమని ఆరోపించారు. ఆదివాసీలతో సహా మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించే ఆపరేషన్ కగార్‌ను ఆపి, కాల్పుల విరమణను ప్రకటించి, మావోయిస్టు పార్టీతో భేషరతుగా శాంతిచర్చలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ మహాధర్నా లో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే ప్రతిపాదన విరమించాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 17 ప్రభాతవార్త:** ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్‌ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ భారీ ధర్నా భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన క్లెయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడంతో పాటు అనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్‌ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన భారీ ధర్నాలో సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వము ఆలోచన చేయడం బాధాకరమని అన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో కార్మిక శాఖ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా భీమా రంగానికి అప్పజెప్పడం ఎంతవరకు సమంజసమో పునరాలోచించాలన్నారు. రాష్ట్రంలో 15 లక్షాకుపైగా మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదైనారని, బోర్డు ద్వారా చెల్లిస్తున్నటువంటి డబ్బులు కార్మికశాఖ చేతులు దులుపుకొని బీమా కంపెనీకి అప్పజెప్పడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు పెన్షన్ అమలు చేయాలని, ఇన్సూరెన్స్ రంగానికి ఇచ్చే టెండర్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటియూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీన గుట్టు చప్పుడు కాకుండా సంక్షేమ బోర్డు వారు ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి టెండర్ కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇన్సురేన్స్ కంపెనీకి అప్పజెప్పడం వల్ల కార్మికులకు వచ్చే అదనపు ప్రయోజనాలు వెల్లడించాలని, సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కార్మికులకు నిధులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తూ నేడు బీమా కంపెనీ లకు అప్పచెప్పటం విచారకరమన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్‌ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మోటె నరసింహా , వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, అధ్యక్షులు ఏం ప్రవీణ్ కుమార్,ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మేకల శ్రీనివాస్, పానుగంటి పర్వతాలు,, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి రాజు నూనె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు నెలవారీ లక్ష్యాలు పెట్టుకుని పనిచేయాలి

### పంచాయతీరాజ్ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** అధికారులు నెలవారీగా లక్ష్యాలు పెట్టుకుని పని చేయాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆమె పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సమీక్ష సమావేశంలో శాఖల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని, అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యకలాపాలను,హామ్ విధానంలో రోడ్ల నిర్మాణం, ఇందిరా మహిళా శక్తి, స్త్రీ నిధి, మిషన్ భగీరథ,ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు. అనం తరం మంత్రి సీతక్క మాట్లాడుతూ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అత్యంత కీలకమైన శాఖ, రెండున్నర కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శాఖలోపని చేసిన అధికారులు పదోన్నతులు పొందారని ఆమె గుర్తు చేశారు. పంచాయితీరాజ్‌శాఖలో మంత్రి, ఉద్యోగులు వేరు వేరుగా చూడలేదు.మంత్రి నుంచి మల్టీపర్పస్ వర్కర్ వరకు అందరూ ఒక కుటుంబంగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి పరచాలన్నారు. వరంగల్ కలెక్టర్‌గా సింగరేణి సిఎండిగా నా నియోజకవర్గ అభివృద్ధికి శ్రీధర్ ఎంతగానో సహకరించారని మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఉద్యోగ సమస్యలను పరిష్కరించాము.93 వేల గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నా మని,ఎంపీడీవోల బదిలీల ఫైలు సీఎం వద్ద ఉందన్నారు. ఎంపీడీవోలకు వాహనాల అలవెన్స్ ఫైల్ ఆర్థిక శాఖవద్దకు చేరిందని, ఈ రెండు ఫైళ్ళకు కొద్ది రోజుల్లో క్లియరెన్స్ వస్తుందన్నారు. ఎంతోకాలంగా గ్రౌండింగ్ కానీ పనులను రద్దు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ బిజెపిలో అంతర్గతపోరు

### కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై రాజాసింగ్ రియాక్షన్

### ఆ విషయంలో ఎక్కడికైనా, ఎప్పుడైనా రావడానికి సిద్ధం!



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ బీజేపీలో అంతర్గత పోరు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే రాజాసింగ్ "సీనియర్ నాయకుడు"అని, తనను "సామాన్య కార్యకర్తను" అని పేర్కొనడమే కాకుండా, రాజాసింగ్ చెప్పినట్లు తాము పాటిస్తామని రాష్ట్ర కమలం పార్టీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతుంది. దీంతో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై గోషామహల్ శాసన సభ్యులు రాజాసింగ్ స్పందించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విభేదాలను విడిచి పెట్టి, ఐక్యంగా లక్ష్య సాధన కోసం పని చేద్దామని కోరారు. మీరు ఎప్పుడు కలిస్తానని చెప్పిన అప్పుడు వచ్చి కలుస్తానన్నారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారం లోకి రావాలనేది నా ఉద్దేశ్యం, వ్యక్తిగత లబ్ధి, పదవుల కోసం తాను ఎప్పుడూ పని చేయలేదని రాజాసింగ్ వెల్లడించారు. అయితే, పార్టీని బలోపేతం చేయడం కోసం అంకితభావంతో పని చేశాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. తెలంగాణలోని మొత్తం 119 నియోజకవర్గాలలో బీజేపీ విజయం సాధించడంపై దృష్టి పెట్టడానికి బదులుగా, పార్టీకి నిస్వార్థ సేవ చేసినప్పటికీ, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, అడ్డంకులు సృష్టించడం జరుగుతోంది అని పేర్కొన్నారు. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభం? ఇది పార్టీకి ఏమైనా ఉపయోగపడుతుందా? అని ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డాను.ఈ రోజు కూడా నా కోసం కాకుండా, పార్టీ ఐక్యత కోసమే పని చేస్తున్నాను, లక్షలాది మంది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవడం కోసం మాట్లాడు తున్నాను అని చెప్పుకొచ్చారు. కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాను..కొంచెం సమయం కేటాయించండి వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను పరిష్కరించుకుందాం అన్నారు. కిషన్‌రెడ్డి ఎక్కడికి, ఎప్పుడు అనేది నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. తాను పార్టీని విభజించడానికి కాదు. ఐక్యంగా ఉండటానికి ఇక్కడ ఉన్నాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పుకొచ్చారు.



## మోడీ పాలనతో రెండింతల అభివృద్ధి

### నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** దేశంలో నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో అన్ని రంగాల్లో రెండింతలు అభివృద్ధి కనిపిస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జీరో బ్యాలెన్స్‌తో ప్రారంభించిన జన్‌ధన్ యోజనపై అప్పట్లో ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేశాయి. కానీ ఈరోజు కోట్లాది అకౌంట్లు ఓపెన్ చేయడం జరిగిందని, ఇప్పటివరకు సుమారు 6 లక్షల కోట్ల రూపాయలు డిపాజిట్ అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 10 సంవత్సరాల్లో పేదలకు 4 కోట్ల ఇండ్లు నిర్మించింది. రాబోయే 5 సంవత్సరాల్లో మరో 3 కోట్ల ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆ పనులు ప్రారంభమయ్యాయని, పిఎం ఉజ్వల యోజన కింద గ్రామీణ మహిళలకు లక్షలాది ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిందన్నారు. కోవిడ్ టైంలో ప్రారంభమైన ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 5 కిలోల ఉచిత బియ్యం పథకం కొనసాగుతుందన్నారు.

## వికసిత సంకల్ప సభల కోసం బిజెపి కార్యాచరణ

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** తెలంగాణలో వికసిత్ సంకల్ప సభలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక విడుదల చేసిన ప్రకటన విడుదల చేశారు. బిజెపి రాష్ట్ర స్థాయి నేతలు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు నియోజకవర్గాల లో మండలం, పట్టణ ప్రాంతాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సభల ద్వారా నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలు గ్రామీణ స్థాయిలో ప్రజలకు చేరవేయడం లక్ష్యమన్నారు.

## వాగ్ధానాలకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన

### బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అన్ని వర్గాలకు సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా పాలన కొనసాగిస్తుందని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ అన్నారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన నిర్వాహక వైఫల్యాల దృష్ట్యా ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారు. గత ఎన్నికల సమయంలో బిసి, ఎస్సీ, యువ డిక్లరేషన్‌ల పేరుతో ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పాలనలో నిరక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాట వినడం లేదని ఐఏఎస్ అధికారులపై లీకులు ఇచ్చే స్థితికి దిగజారడం దురదృష్టకరమన్నారు.. సిఎంఓ ఆదేశాలకే అధికారులు స్పందించక పోతున్నారన్న ఆరోపణలు వినపడుతు న్నాయ న్నారు. ప్రభుత్వ వైఫల్యాల బాధ్యతను ఉద్యోగు లపై నెట్టడం అనాగరికపు చర్య అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలనను గాలికి వదిలిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. రిటైర్డ్ ఉద్యోగులకు పిఎఫ్, పెన్షన్, ఇతర బెనిఫిట్లు ఇవ్వలేమన్న మాటలు ముఖ్యమంత్రి నోటివెంట రావడం దురదృష్టకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అమలు చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ప్రజలకు ఇచ్చిన హామీలఅమలు బాధ్యత సిఎంపై ఉందని, ప్రజల నుంచి ఓట్లు పొందిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.

## ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌పై విద్యార్థులకు అవగాహన

### 21న జేఎన్‌టీయులో మాక్ కౌన్సెలింగ్

**ఉన్నత విద్యా మండలి, జెఎన్‌టియూ సంయుక్త నిర్వహణ**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఈ నెల 21న కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయు క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జేఎన్‌టియు, ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే వారికి కౌన్సెలింగ్‌పై అసలు అవగాహన లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న మాక్ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు విద్యార్థుల నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి అవకాశం కల్పించనున్నారు. నేటి నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి అవకాశం కల్పించనున్నారు. ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అనుమతించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ మాక్ కౌన్సెలింగ్‌లో అవగాహన కల్పించనున్నారు.

## డ్రగ్‌మాఫియా కట్టడికి రేవంత్ సర్కార్ కృషి

### గ్రామస్థాయిలో వెయ్యి జెబిఎం యూనిట్లు ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 17,ప్రభాతవార్త:** తెలంగాణలో డ్రగ్‌మాఫియా కట్టడికి రేవంత్‌సర్కార్ కఠినమైన నిర్ణయాలు తీసుకుని ఉక్కుపాదంతో అణిచివేస్తున్నదని జవహర్ బల మంచ్ చైర్మన్ మామిడి రిషికేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీభవన్ జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి రిషికేశ్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర జెబిఎం కార్యవర్గ సమావేశం నాంపల్లిలోని గాంధీభవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయస్థాయిలో "మహబత్ క దుకాన్" రాష్ట్ర స్థాయిలో "నో టు డ్రగ్స్" "తెలంగాణ యంగ్ స్కాలర్స్" వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు, పోస్టర్లను ఈ సమావేశంలో విడుదల చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా ద్వేషం, రాగాలను వీడనాడి ప్రేమను పంచాలని, చెప్పిన విధంగా కూడు, గుడ్డ, తిండి వంటి వాటిని ఒకే గొడుగు క్రింద కి తీసుకొచ్చి ప్రయోజనం చేకూర్చాలని మహబత్ కా దుకాన్ కార్యక్రమాన్ని జాతీయస్థాయిలో నిర్వహించనున్నారు. దీనితో పాటు యంగ్ తెలంగాణ స్కాలర్షిప్ కార్యక్రమంలో నియోజకవర్గానికి ఐదు మంది పిల్లలకు మెరిట్ ప్రాతిపదికన స్కాలర్షిప్ అందించనున్నారు. అంతే కాకుండా జెబిఎం యూనిట్‌లోని పిల్లలకు 11 టెస్ట్ బుక్స్, స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ పంపిణీ చేయనున్నారు. మాదకద్రవ్యాలు నిర్మూలించడానికి ప్రతి పాఠశాలలో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని జెబిఎం యూనిట్లను100 నుంచి 1000 వరకు ఏర్పాటుచేసి, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు క్షేత్రస్థాయిలో పెంచే విధంగా కార్యాచరణ ప్రారంభించనున్నారని ఈ సమావేశంలో చర్చించుకోవడం జరిగిందని చైర్మన్ రిషికేశ్ రెడ్డి తెలిపారు.



## డొనేషన్ల దోపిడీని అరికట్టాలి

### తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు బిజెవైఎం ధర్నా

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ విద్యాసంస్థలలో డొనేషన్‌ల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ళ మహేందర్ అన్నారు. మంగళవారం బిజెవైఎం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నతా విద్యా మండలి కార్యాలయం ముందు రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ళ మహేందర్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థుల యొక్క సీట్ల భర్తీ విషయంపై ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్ విడుదల కానీ కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు ఒక సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అలాంటి కళాశాలల గుర్తింపుని వెంటనే తొలగించే ప్రయత్నం చేస్తూ, ఈ సమస్య పరిష్కారం అయ్యే విధంగా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, తరుణ్, చితరంజాన్, కుమార్, సంతోష్, ప్రధాన కార్యదర్శులు సామల పవన్, గణేష్, సురేష్, కోశాధికారి యోగి, కార్యదర్శి ప్రవీణ్, అశోక్, నాయకులు సుధీంద్ర శర్మ, అరవింద్, వినీత్, అనిత, మహేందర్, భగీరత్, నితిన్, అవినీష్, నరేన్, గోవర్ధన్, రామకృష్ణ, ఆకాష్, అరుణ్, చక్రి, వినేయ్, రాఘవేంద్ర, ఇంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్



**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు సంబంధించిన కీలకమైన నిర్ణయాన్ని హైకోర్టు తీసుకుందని, ఈ తీర్పును స్వాగతిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ అన్నారు. 2014 ఎన్నికల ముందు కెసిఆర్ ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్రూమ్ ఇల్లు కట్టిస్తామన్నారు. 2023 ఎన్నికలకు ముందే కొన్ని డబుల్ బెడ్రూమ్ ఇళ్లను అలాట్ చేయడం ప్రారంభించారు. ఇది పూర్తిగా ఎన్నికల ప్రయోజనార్థంగా ఉందన్నారు. గత సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయం ఏమిటంటే రంగారెడ్డి జిల్లాలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న నియోజకవర్గాలకు కేటాయించడం జరిగింది. తుక్కుగూడలో నిర్మించిన 2700ఇళ్లలో, దాదాపు 2500 ఇళ్లు జిహెచ్ఎంసికి చెందిన యాకుత్‌పురా, చంద్రాయణగుట్ట,మలక్‌పేట్,చార్మినార్, బహదూర్‌పుర నియోజకవర్గా లకు కేటాయించబడ్డాయి. ఒక్కో నియోజకవర్గానికి 400-500 కుటుంబాలకు ఇళ్లుఇవ్వడం జరిగింది. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని నియోజకవర్గాలలో నివసిస్తున్నవారు కేవలం ఒకే మతానికి చెందినవారని, ముఖ్యంగా ముస్లింలకు మాత్రమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించారని ఆరోపణలు ఉన్నాయన్నారు. మొత్తం దాదాపు 2400 ఇళ్లు కేవలం ముస్లిం మైనారిటీకి కేటాయించారన్నారు. దీని వల్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి మైనారిటీ అపీజ్మెంట్ విధానంలో కొనసాగుతున్నట్లు స్పష్టమవుతుందన్నారు.

## రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలు పెడితే అడ్డుకుంటాం

### బిసి సంఘాలు, మేధావుల రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:** కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు హామీ ఇచ్చిన ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని, బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యతను కాంగ్రెస్, బిజెపి పార్టీలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్రంలో కాంగ్రెస్ బిజెపి నేతలు ఎక్కడికక్కడ అడ్డుకుంటామని బిసి సంఘాల నేతలు నేడు తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసిసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో "స్థానిక సంస్థల ఎన్నికలు -బీసీ రిజర్వేషన్ల పెంపు భవిష్యత్ కార్యాచరణ" పై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు, శాసనసభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో కుందారం గణేష్‌చారి, బాలగోని బాలరాజు గౌడ్, చిన్న శ్రీశైలం యాదవ్, బీసీ నేతలు ఉప్పరి శేఖర్ సగర, దీటి మల్లయ్య, ప్రొఫెసర్ నరేందర్, సీనియర్ జర్నలిస్ట్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ వల్లే గతంలో కాంగ్రెస్ ఓటమి

### నీచమైన పనికి దిగజారిన బిఆర్ఎస్

### సిట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా ప్రకంపనలు రేపిన ఫోన్ ట్యాపింగ్‌పై సాక్షులు, బాధితుల వాంగ్మూలం నమోదు వేగం పుంజు కుంది. ఈ కేసుకు సంబంధించి గత అసెంబ్లీ ఎన్నికల వేళ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వున్న ప్రస్తుత పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహా పలువురు బాధితులు, సాక్షులు ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారి, జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరి ఎదుట తమ వాంగ్మూలం ఇచ్చారు. వీరిలో ముందుగా మహేష్ కుమార్‌గౌడ్ ఉదయం 11 గంటల సమయంలో సిట్ అధికారి ఎదుట విచారణకు హాజరై ఫోన్ ట్యాపింగ్‌పై తనకు ఎదురైన అనుభవాలను, అప్పట్లో తాను పడిన కష్టాలను వివరించారు. దీని తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ సర్కారు హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ చాలా హేయమైన చర్యగా అభివర్ణించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకున్న బిఆర్ఎస్ సర్కారు వందలాది మంది ఫోన్లను చట్ట విరుద్ధంగా ట్యాపింగ్ చేసి తమ కదలికలపై నిరంతరం నిఘా వుంచింద ని ఆయన ఆరోపించారు. ఇందుకుగానూ బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఇతర నేతలు సిగ్గుతో తల వంచుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో రాకుడదని, తమ పార్టీనే శాశ్వతంగా అధికారంలో వుండాలనే కా ంక్షతో బిఆర్ఎస్ ఇంతటి నీచమైన పనికి దిగజారిందని ఆయన విమర్శించారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వేళ కూడా బిఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ చేయ డం వల్ల కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ముఖ్యంగా గత అసెం బ్లీ ఎన్నికల్లో అడ్డదారిన గెలిచేందుకు బిఆర్ఎస్ నాయకులు 2022 నుంచి ఫోన్ ట్యాపింగ్ చేబట్టిందని ఆయన ఆరోపించారు. తమ పార్టీకి చెందిన 650 మంది నాయకుల ఫోన్‌లను నాటి సర్కారు పక్కా వ్యూహంతో ట్యాపింగ్ చేసిందని ఆయన తెలిపారు. ఇందుకోసం అప్పటి సర్కారు నక్సలైట్ల పేరును, మావోయిస్టు సానుభూతిపరుల పేర్లను వాడుకుందని ఆయన వెల్లడిం చారు. విశ్రాంత ఐజి ప్రభాకర్ రావుకు ఎస్ఐబి విభాగం బాధ్యతలు అప్పగించి ఆయన వద్ద అవినీతి అధికారులుగా పేరున్న వారిని నియమించి అడ్డగోలుగా ప్ర తిపక్ష నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేయాలని నాటి సర్కారు ఆదేశించిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అప్పట్లో ఎన్నో ఘోరాలు చేసిన కెసిఆర్, కెటిఆర్ ఇప్పుడు తమ అంత నీతి, నిజాయితీపరులు ప్రపంచంలోనే లేరని డాంబీకాలు పలుకుతున్నారని పిసిసి అధ్యక్షుడు ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల వేళ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, దీనిపై విచారిస్తామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించినట్లుగానే ప్రస్తుతం విచారణ సాగుతోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. నిజాయితీ గల అధికారులు ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ విచారణలో అన్ని విషయాలు వెలుగు చూస్తాయని, ఇందులో దోషులుగా తేలిన వారికి కచ్చితంగా శిక్షలు పడతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి తేడా వుండదని ఆయన తేల్చిచెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌లో వున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన పేర్కొన్నారు. ఆనాటి సర్కారును రక్షించేందుకు అప్పట్లో కొందరు అధికారులు చట్టాన్ని తుంగలోతొక్కి జర్నలిస్టులతో పాటు జడ్జిలు, బ్యూరోక్రాట్ల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేయడం దారుణమని ఆయన తెలిపారు. చివరగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామని తెలియ గా నే ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్కులను, కంప్యూటర్లను, కీలక సమాచారాన్ని ధ్వంసం చేశారని ఆయన ధ్వజమెత్తారు. మహేష్ కుమార్ వెంట రాజ్య సభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల మాజీ జడ్పి చైర్మన్ సరిత, గాలి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మహేష్ కుమార్ గౌడ్ వెళ్లిపోయాక ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి మరికొందరు తమ వాంగ్మూలం ఇచ్చారు.

## ఇరాన్ అణు కార్యక్రమానికి 'నిజమైన ముగింపే' అవసరం

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్య

**వాషింగ్టన్, జూన్ 17:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య దాడులు ఉధృతమైన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాలు కాల్పుల విమరణ ఒప్పందం దిశగా ప్రయత్నాలు చేయాలని గతంలో చెప్పిన ఆయన.. తాజాగా పూర్తి భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణను తాను కోరుకోవడం లేదన్నారు. అయితే, ఇరాన్ అణు సమస్యకు 'నిజమైన ముగింపు' ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కెనడాలో జరుగుతున్న జి-7 శిఖరాగ్ర సమావేశం నుంచి అర్థాంతరంగా అమెరికాకు పయనమైన ట్రంప్.. ఎయిర్‌ఫోర్స్ వన్ (అమెరికా అధ్యక్షుడి విమానం)లో విలేకరులతో మాట్లాడారు. 'ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి కృషి చేస్తానని నేను చెప్పలేదు. దీనికి కచ్చితంగా ఓ నిజమైన ముగింపు ఉండాలి. అణ్వాయుధ కార్యక్రమాన్ని ఇరాన్ పూర్తిగా విరమించుకునేలా ఉండాలి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మిడిల్ ఈస్ట్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న స్టీవ్ విట్‌కాఫ్‌ను గానీ, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌ను గానీ చర్చలకు పంపే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయడం లేదన్న నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ వ్యాఖ్యలను ట్రంప్ కొట్టిపారేశారు. అణ్వాయుధ తయారీకి ఇరాన్ అతి చేరువలో ఉందని చెప్పారు. ఇజ్రాయెల్ తమపై దాడి చేయడానికి పరోక్షంగా అమెరికా సాయం చేస్తోందని ఇరాన్ అనుమానిస్తున్న నేపథ్యంలో.. ఆ దేశానికి ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేశారు. అమెరికాపై దాడులకు దిగితే.. కనీవినీ ఎరుగని రీతిలో ప్రతిదాడులు ఉంటాయని హెచ్చరించారు. అమెరికా జోక్యం లేకుండానే ఇరాన్ అణుకార్యక్రమం నామరూ పాల్లేకుండా పోతుందని భావిస్తున్నట్లు తెలిపారు. అప్పుడే నిజమైన ముగింపు లభిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు.

## రైతు కమిషన్, విత్తన చట్టం ముసాయిదా కమిటీ హర్యానా పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్17:** తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర విత్తన చట్టం రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం వేసిన విత్తన చట్టం ముసాయిదా కమిటీ సభ్యులు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హర్యానా రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి చండీఘడ్ కు బృందం చేరుకుంది. సాయంత్రం 4 గంటలకు హర్యానా రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో పంచకుల నగరంలోని ప్రభుత్వ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కమిటీ సభ్యులు దొంతి నర్సింహ రెడ్డి, రామనుజేయులు, శివప్రసాద్, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ఇక హర్యానా రాష్ట్రం నుండి అక్కడి వ్యవసాయ అధికారులు ప్రదీప్ మీల్, అమిత్ కుమార్ తోపాటు హర్యానా సీడ్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హర్యానా రాష్ట్రంలో అమలవుతున్న విత్తన చట్టంపై సుదీర్ఘంగా చర్చించారు. హర్యానా రాష్ట్రం రూపొందించిన సీడ్ సవరణ బిల్లుకు సంబంధించి అమలు విధానాలు, నిబంధనలు, అనుభవాలను ప్రత్యక్షంగా తెలంగాణ బృందం తెలుసుకుంది. అదేవిదంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న వ్యవసాయ సంక్షేమ పథకాలపై తెలంగాణ ప్రతినిధుల బృందం వివరించింది. సీఎం రేవంత్ రెడ్డి రైతులకోసం ఇప్పటి వరకు చేపట్టిన పథకాల గురించి వివరించారు. ప్రధానంగా ఏకకాలంలో 21 వేల కోట్ల రుణమాఫీ చేయడంతో లక్షలాది మంది రైతులు రుణ విముక్తులయ్యారని తెలిపారు. అలాగే సీజన్‌కు ముందు రైతు భరోసా, సన్నాలకు 500 రూపాయల బోనస్ పథకాలతోపాటు సబ్సీడీ పై వ్యవసాయ యంత్ర పరికరాలు, గిరిజన ప్రాంతంలో పోడు భూముల సాగు కోసం కొత్తగా తీసుకొచ్చిన ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాలు అమలవుతున్నాయని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి వివరించారు. అదేవిదంగా బుధవారం ఉదయం హర్యానా రాష్ట్రంలో పర్యటన కొనసాగనుంది. స్థానికంగా ఉన్న హరిపూర్ బ్లాక్ రాయ్‌పూర్ రాణి గ్రామంలో పర్యటించి అక్కడ అమలవుతున్న విత్తన చట్టం పై హర్యానా రాష్ట్ర రైతుల నుండి అభిప్రాయాలను సేకరించనున్నారు. అలాగే హై పవర్ కమిటీతో తెలంగాణ ప్రతినిధుల బృందం సమావేశం కానుంది. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ సమావేశం రెండు సెషన్ లుగా సాగనుంది.

దేశ వ్యాప్తంగా రైతు సమస్యలపై సుప్రీం కోర్టు గతంలో హై పవర్ కమిటీ వేసింది. ఈ కమిటీ ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అమలవుతున్న వ్యవసాయ విధానాలు, పథకాలు, ప్రధాన పంటలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయా రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణుల నుండి అభిప్రాయాలను సేకరించింది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం లో అమలవుతున్న వ్యవసాయ విధానాలు, ప్రధాన పంటలు, సవాళ్లను హై పవర్ కమిటీ పంచకుల నగరంలో జరిగే సమావేశంలో చర్చించనుంది. ఈ సమావేశానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త రామనుజేయులు, పర్యావరణ వేత్త దొంతి నర్సింహారెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొననున్నారు.

## కేసీఆర్ నాట్లకు నాట్లకు, రేవంత్ ఓట్లకు ఓట్లకు మధ్య రైతు బంధు ఇస్తున్నారు: పెద్ది సుదర్శన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్17:** స్థానిక సంస్థల ఎన్నికలు తప్పనిసరి అయిన పరిస్థితుల్లో ఓట్ల కోసం రైతు భరోసా పేరిట నాటకానికి తెరతీశారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి బజారు రౌడీ కన్నా హీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు భరోసా స్థానిక సంస్థల స్టంట్ మాత్రమేనని అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో పెద్ది సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎలా వచ్చేదో.. ఇప్పుడు ఎలా వస్తుందో.. రైతులు ఆలోచించుకోవాలని సూచించారు. ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతుందని పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే కాంగ్రెస్ నేతలను అడుగడుగునా నిలదీయాలని కోరారు. ఎకరాకు రూ.25 వేల బకాయిలు ఇచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ నేతలను రానివ్వద్దని సూచించారు.


కేసీఆర్ నాట్లకు, నాట్లకు మధ్య రైతుబంధు ఇచ్చే వారని.. రేవంత్ రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇస్తున్నారని విమర్శించారు. సర్పంచుల పాత బిల్లులకు తమకు సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి విడ్డూరంగా మాట్లాడారని అన్నారు. అలా అయితే కేసీఆర్ ప్రాణాన్ని పణంగా పెట్టి తీసుకొచ్చిన తెలంగాణతో, ఆయన కట్టిన సచివాలయంతో రేవంత్ రెడ్డికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ పాలకుడు కాదని అన్నారు.

# బనకచర్లపై తెలంగాణ ఆరోపణలు అవాస్తవం

### అక్కడ అంతర్గత రాజకీయపోరు కోసమే వివాదం చేస్తున్న నాయకులు

**ఎపి జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణలో అంతర్గత రాజకీయ పోరు కోసమే పోలవరం- బనకచర్లపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. నికర జలాల్ని ఈ ప్రాజెక్టు కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ వాడట్లేదనే విషయాన్ని ఎగువ రాష్ట్రాలు గ్రహించాలన్నారు. రాయలసీమ దాహార్తి తీర్చి ఆ ప్రాంత కరవు నివారణ కోసమే వినియోగిస్తున్నట్లు చెప్పారు. సముద్రంలో కలిసే ఉప్పునీటినే వాడుకుంటు న్నామని తెలిపారు. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వాస్తవాలు పేరిట ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరంబనకచర్లకు అభ్యంతరాలు పెడుతున్న వారికి తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులకు నిబంధనలు ఎందుకు వర్తించవో సమాధానం చెప్పాలని నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఎన్నో ప్రాజెక్టులు కేసీఆర్ ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టలేదా అని నిలదీశారు. దిగువ రాష్ట్రమైన ఏపీ ప్రయోజనాలు పట్టించుకోకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా అనేక ప్రాజెక్టులు చేపట్టారని గుర్తు చేశారు. కానీ ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్న బనకచర్లపై అభ్యంతరాలు చెప్తున్నారని నిమ్మల మండిపడ్డారు. చంద్రబాబుకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలు ముఖ్యం. అందుకే అనుమతులు లేకుండా చేపట్టిన తెలంగాణ ప్రాజెక్టులకు అభ్యంతరం చెప్పలేదు. ప్రతీ ఏటా సముద్రంలో కలిసే 3000ల టీఎంసీల గోదావరి నీటిలో 200ల టీఎంసీల నీరు సద్వినియోగం చేసుకోవటం కోసమే పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు. దీనివల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు. పోలవరం




మంగళవారం మీడియా సమావేశంలో పోలవరం- బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వాస్తవాలు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలియాలిఖి అని నిమ్మల పేర్కొన్నారు.'గోదావరి వరదల వల్ల వచ్చే నష్టం దిగువ రాష్ట్రమైన ఏపీ మాత్రమే భరిస్తోంది. వరద నష్టం భరిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు వరద జలాలను సద్వినియోగం చేసుకోవటం సహజన్యాయమైన హక్కు. పోలవరం వల్ల లభ్యమయ్యే వరద జలాలను మాత్రమే బనకచర్లకోసం సద్వినియోగం చేసుకుంటున్నామని ప్రజలు గ్రహించాలి. ఎక్కడా నికరజలాల్ని వాడకుండా వరద జలాల్ని మాత్రమే వాడుకుంటున్నామని అంతా తెలుసుకోవాలని నిమ్మల రామానాయుడు అన్నారు.

**ఆమోదం తెలిపాకే డీపీఆర్ :** ప్రతీ ఏటా సగటున 100 రోజులు గోదావరికి వరద వస్తున్న చరిత్ర ఆధారంగా 200 టీఎంసీల వరద జలాల్ని మాత్రమే తీసుకుంటున్నామని నిమ్మల వివరించారు. ప్రాజెక్టుపై ప్రాథమిక నివేదిక సీడబ్ల్యూసీకి అందచేయటంతోపాటు అన్నీ నిబంధనల ప్రకారమే ప్రాజెక్టు చేపడుతున్నట్లు వెల్లడించారు. సీడబ్ల్యూసీ ప్రాథమిక నివేదికకు ఆమోదం తెలిపాకే డీపీఆర్ రూపొందిస్తామని చెప్పారు.

## రూ.4 వేల కోట్ల రుణం సేకరించిన సర్కార్

### ఈ క్వార్టర్‌లో రూ.17,400 కోట్లకు చేరిక

### ఇండెంట్ కన్నా రూ.5 వేల కోట్లు అదనం

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా రాష్ట్ర సర్కార్ రూ.4 వేల కోట్ల రుణాన్ని సేకరించింది. ఈ మేరకు మంగళవారం రిజర్వ్ బ్యాంకు నేతృత్వంలో బహిరంగ వేలం ద్వారా ఈ మొత్తాన్ని తీసుకుంది. ఇందుకు గాను నాలుగు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. వీటిలో 33 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 34 ఏండ్ల కాలానికి మరో రూ.1,000 కోట్లు, 35 ఏండ్ల కాలానికి ఇంకో రూ.1,000 కోట్లు, 36 ఏండ్ల కాల పరిమితితో మరోసారి రూ.1000 కోట్లకు సెక్యూరిటీ బాండ్లు ఉన్నాయి. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్ నుండి జూన్) రాష్ట్రం రుణాలు దాని ప్రారంభ అంచనాలను అధిగమిస్తున్నాయి. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.14,000 కోట్ల రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం గతంలో ప్రతిపాదించింది. అయితే ఇప్పుడు వాటి మొత్తం రూ.17,400 కోట్లకు చేరుతోంది. ఇది మొదట్లో రిజర్వ్ బ్యాంకు ఇచ్చిన ఇండెంట్ కంటే రూ.3,400 కోట్లు ఎక్కువ. ఏప్రిల్, మే నెలలకు మార్కెట్ రుణాలు వరుసగా రూ.4 వేల కోట్లు, రూ.5 వేల కోట్లుగా ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే, రైతు భరోసా పథకం మరియు ఇతర ఖర్చుల డిమాండ్లను తీర్చడానికి ఈ నెలలో ప్రభుత్వం అదనపు నిధులను సేకరించాల్సి వచ్చింది. ప్రస్తుత వనకాలంలో రైతు భరోసాతో పాటు, యాసంగి బకాయిలతో దాదాపు రూ. 9,000 కోట్లు అవసరం ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో ఇక రాబోయే రెండు వారాల్లో మరో రూ.2 వేలు, రూ.3 వేల కోట్లు రుణం తీసుకునే అవకాశం ఉన్నట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక రుణాలు అంచనా వేసిన దానికంటే కనీసం రూ.5,400 కోట్లకు పెరుగుతాయని వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాలు రూ.64,539 కోట్లుగా వార్షిక బడ్జెట్‌లో అంచనా వేయబడింది. అయితే, ప్రస్తుత సర్కార్ రుణాల వేగం ఇలాగే కొనసాగితే, గత ఆర్థిక సంవత్సరంలో చేసినట్లుగానే బడ్జెట్ అంచనాల పరిమితిని అధిగమించే వీలుందని అధికరవర్గాలు లెక్క వేస్తున్నాయి.

## సమన్వయంతో సరఫరా, పంపిణి వ్యవస్థల పటిష్ఠం

### ఇంధన శాఖ నూతన ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** విద్యుత్‌కు డిమాండ్ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో పటిష్టమైన సరఫరా, పంపిణి వ్యవస్థలను పటిష్ఠం చేయాలని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. ఇందుకు విద్యుత్ సంస్థలు అన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. హైదరాబాద్‌లో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా నూతనంగా భాద్యతలు స్వీకరించిన ఆయన విద్యుత్ సంస్థల సీఎండీ లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ, పరిశ్రమల విస్తరణ మూలంగా విద్యుత్ డిమాండ్ భారీ స్థాయిలో పెరుగుతుందని చెప్పారు.

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధి ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉండటంతో ఇక్కడ వార్షిక విద్యుత్ డిమాండ్ మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. ఇందుకు అనుగుణంగా ప్రస్తుత వానా కాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అంతకు ముందు విద్యుత్ సౌధలోని తెలంగాణ ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్‌తో చర్చించారు. అనంతరం మింట్ కాంపౌండ్ లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ ప్రధాన కార్యాలయంలో సిఎండి ముషారఫ్ ఫరూఖీతో సమీక్షించి, డేటా సెంటర్, ఇతర విభాగాలను పరిశీలిం చారు. ఈ సందర్భముగా సిఎండిలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రాష్ట్రం లోని విద్యుత్ సరఫరా పంపిణి వ్యవస్థ గురించి వివరించారు. రాష్ట్రం లో డిమాండ్ ఏడాదికి ఆ ఏడాది సగటున 10 శాతం వృద్ధి నమోదు చేస్తున్న దన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో డిమాండ్ 15 నుండి 20 శాతం వరకు నమోదవుతున్నదని వివరించారు.

ఈ ఏడాది రాష్ట్రంలో 17162 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదయిందన్నారు. దక్షిణ డిస్కం లో 2023 తో పోలిస్తే 2024 లో గరిష్ట డిమాండ్ 5.36 పెరగగా, గతేడాదికి ఈ ఏడాదికి డిమాండ్ 11.71శాతం వృది నమోదయ్యిందని వివరించారు.

## తండ్రి ప్రస్థానాన్ని ప్రతిబింబించే చిత్రం పా పా హాయ్ న్నా

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ఫాదర్స్ డే సందర్భంగా, తండ్రి అందించే శక్తిని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో చూపే చిత్తశుద్ధిని హృదయానికి హత్తుకునే విధంగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) లైఫ్ ఇన్సూరెన్స్ డిజిటల్ ప్రాపర్టీ కింత పా పా హాయ్ న్నా అనే డిజిటల్ వీడియో కాసెట్‌ని (డీవీసీ) రూపొందించింది. నిత్యం పలు రకాల పాత్రలను పోషిస్తున్నా, తమ ప్రియమైన వారికి ఇచ్చిన హామీలను ఎన్నడూ మర్చిపోని నాన్నలకు ఇది అంకితమని ఎస్‌బీఐ లైఫ్ చీఫ్ ఆఫ్ బ్రాండ్, కార్పొరేట్ కమ్యూనికేషన్ అండ్ సీఎస్ఆర్ రవీంద్రశర్మ వెల్లడించారు. మంగళవారం డీవీసీ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్యాయత, క్రమశిక్షణ,ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే స్వభావం గల నాన్నల జీవితంలోని క్షణాలను ఇది ఆవిష్కరిస్తుందన్నారు. ఒక హాకీ కోచ్, ఒక ఫారెస్ట్ ఆఫీసర్, ఒక ఆర్కిటెక్ట్ ఇలా ముగ్గురు నాన్నల వృత్తిగత ప్రపంచాలను ఆవిష్కరించడంతో డీవీసీ మొదలవుతుందని వివరించారు. వారు తమ తమరంగాల్లో ఆత్మవిశ్వాసంతో రాణిస్తుంటారు. ఇంటికి వచ్చేసరికి పిల్లలను ఊయలూపుతూ, బొమ్మలతో ఆడిస్తూ ఆప్యాయ తతో వ్యవహరిస్తారు. ఇలా ఈ వైరుధ్యమనేది చాలా చిన్నదే అయినప్పటికీ చాలా శక్తివంతమైనదన్నారు.అధికారంతో ఆదేశాలిచ్చే తండ్రులు అంతే ప్రేమగా లాలిస్తారు కూడా. మొక్కవోని నిబద్ధతతో వారు ఏ విధంగా, సునాయాసంగా వివిధ పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేస్తారనేది ఈ చిత్రం తెలియజేస్తుందని చెప్పారు.

## రాజీవ్ యువ వికాసానికి బ్రేక్

### స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే లబ్దిదారుల ఎంపిక

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** నిరుద్యోగ యువ తకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి ఆర్థి కంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ పథకానికి ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాల నుండి భారీ స్పందన రావడంతో ధరకాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. అయితే లక్ష్యానికి అనుగుణంగా దరకాస్తులను ఎంపిక చేసినట్లయితే మిగిలిన వారిలో ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఏర్పడుతుందని, ఫలితంగా స్థానిక సంస్థల ఎన్నికలో దీనిన ప్రభావం తీవ్రంగా చూపుతుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం యువ వికాసంలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించినట్లు అధికవర్గాల ద్వారా తెలియవచ్చింది. మరోపక్క ఈ పదజకం కోసం రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే, అందులో 15.53 లక్షల దరఖాస్తులు వెరిఫై అయ్యాయి. అయితే, వీటిలో 6.6 లక్షల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని సంక్షేమ శాఖల అధికారులు చెబుతున్నారు. ఈ స్కీమ్‌ను ఈ నెల 2నే తొలి దశ కింద రూ.లక్షలోపు యూనిట్లను మంజూరు చేయాలనుకున్నప్పటికీ అది వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ స్కీమ్‌కు భారీగా దరఖాస్తులు వచ్చాయి. బీసీలకు సంబంధించి లక్ష్యం 1.55 లక్షల యూనిట్లు కాగా, దరఖాస్తులు మాత్రం 8.01 లక్షలు వచ్చాయి. అలాగే ఎస్సీలకు సంబంధించిన 1.44 లక్షల యూనిట్లకు 3.92 లక్షలు, ఎస్టీలకు 91 వేల యూనిట్లుకు గాను 1.83 లక్షలు, ఈబీసీలకు 51 వేల యూనిట్లకు 37 వేలు, క్రైస్తవులకు సంబంధించిన లక్ష్యం 5 వేల యూనిట్లకు గాను దరఖాస్తులు 4,604 వచ్చాయి. మొత్తం 5 లక్షల లబ్ధిదారులను ఎంపిక చేయాలని లక్ష్యంతో పాటు, యూనిట్ విలువ తగ్గించుకోవాలని చెప్పినా స్పందన రాలేదు. దీంతో సర్కార్ ఈ ప్రక్రియను ఎన్నికల అనంతం చేపట్టాలని నిర్ణయించినట్లు అధికవర్గాలు వెల్లడించాయి.

# ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై 'ఆర్‌టి76'


మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో తన కొత్త చిత్రం ఆర్‌టి76తో మరోసారి తన సిగ్నేచర్ ఎనర్జీతో అలరించబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇటీవల పూజా వేడుకతో ప్రారంభమైయింది. ప్రేక్షకులను ఆకట్టుకునే హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో చిత్రాలను అందించే ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఆర్‌టి76 హ్యూమర్, ఎమోషన్స్‌తో కూడిన హోల్సమ్ ఎంటర్ టైనర్‌గా వుండబోతోంది. ఈ చిత్రం అఫీషియల్‌గా సెట్స్‌పైకి వెళ్ళింది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో షూటింగ్ జరుగుతోంది. రవితేజ, ఇతర ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు కిషోర్ తిరుమల, రవితేజ ట్రేడ్ మార్క్ కామిక్ టైమింగ్, మాస్ అప్పీల్‌తో కూడిన ఫుల్ లెంత్ ఫ్యామిలీ డ్రామాని రాశారు. రవితేజ ఈ సినిమా కోసం చాలా స్టైలిష్‌గా మేకోవర్ అయ్యారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. ధమాకా చిత్రానికి బ్లాక్‌బస్టర్ సంగీతం అందించిన భీమ్స్ సిసిరోలియో మరో బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కోసం రవితేజతో కలిసి పని చేస్తు న్నారు. ప్రసాద్ మురెళ్ల సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, నేషనల్ అవార్డ్ విన్నింగ్ టెక్నీషియన్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. ఆర్‌టి76 2026 సంక్రాంతి సందర్భంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తారాగణం: రవితేజ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్ తిరుమల, నిర్మాత: సుధాకర్ చెరుకూరి, బ్యానర్: ఎస్ఎల్వి సినిమాస్, డిఓపి: ప్రసాద్ మురెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్.




# 'కన్నప్ప' వీక్షించడం ఆనందంగా ఉంది: మోహన్ బాబు

దిగ్గజ నటులు రజనీకాంత్, డాక్టర్ ఎం. మోహన్ బాబు కలిసి నటించిన పెద రాయుడు చిత్రానికి ముప్పై ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా చెన్నైలో వీరిద్దరూ కలుసుకుని నాటి జ్ఞాపకాల్ని నెమరవేసుకున్నారు. జూన్ 15, 1995న విడుదలైన ఈ చిత్రం తెలుగు సినిమా చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుంది. సినిమా విడుదలై ముప్పై ఏళ్లు అవుతున్న సందర్భంగా ఇలా చెన్నైలో రజనీకాంత్, మోహన్ బాబు సందడి చేశారు. ఈ క్రమంలోనే సూపర్ స్టార్ రజనీకాంత్ కన్నప్ప సినిమాను ప్రత్యేకంగా వీక్షించారు. కన్నప్ప చిత్రాన్ని వీక్షించిన రజనీకాంత్ తన అభిప్రాయాల్ని పంచుకున్నారు. సినిమా అద్భుతంగా ఉందని విష్ణుని కొనియాడారు. ఈ మేరకు విష్ణు మంచు సోషల్ మీడియాలో తన ఆనందాన్ని పంచుకున్నారు. కన్నప్ప చిత్రాన్ని రజనీకాంత్ ప్రత్యేకంగా వీక్షించారు. సినిమాను చూసిన తరువాత నన్ను గట్టిగా హత్తుకున్నారు. కన్నప్ప ఎంతో నచ్చిందని ఆయన అన్నారు. ఈ క్షణం కోసం నేను గత 22 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. నా నటనను ఆయన ఎప్పుడు మెచ్చుకుంటారు.. ఇలా ఎప్పుడు హత్తుకుంటారు అని అనుకుంటూ ఉన్నాను.. ఆ కల ఇప్పుడు నెరవేరింది. నాకు ఈ రోజు ఎంతో ఆనందంగా, సంతోషంగా, గర్వంగా ఉంది అని అన్నారు. డా.ఎం.మోహన్ బాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ.. జూన్ 15కి పెదరాయుడు రిలీజ్ అయి 30ఏళ్లు పూర్తయ్యాయి. అదేరోజు నా ప్రియ మిత్రుడు రజనీ కాంత్ కన్నప్ప చిత్రాన్ని వీక్షించారు.






# 'సయారా' కొత్త పాటతో ప్రమోషన్‌లో మోహిత్ సూరి

యష్ రాజ్ ఫిల్మ్స్, మోహిత్ సూరి కాంబోలో రూపొందుతున్న సయారా బెస్ట్ మ్యూజికల్ ఆల్బమ్‌గా మారుతోంది. చార్ట్‌బస్టర్ సయారా టైటిల్ ట్రాక్ తర్వాత జుబిన్ నౌటియాల్ పాడిన బర్బాద్ కూడా బ్లాక్ బస్టర్ అయింది. ఇక ఇప్పుడు మూడవ పాటను రిలీజ్ చేశారు. ఇండియన్ సెన్సేషనల్ సింగర్ విశాల్ మిశ్రా ఈ థర్డ్ సింగిల్ తుమ్ హో తోని ఆలపించారు. ఈ పెప్పీ లవ్ ట్రాక్‌ను మేకర్స్ మంగళవారం జూన్ 17నాడు విడుదల చేశారు! ఈ మూడో పాట రిలీజ్ సందర్భంగా మోహిత్ సూరి మాట్లాడుతూ, 12 సంవత్సరాల క్రితం విశాల్ నన్ను కలవడానికి వచ్చినప్పటి నుండి నేను, తను కలిసి ఓ ప్రత్యేకమైన సినిమా కోసం పని చేయాలని అనుకున్నాము. మేము సరైన క్షణం కోసం వేచి చూస్తున్నాం. చివరకు అది సయారాతో నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉంది. నా పాటలే అతన్ని సంగీత ప్రపంచంలోకి తీసుకు వచ్చాయని, అవే స్ఫూర్తి నింపాయని విశాల్ చెప్పడం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. మన పని ఎవరిపైన అయినా ఇలాంటి ప్రభావాన్ని చూపుతుందని తెలుసుకున్నప్పుడు అదొక గొప్ప అనుభూతిని ఇస్తుంది. సంగీతానికి ప్రజల హృదయాలను తాకే సామర్థ్యం ఉందని, అది చాలా స్వచ్ఛమైన మాధ్యమమని నేను ఎప్పుడూ భావించాను. కాబట్టి నా 20 సంవత్సరాల దర్శకత్వం, సంగీత సృష్టిలో నా పాటల ద్వారా ప్రజలకు ఎన్నో జ్ఞాపకాలను సృష్టించినందుకు నాకు నేనే కృతజ్ఞుడిగా భావిస్తుంటాను. నా కెరీర్‌లో నేను కలిసిన అత్యంత ప్రతిభావంతులైన కళాకారులలో విశాల్ మిశ్రా ఒకరు. సయారా మ్యూజిక్ ఆల్బమ్‌లో ఆయన పాట పాడటం నా అదృష్టం. 12 సంవత్సరాలుగా నన్ను కలుస్తూనే ఉన్నప్పటి నుండి విశాల్ నాకు ఇచ్చిన గీతాలు ఇప్పటికీ నా దగ్గర ఉన్నాయి. అవన్నీ అద్భుతాలే. విశాల్ గురించి, అతని టాలెంట్ గురించి, అతని ఎదుగుదల గురించి తెలుసుకోవడం నాకు ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. తుమ్ హోతో పాటతో మరోసారి అద్భుతాన్ని క్రియేట్ చేశారు. సయారా సినిమా నుండి మూడవ పాటతో అతని ప్రతిభను బయటపెట్టడానికి మేం ఎంతో ఎదురుచూశాం. అతని సంగీతాన్ని ఇష్టపడే వారు, అతని అత్యుత్తమ రొమాంటిక్ పాటను విని ఎంతో థ్రిల్ అవుతారు. విశాల్ సంగీతాన్ని ఇష్టపడే వారు తుమ్ హోతో పాటతో ప్రేమలో పడతారు అని అన్నారు. సయారా టీజర్‌కు అన్ని వైపుల నుంచి ప్రశంసలు వచ్చాయి. సయ్యారా టైటిల్ కూడా ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. దీని అర్థం సంచరించే నక్షత్రం. ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ, ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేస్తూ ఉంటుంది. కానీ ఎప్పుడూ ఎవ్వరికీ అందదు. కేవలం వర్ణించడానికి ఉపయోగిస్తారు. ఈ చిత్రం ద్వారా అహాన్ పాండేను హిందీ చిత్ర పరిశ్రమకు హీరోగా పరిచయం చేస్తున్నారు. అనీత్ పద్దా ఈ చిత్రంలో కథానాయికగా నటించారు. సయారాను అక్షయ్ విధాని నిర్మించారు. జూలై 18, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. వైఆర్ఎఫ్ గత 50 సంవత్సరాల సినీ చరిత్రలో భారతదేశానికి అన్ని కాలాలలోనూ కల్ట్ రొమాంటిక్ చిత్రాలను అందించింది.



# రానా నాయుడు, కట్టప్ప కలిస్తే.. ఇక సోషల్ మీడియా బద్దలే..

ఎవ్వరూ ఊహించని ఓ క్రేజీ కాంబినేషన్‌ను నెట్ ఫ్లిక్స్ తీసుకురాబోతోంది. ఒక మైండ్‌బెండింగ్ క్రాస్‌ఓవర్‌ను నెట్ ఫ్లిక్స్ తాజాగా విడుదల చేసింది. ఎలాంటి సమస్యనైనా ఫిక్స్ చేసే ఓజీ ఫిక్స్ రానా నాయుడు, కట్టప్పని కలవబోతోన్నారు. తీవ్రమైన ముఖాము చర్చలు, కొన్ని ఆవేశపూరిత పరిహాసాలు చూడబోతోన్నాం. గతం వర్తమానాన్ని కలవబోతోంది.



రానా నాయుడు సీజన్ 2కి ముందు ఈ ప్రత్యేక వీడియోని నెట్ ఫ్లిక్స్‌లో చూడండి. ఎందుకంటే రానా ఒక్కసారి దారి తప్పినా, హద్దుల్ని దాటినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# 28న 'హనుమాన్ జంక్షన్' రీ రిలీజ్

2001లో విడుదలైన హనుమాన్ జంక్షన్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సాధించింది. యాక్షన్ అద్భుతమైన హ్యూమర్ మేళవించిన ఈ సినిమాలో అర్జున్, జగపతి బాబు, వేణు ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రముఖ దర్శకుడు మోహన్ రాజా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆయన తరువాత తమిళ జయం, తనీ ఒరువన్, గాడ్‌ఫాదర్ వంటి సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించారు. లయ, స్నేహ, విజయలక్ష్మి కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో బ్రహ్మానందం, కోవై సరళ, అలీ, ఎల్.బి. శ్రీరామ్, ఎం.ఎస్. నారాయణ, వేణు మాధవ్ వంటి ప్రముఖులు హాస్య పాత్రలతో ప్రేక్షకులను అలరించారు. ఎడిటర్ మోహన్ స్థాపించిన ఎం.ఎల్. మూవీ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎం.వి.లక్ష్మి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఎంగేజింగ్ స్క్రీన్‌ప్లే, ఆకట్టుకునే సంభాషణలు, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు కల్ట్ స్టేటస్‌ను తీసుకువచ్చాయి. ఇప్పుడీ ఎవర్ గ్రీన్ ఎంటర్‌టైనర్ మళ్లీ ప్రేక్షకులను థియేటర్లో అలరించబోతోంది. హనుమాన్ జంక్షన్‌ను జూన్ 28న మళ్లీ థియేటర్లలో విడుదల చేయనున్నట్టు చిత్రబృందం అనౌన్స్ చేసింది. ఈ తరహా సినిమాలు ఎప్పుడు వచ్చినా హిట్ అవుతాయి. పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్స్ కొరవడుతున్న సమయంలో, హనుమాన్ జంక్షన్ మళ్లీ తన మ్యాజిక్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయబోతోంది. ఈ చిత్రానికి సి. రామ్‌ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందించారు.




# జులై 11 'ఓ భామ అయ్యో రామ'

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఓ భామ అయ్యో రామ. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి స్పిరిట్‌మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు, పాటలకు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రాన్ని జూలై11న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, ఇదొక బ్యూటిఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్. అన్ని వర్గాలకు కావాలసిన అంశాలు ఇందులో ఉంటాయి. ముఖ్యంగా ఈ చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్ అందర్ని అలరిస్తుంది. ఇదొక క్యూట్ అండ్ ఎంటర్‌టైనింగ్ లవ్‌స్టోరీలా సినిమాలోని ప్రతి ఫేమ్ కలర్‌ఫుల్‌గా ఉంది. సుహాస్ ఎంతో ఎనర్జీ ఈ సినిమాకు బిగ్గెస్ట్ ప్లస్. రామ్‌గా సుహాస్, సత్య భామగా మాళవిక మనోజ్‌లు ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతారు. హీరోయిన్ మాళవిక, హీరో సుహాస్ మధ్య వచ్చే సన్నివేశాలు ఎంతో వినోదాన్ని పంచుతాయి. ఖర్చు విషయంలో నిర్మాత ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించాడు. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు అన్నారు. నిర్మాత మాట్లాడుతూ సాధారణంగా లవ్ రొమాంటిక్ కామెడీ సినిమాలను అందరం ఇష్టపడుతుంటాము. ఇప్పుడు అదే తరహాలో సుహాస్ హీరోగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ఓ భామ అయ్యో రామ. అందరిని నవ్వించే వినోదమైన యువకుడి చుట్టూ తిరిగే ఓ కథగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఖర్చు విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించాం. తప్పకుండా ఈ చిత్రం సుహాస్ కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది. జూలై 11న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు థియేటర్‌లో ఎంజాయ్ చేస్తారు అన్నారు. నటీనటులు: సుహాస్, మాళవిక మనోజ్, అనిత హసానందిని.



# ఆ హీరో అంటే నాకిష్టం: హీరోయిన్ స్నేహ

సాధారణ ప్రేక్షకులకే కాదు, సినిమాల్లో నటించే హీరోలకీ, హీరోయిన్లకు కూడా అభిమాన నటీనటులుంటారు. అయితే కొంతమంది తమ అభిమాన నటీనటుల గురించి బయటకు చెప్తే మరికొందరు మాత్రం తమ యిష్టాయిష్టాలను మనసులోనే దాచుకుని అభిమానిస్తుంటారు. సౌత్ హీరోయిన్ స్నేహ తాజాగా తనకు ఇష్టమైన హీరో గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేసి ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న స్నేహను అందరూ చాలా ఇష్టపడతారు. పక్కింటి అమ్మాయి లా కనిపించే స్నేహ ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తొలి వలపు సినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయ మైన స్నేహ ఆ తర్వాత ప్రియమైన నీకు సినిమాతో సూపర్ హిట్‌ను ఖాతాలో వేసుకుంది.ఆ తర్వాత హీరోయిన్‌గా స్నేహ వరుస సినిమాలు చేసింది. అందంతో పాటూ మంచి అభినయంతో ఎంతో మందిని ఆకట్టుకున్న స్నేహ ఈ మధ్య సపోర్టింగ్ రోల్స్‌లో కనిపిస్తోంది. మొన్నా మధ్య అల్లు అర్జున్ హీరోగా వచ్చిన సన్నాఫ్ సత్యమూర్తి సినిమాలో ఉపేంద్ర భార్యగా కనిపించగా, ఆ తర్వాత వినయ విధేయ రామలో రామ్ చరణ్‌కు వదిన పాత్రలో మెరిసింది. రీసెంట్‌గా డ్రాగన్ సినిమాలో డాక్టర్ పాత్రలో కూడా స్నేహ మెరిసింది. రీసెంట్‌గా గోట్ సినిమాలో విజయ్‌కు భార్యగా నటించి ఆకట్టుకున్న స్నేహ తమిళంలో చాలా మంది స్టార్ హీరోలతో కలిసి వర్క్ చేయగా, వారందరిలో తనకు అజిత్ అంటే ఇష్టమని తెలిపింది. విజయ్, కమల్, సూర్య, అజిత్,ప్రశాంత్, ధనుష్‌తో కలిసి నటించిన స్నేహకు మీ ఫేవరెట్ హీరో ఎవరనే ప్రశ్న రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో ఎదురవగా తనకు అజిత్ అంటే ఇష్టమని చెప్పింది. ప్రస్తుతం సినిమాల ఎంపిక విషయంలోజాగ్రత్తగా ఉంటున్న స్నేహ ఎంతో ఆచి తూచి వ్యవహరిస్తుంది.



# '8 వసంతాలు' ట్రైలర్ రిలీజ్

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 8 వసంతాలు ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్ సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది. గ్లింప్స్, టీజర్లు, పాటలు స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేశాయి. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఆడవాళ్లు నిప్పు పట్టకూడదు. అంత్య క్రియలకి కర్మకాండలకు వాళ్లు పనికిరారు అంటూ ఓ క్యారెక్టర్ చెప్పిన మాట లకు పేగు పంచి ప్రాణం పొయ్య గలిగిన వాళ్ళం.. చితిముట్టించి మోక్షం ఇప్పించలేమా అంటూ అనంతిక బదులు చెప్పిన సన్నివేశంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం కట్టిపడేసింది. ఇది కేవలం ఒక మహిళ ప్రయాణం కాదు, సమాజంలో చెరపాల్సిన మూఢ నమ్మకాలకు ఎదురు నిలిచే కథని ట్రైలర్ చూస్తే అర్థమౌతోంది. తండ్రి చేతే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతూ, ఆనందం, ప్రేమ, విషాదం లాంటి అను భూతులతో అనంతిక ప్రయాణం సాగుతుంది. ప్రతి వసంతం ఒక కీలక మలుపు. ఆమె ఒక కుమార్తెగా మొదలై, కొన్ని విధా నాలను ఎదిరించే ధైర్యవంతురాలిగా మారడాన్ని ట్రైలర్ అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. అనంతికా సనీల్‌కుమార్ తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు. ఆమెక్యారెక్టర్‌లో ఎమోషన్స్‌ని చాలా చక్కగా ప్రజెంట్ చేశారు. ఒక మటన్ షాప్‌లో జరిగే యాక్షన్ సీన్ ఆమె ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుంది. హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల ముఖ్య పాత్రలలో ఆకట్టుకున్నారు. వీరి పాత్రలు కూడా కథకు అర్థవంతమైన బలాన్నిస్తాయి. లోతైన కథలు చెప్పడంలో పాపులరైన దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి కథనాన్ని కవిత్వం లాగా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫీ ప్రతి భావోద్వేగాన్ని అద్భుతంగా క్యాప్చర్ చేస్తుంది. హెషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం మనసుని తాకేలా వుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు అత్యుత్తమంగా వున్నాయి. ఆర్ట్ డైరెక్షన్ అరవింద్ ములే, ఎడిటింగ్ శశాంక్ మాలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బాబాసాయి కుమార్ మామిడిపల్లి. బోల్డ్ కథనం, అద్భుతమైన విజువల్స్, మరపురాని పెర్ఫార్మెన్స్‌లతో 8 వసంతాలు భావోద్వేగాలతో నిండిన సినిమాటిక్ అనుభూతిని ఇవ్వనుంది.



# 'డబుల్ చిన్'కు చెక్

అందం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. కొన్ని చిన్న చిన్న సమస్యలు ముఖాకృతిని దెబ్బతీస్తుంటాయి. డబుల్ చిన్ కూడా అలాంటిదే! గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం వల్ల అదనపు లేయర్‌లా కనిపిస్తుంటుంది. ఈ సమస్యతో నలుగురిలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతుంటారు కొందరమ్మాయిలు. అయితే కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తూ డబుల్ చిన్‌ను సులభంగా తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం..



**ఎందుకిలా?...** డబుల్‌చిన్ రావడానికి ముఖ్యంగా 3 కారణాలున్నాయని చెబుతున్నారు నిపుణులు.

- అధిక బరువు-ఆకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం వల్ల ఈ సమస్య వస్తుంది. బరువు పెరిగినప్పుడు గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం, తగ్గినప్పుడు అక్కడి చర్మం వదులుగా మారడమే ఇందుకు కారణం.
- వంశపారంపర్యంగా డబుల్ చిన్ రావడానికి జన్యుపరమైన కారణాలూ ఉన్నాయంటున్నారు నిపుణులు.
- వయసు పైబడడం-వయసు పెరుగుతున్న కొద్దీ ముఖ కండరాలు దృఢత్వాన్ని కోల్పోవడం, తద్వారా గడ్డం కింద కొవ్వు పేరుకుపోవడం, అక్కడి చర్మం వదులువడం వల్ల కూడా డబుల్ చిన్ వస్తుందట!

**ఇంటి చిట్కాలతో ఉపశమనం!..**



**బాగా నమలండి..!:** డబుల్ చిన్ సమస్యతో బాధపడే వారు ఆహారాన్ని బాగా నమిలి మింగాలి. ఇలా చేయడం వల్ల ముఖ కండరాలకు వ్యాయామం అంది పటిష్టంగా తయారవుతాయి. దీనివల్ల అదనపు కొవ్వులు పేరుకుపోకుండా చక్కటి ముఖాకృతిని సొంతం చేసుకోవచ్చు. అలాగే మార్కెట్లో లభించే షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్స్ నమలడం కూడా మంచిదే తద్వారా దవడల దగ్గర పేరుకున్న కొవ్వు సులభంగా కరుగుతుంది.

**తెల్లసొనతో..** రెండు గుడ్లలోని తెల్లసొన, ఒక టేబుల్‌స్పూన్ పాలు, కొద్దిగా తేనె-నిమ్మరసం.. ఇవన్నీ బాగా కలిపి ఈ మిశ్రాన్ని డబుల్ చిన్ ఉన్న చోట ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. అలా 30 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తెల్లసొన చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది. ఇలా తరచూ చేయడం వల్ల డబుల్ చిన్ క్రమంగా తగ్గు ముఖం పడుతుంది. గుడ్డు వాసన నచ్చని వారు ఈ మిశ్రమంలో కొన్ని చుక్కల ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కూడా కలుపుకోవచ్చు.

**గ్రీన్ టీ.....** గ్రీన్ టీ శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తుంది. చెడు కొవ్వును కరిగిస్తుంది. కాబట్టి కాఫీ, టీలకు బదులుగా గ్రీన్ టీని డైట్‌లో చేర్చుకుంటే డబుల్ చిన్‌ను క్రమంగా తగ్గించుకోవచ్చు.

**విటమిన్ 'ఇ'....** మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ 'ఇ' ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. బ్రౌన్ రైస్, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, స్వీట్ కార్న్, యాపిల్, సోయా బీన్స్, పప్పు దినుసులు.. ఇలాంటి వాటిల్లో విటమిన్ 'ఇ' ఎక్కువగా లభిస్తుంది. కాబట్టి వీటిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

**నీళ్లు ఎక్కువగా ...** రోజుకు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఉండే కొవ్వుతో పాటు దావడ, గడ్డం కింద పేరుకున్న అనవసర కొవ్వులు కూడా కరిగిపోతాయి. అలాగే నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు కూడా ఆహారంలో చేర్చుకోవాలి.

**ఈ వ్యాయామాలతో...** • ఎక్కువగా నవ్వడం, మాట్లాడటం వల్ల కూడా ముఖ కండరాలకు చక్కని వ్యాయామం అందుతుంది. తద్వారా డబుల్‌చిన్‌నూ తగ్గించుకోవచ్చు.

• మెడ గుండ్రంగా, నెమ్మదిగా కొద్ది సమయం పాటు తిప్పడం, పైకి-కిందకు కదిలించడం.. వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుంది. • అలాగే క్యాలరీలు, కొవ్వులు లేని ఆహార పదార్థాల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. □

# మహిళలు అనారోగ్యం బారిన పడొద్దని ..

హుషారైన పాటొస్తే... డ్యాన్స్ పరిచయం లేనివారు శరీరాన్ని కదుపుతారు. ఆరోగ్యం కోసం వినియోగిస్తే ఎలా ఉంటుంది అని ఆలోచించారు ఆర్ఎం అంజన. 'తాండవ్' పేరుతో బాలికలు, మహిళలకు ప్రత్యేక తరగతులు ఉన్నారు. ప్రముఖ డయాబీటాలజిస్ట్, మద్రాస్ డయాబిటీస్ రిసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్) అధ్యక్షులురాలీమె. డ్యాన్స్‌వైపు ఎందుకు వెళ్లారో మనతో పంచుకున్నారిలా...



దేశంలో 3 శాతం మందే వ్యాయామాలు చేస్తున్నారంటూ దేశంలో ఐసీఎంఆర్ పరిశోధన. అది చదవగానే మిగిలినవారి పరిస్థితేంటి? వారి ఆరోగ్యాలేం కావాలి? వీళ్లలో మార్పు తెచ్చేదెలా.... లాంటి ప్రశ్నలెన్నో నాలో మెదిలాయి. మార్పు తేవడానికి ఏం చేయాలన్న నా తపన నుంచి వచ్చిందే 'తాండవ్ ప్రాజెక్టు'. అమ్మాయిలు, మహిళలు అనారోగ్యం బారిన పడొద్దని దీన్ని డిజైన్ చేశాం. ఇది కేవలం పది నిమిషాల కాన్సెప్ట్ వారంలో మూడు రోజులు 10 నిమిషాల చొప్పున డ్యాన్స్ చేయిస్తాం. ఇందులో ఆంగ్లం, హిందీ, తెలుగు, పంజాబీ, తమిళం... ఇలా అనేక భాషల్లో పాపులర్ అయిన 4 పాటలకి నృత్యం చేయిస్తాం. తొలి రెండు నిమిషాలూ హాయ్ ఇంటెన్సిటీ వేస్తాం. తరవాత కాస్త నెమ్మదైనది... ఇలా ఒక్కో పాట ఒక్కోలా ఉంటుంది. ప్రతి రెండు నిమిషాలకూ 30 సెకన్ల విరామం ఉంటుంది. వారంలో కేటాయించేది 30 నిమిషాల్లో కానీ ఆరు గంటలు వ్యాయామం చేయగల సామర్థ్యం పొందుతారు. ప్రత్యేకంగా కొరియోగ్రాఫర్లనీ నియమించుకున్నాం. నెలలో అరగంట అదనపు కార్యక్రమమూ ఉంటుంది. దీనితో ఎన్నో సానుకూల మార్పులను గమనించాం. పైగా చాలామంది జంక్ఫుడ్కి దూరమయ్యారు. ఇదంతా ఉచితమే.

**ఆలోచన వెనక ..**

పదేళ్ల క్రితం... నృత్యం ద్వారా ఫిటినెస్ పెంచుకోవచ్చనే ఒక వీడియో చూశా. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి నృత్యంతో సాంత్వన కలిగిద్దామని ఎంతో రిసెర్చ్ చేశా. అదే 'తాండవ్' ఆలోచన తెచ్చింది. ముందు ఆడ, మగవారిని కలిపి ట్రయల్ చేశా. కానీ చాలామంది. మహిళలు 'వ్యాయామాలు చేయడానికి మా సంస్కృతి, సంప్రదాయాలు ఒప్పుకుంటారు. బయటికి, తరవాత మైదానాలకెళ్లేందుకు ఇంట్లోవారు అంగీకరించారు. మగవాళ్ల ముందు డ్యాన్స్ చేయలేం' అన్నారు. వారి పరిస్థితి అర్థమయ్యాక కేవలం మహిళలు, ఆడపిల్లల కోసమే ప్రాజెక్టు తీసుకుని నేను, నా సహ పరిశోధకురాలు డాక్టర్ రంజనీ హరీష్ కలిసి 'తాండవ్' ప్రోగ్రామ్‌ను డిజైన్ చేశాం. దానికి జోడించాం. రంజనీ ఎండీఆర్ఎఫ్ డిజిటల్ అండ్ ప్రివెంటివ్ రిసర్చ్ హెడ్, ముందు మా ఇద్దరిపైనే ప్రయోగం చేసుకున్నాం. తరవాత బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ ఆసుపత్రిలో శాస్త్రీయంగా పరిశోధన చేశాం. సైడ్‌ఫెక్ట్స్ లేకుండా శారీరక, మానసిక ఆరోగ్యాలు మెరుగవ్వడం, విద్యార్థులపైనా పరిశోధన చేశాం. ఇక్కడా మెరుగైన ఫలితాలొచ్చాక 2018 నుంచి తాండవ్ అందుబాటులోకి తెచ్చాం



**నాన్న మెచ్చుకున్నారు.** 'తాండవ్' 10 వేల మందికి పైగా మహిళలు, బాలికలకు చేరింది. భారత్ సహా, యూకే, ఆస్ట్రేలియా దేశాలకు శిక్షణ ఇచ్చాం. చెన్నైలో ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్ క్లాస్‌లూ ఉన్నాయి. విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగినులే కాదు. ఇతర రాష్ట్రాలవారూ ఆసక్తి చూపుతున్నారు. మధుమేహమూ అదుపులో ఉండటం గమనించాం. పరిశోధనలు చేస్తున్నాం. నా లక్ష్యం ఇంతటితో ఆగదు. సమాజం కోసం పాటుపడాలని అమ్మానాన్నలు ఎప్పుడూ చెప్పేవారు. 'వాళ్లిద్దరూ వైద్యులే నాన్న మోహన్ ప్రముఖ డయాబీటిక్ స్పెషలిస్ట్. ఆయనకి తాండవ్ ప్రాజెక్టు గురించి చెప్పినప్పుడు ప్రోత్సహించారు. నిజానికి ఆయన స్ఫూర్తితోనే నేను డయాబీటాజిస్ట్‌నయ్యా నా వంతుగా దేశప్రజలకు సాయపడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. □

# లిచీతో మంచి ప్రయోజనాలు

రోడ్డు పక్క బండ్లపై ఎక్కడ చూసినా లిచీ పండ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి కదూ! ఎరుపు, తెలుపు మేళవింపుతో జెల్లీలా కనిపిస్తూ తెగ నోరూరిస్తాయి. మరి తింటున్నారా? ఎందుకంటే..



ఈ పండ్లు మనకి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలని అందిస్తాయి.

- చినుకులు మొదలయ్యాయి. వాటితోపాటే బోలెడు ఇన్‌ఫెక్షన్లూ పలకరిస్తాయి. వాటి బారిన పడొద్దంటే రోగనిరోధకత పెంచుకోవాల్సిందే. లిచీలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇమ్యూనిటీని పెంచడంలో సాయపడుతుంది.
- బి విటమిన్లు, ఫ్లావనాయిడ్లు సమృద్ధిగా ఉంటాయి. రక్తకణాల ఉత్పత్తికి ఇవి సాయపడతాయి. అందుకే నెలసరి మొదలైన అమ్మాయిలకు వీటిని తప్పక ఇవ్వమంటారు. ఇంకా మాంగనీస్, మెగ్నీషియం, కాపర్, ఐరన్, ఫోలేట్ వంటి ఖనిజ లవణాలకు ఇది మంచి వనరు. పైగా రుచీ బాగుంటుంది. అందుకే ప్రెగ్నెన్సీ సమయంలో తప్పక ఇవ్వాల్సిన పండ్లలో వీటినీ ఒకటిగా చెబుతారు.
- వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలోని ఫ్రీరాడికల్స్‌తో పోరాడి, వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరకుండా కాపాడతాయి.
- విటమిన్-సి నల్లమచ్చలు, హైపర్ పిగ్మెంటేషన్‌ని తగ్గిస్తుంది. అందుకే స్కిన్‌కేర్ ఉత్పత్తుల్లోనూ దీనికి చోటిస్తారు. పైపూతల కంటే నేరుగా తీసుకోవడం మరింత మేలు కదా! అందుకే తరచూ ఆహారంలో చేర్చుకోండి. పైగా ఈ పండు బరువు తగ్గించడంలోనూ సాయపడుతుంది.
- ఇది మనసుకి చేసే మేలూ ఎంతో! దీని తీయనైన సువాసన అరోమా థెరపీలా పనిచేస్తుందట. విశ్రాంతి భావన కలిగించి, ఒత్తిడిని దూరం చేస్తుందట. అంటే వీటిని తినడం ద్వారా శరీరానికే కాదు.. మనసుకీ మేలు జరిగేలా చేయొచ్చన్న మాట. అయితే ఎంత నచ్చినా వీటినీ పరిమితం గానే తీసుకోవాలి. రోజుకి 7కి మించకుండా తినాలి. □

# కిచెన్ కింగ్ మసాల



**ఫలానా మసాలాపొడి వల్ల కూరసూపర్‌గా ఉంది లాంటి ప్రకటనలు చూస్తుంటాం కదూ! అలాంటి వాటిల్లో 'కిచెన్ కింగ్ మసాలా' ఒకటి .** ఇది బయట కొనేకంటే ఇంట్లోనే చేసుకుంటే మరింత తాజాగా ఉంటుంది. ప్రిజర్వేటివ్స్ ఉండవు కనుక ఆరోగ్యానికీ మంచిది. తేలిగ్గా ఎలా చేయాలంటే.. మినపప్పు, పచ్చి శనగ పప్పు, షాహీ జీరా, ఆవాలు ఒక్కో చెంచా చొప్పున, మెంతులు పావు చెంచా, 3 సోంపు 2 టేబుల్ స్పూన్లు ధనియాలు 3 టేబుల్ స్పూన్లు, ఒకటిన్నర చెంచా జీలకర్రలను సన్న సెగ మీద వేయించాలి. అవి గోధుమ రంగులోకి మారేసరికి మంచి వాసన వస్తుంది. అందులో అంగుళ చొప్పున దాల్చినచెక్క, శొంఠి, మూడు బిర్యానీ ఆకులు, 12 లవంగాలు, 8 యాలకులు, 2 నల్ల యాలకులు (బ్లాక్ కార్డమమ్), ఒక జాపత్రి, ఒక స్టార్ మొగ్గ, అర జాజికాయ, 7 ఎండు మిరప కాయలు, అర టేబుల్‌స్పూన్ గసగసాలు, 2 టేబుల్ స్పూన్ల చొప్పున మిరియాలు, మెంతి ఆకులు పొడి వేసి ఇంకాస్త వేయించాలి. మంచి సువాసన వస్తున్నప్పుడు దించేచాలి. అవి చల్లారాక..చెంచా చొప్పున పసుపు, ఉప్పు, ఆమ్‌చూర్ పొడి జతచేసి గ్రైండ్ చేయాలి. అంతే.. 'కిచెన్ కింగ్ మసాలా' సిద్ధం. దీనినన తడ లేని గాలి చొరబడని డబ్బాలో భద్ర చేసుకుంటే టామాటో, బంగాళదుంప లాంటి కూరల దగ్గర నుంచి బిర్యానీ వరకూ ఎందులో వేసినా వారెవా అనిపిస్తుంది. □

# పల్లీలు పాడవకుండా..

కాసిని పల్లీలు వేయించి, కారం, ఉప్పు చల్లితే.. వారెవా.. ఎంత కమ్మగా ఉంటాయి! బెల్లంతో పాకుపట్టి ఉండలు చుడితే.. మరే మిఠాయిలూ సాటి రావు, పల్లీ పచ్చడి గురించి చెప్పాల్సిందే.. ఇడ్లీ, దోశ.. ఎందులోకైనా సూపర్‌గా ఉంటుంది. పల్లీపొడి కూరల్లో వేస్తే వాటికి రెట్టింపు రుచి వచ్చేస్తుంది. ఈ టేస్టీ టేస్టీ పీనట్స్ ఎక్కువకాలం నిలవుండవు. వీటిల్లో ఉన్న ఫ్లేవొనాయిడ్స్, ఎమినో యాసిడ్స్ వల్ల పాడవుతాయి కనుక బాగుండడం కొనుక్కోవడమే మంచిది. తెచ్చినవి ఫంగస్ రాకుండా కొన్నాళ్లు తాజాగా ఉండాలంటే ఈ జాగ్రత్తలు పాటించాలి..

- పల్లీలను చల్లటి, పొడి ప్రదేశంలో భద్రం చేయాలి. వేడి కానీ తడి గానీ తగలకూడదు. ఫ్రిజ్‌లో ఉంచితే ఎక్కువ కాలం నిలవుంటాయి.
- .గాలి చొరబడని సీసాలలో ఉంచాలి.
- .పల్లీలు ఇటుకరంగులో మెరుస్తుంటాయి. బదులుగా పేలవమైన రంగులోకి మారితే బాగాలేవని అర్థం. వీటి వాసన బాగుంటుంది. అలా లేకుంటే పాడైనట్లు, రుచిలో ఏమాత్రం తేడా వచ్చినా వాడకూడదు. □

# అందానికి, ఆరోగ్యానికి..

అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో ఛాతీ పాత్ర కీలకం. అయితే తీసుకునే ఆహార, జీవన శైలి వంటవన్నీ దీని ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని చెబుతున్నారు నిపుణులు. ఓ రకంగా చెప్పాలంటే మనం చేసే చిన్న చిన్న పొరపాట్లే ఛాతీ అదాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు రొమ్ము క్యాన్సర్ ఊబిలోకి లాగుతున్నాయంటున్నారు. మరి, అలా జరగకుండా ఉండాలంటే ఛాతీ ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచిస్తున్నారు.



**సరిపడినంత నిద్ర..** రాత్రి నిద్రపోయే సమయంలో శరీరంలో హార్మోన్లన్నీ సక్రమంగా వస్తాయి. ముఖ్యంగా ఒత్తిడికి కారణమయ్యే హార్మోన్ స్థాయి తగ్గుతుంది. ఇది అధిక స్థాయిలో ఉంటే ఛాతీ ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. కాబట్టి రోజూ ఎనిమిది గంటల పాటు ప్రశాంతమైన నిద్ర పోవడం చాలా అవసరం అంటున్నారు నిపుణులు.

**తగినంత ఫోలిక్ యాసిడ్..** మను తీసుకునే ఆహారం ద్వారా తగినంత ఫోలిక్ యాసిడ్ శరీరానికి అందకపోయినా క్యాన్సర్ ముప్పు పెరుగుతుందంటున్నారు నిపుణులు అందుకే రోజూ మనం తీసుకునే ఆహారంలో భాగంగా 4000 మైక్రోగ్రాముల ఫోలిక్ యాసిడ్ అందేలా జాగ్రత్తపడడం చాలా అవసరం. పాలకూర నిమ్మజాతికి చెందిన పండ్లు, బీన్స్, అవకాడో.. మొదలైన వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలి.

**సరిపడినంత విటమిన్ 'డి'..** ఛాతీ ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే వాటిలో విటమిన్ డి కూడా ఒకటి. అందుకే లేలేత సూర్యకిరణాలు చర్మంపై పడేలా కాసేపు ఉదయాన్నే ఎండలో నిలబడ దం మంచిది. అలాగే ఈ పోషకాలు అధికంగా ఉండే పదార్థాలను ఆహారంలో చేర్చండి. మరీ అత్యవసరమైతే వైద్యుల సలహా మేరకు విటమిన్ 'డి' సప్లిమెంట్లను వాడడం కూడా మంచిది.

**మృదువుగా మసాజ్...** రోజువారీ ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు మసాజ్ చక్కగా తోడ్పడుతుంది. చేతులతో మృదువుగా మసాజ్ చేయడం చాతీ ఆరోగ్యానికి మంచిదంటున్నారు నిపుణులు. ఐదు రోజుల పాటు నిమిషాల చేతులతో ఛాతీపై మృదువుగా మర్దన చేయడం వల్ల వాటిని తీరైన ఆకృతిలో తీర్చి దిద్దుకోవడంతో పాటు.. నొప్పి వంటి సమస్యలు ఉన్నా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది. □

# పిసిఓఎస్ తగ్గాలంటే..

పొట్ట కండరాలు బలపడటానికీ, వెన్నెముక, పిసిఓఎస్ సమస్యలు తగ్గటానికీ, సిస్టులు, ఫైబ్రాయిడ్స్ కరగడానికీ ఉష్ట్రాసనం బాగా పనిచేస్తుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా రెండు కాళ్లను వెనకకు మడిచి కూర్చోవాలి. తరవాత నెమ్మదిగా మోకాళ్ల మీద లేచి కుడిచేత్తో కుడికాలి




మడమని, ఎడమేత్తో ఎడమ కాలిమడమని వెనక్కి వాలుతూ ఫొటోలో చూపిన విధంగా పట్టుకోవచ్చు. మొదటిసారి ప్రయత్నించేవారు పాదాన్ని అందుకోలేక పోతే పాదాన్ని వేళ్లమీద ఆనించి మడమని పట్టుకోవాలి. ఈ ఆసనాన్ని పదిసెకన్లు చొప్పున రోజుకి మూడుసార్లు చేయాలి. నెమ్మదిగా శ్వాస తీసుకుంటే యథాస్థితికి వచ్చి మోకాళ్లపై కూర్చోవాలి. ఈ ఆసనం చేశాక దీని అనుబంధ ఆసనం కూడా చేస్తే మరింత ఫలితం చేకూరుతుంది.

**శశాంకాసనం ...** ఉష్ట్రాసనం వేసిన తరవాత ఈ




శకాంకాసనం చేస్తే శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. అందుకే దీన్ని శాంతినిచ్చే ఆసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వేయడం వల్ల ఛాతీ, పొట్ట, వెన్నెమక కండరాలకి నూతన శక్తి లభించి హాయిగా ఉంటుంది. మంచి నిద్రపడుతుంది. కోపం అదుపులో ఉంటుంది. ఈ ఆసనం వేయడానికి ముందుగా వజ్రాసనంలో కూర్చోవాలి. నెమ్మదిగా రెండు చేతులనూ పైకి పెట్టి శ్వాస వదులుతూ మెల్లగా వంగి, చేతులను ముందుకు ఫొటోలో చూపిన విధంగా ఉంచాలి. ఈ క్రమంలో నుదుటిభాగం నేలను తాకేలా ఆనించాలి. మొదటిసారి ప్రయత్నించేవారు దిండుసాయంతో చేస్తే ఎటువంటి ఇబ్బంద ఉండదు. □

# మణి మండపం

ఆధ్యాత్మికం

ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తయ్యింది. ఆ సంతోష సమాచారాన్ని తన గురువు కు తెలియజేయాలని వెళ్ళాడు భాస్క రుడు. అప్పుడు గురువు, దైవారాధన చేసి నైవేద్యాన్ని భక్తులకు ప్రసాదంగా పంచి పెడుతు న్నాడు. గురువుని చూసిన భాస్కరుడు ఆలయ నిర్మాణం పూర్తి అయ్యిందని, ఇకపై చేయాల్సిన కుంభాభిషేకం, విగ్రహ ప్రాణ ప్రతిష్ట తదితర కర్తవ్యాలను నిర్దేశించమని కోరాడు. గురువు చిన్న నవ్వు నవ్వి ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. నువ్వు చేయాల్సింది చాలా ఉంది" అన్నాడు. ఆశ్చర్యపోయాడు భాస్కరుడు. ఆలయ నిర్మాణం చేసినంత మాత్రాననే పూర్తి అయినట్టు లెక్క కాదు. నువ్వు ఒక్కడివే వచ్చావు, ఊరిలో ఎవ్వరూ నీతోపాటు రాలేదా?" అని ప్రశ్నించాడు గురువు. దానికి సమాధానంగా ఎవ్వరూ సహకరించడం లేదని, ఏపనికీ ఊరిలో వాళ్ళు దగ్గరకు రావడం లేదు. వారిమీద ఎలాంటి ఆర్థిక భారం పడకుండా చూసుకున్నాను, పైగా ఆలయ నిర్మాణం ఖర్చు మొత్తం నేనే భరించాను కూడాను" అని చెప్పాడు భాస్కరుడు. అది పూర్తి అయింది కానీ పూజలైనా కలసి చేస్తారో లేదో అని గురువుతో విచారం వ్యక్తం చేశాడు. దానికి గురువు ఇందాక ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చూసావు కదా! నీకు ఏమీ అనిపించలేదా? ఇక్కడ ఉన్న ఒక్కరు లేదా ఇద్దరో కూర్చొని మొత్తం తినేస్తే అది ఫలహారం అవుతుంది కానీ ప్రసాదం ఎలా అవుతుంది. అందరికీ పంచితేనే అది ప్రసాదంగా గౌరవింప బడుతుంది. అలాగే ఆలయం అంటే అందరిదిగా ఉండాలి. అందరికీ ఇది మనది అన్న భావన కలగాలి. అప్పుడే అది కలకాలం ఆలయంగా, కోరిన కోరికలు తీర్చే కోవెలగా విరాజిల్లుతుంది. ఇందులో భక్తికి శక్తి అవరోధం కాదు కదా! ఊరిలో వారి వాటా కూడా ఉన్నప్పుడే అది అందరికీ ఆమోదయోగ్యం. లేదంటే మీ ఇంటి గుడి లేదా మండపమో అవుతుంది. వారికి ఎలాంటి హక్కు గానీ బాధ్యత గానీ లేనట్టు భావించే అవకాశం లేక పోలేదు. అందరూ కలసి నిర్మిస్తే మణి మండపం అవుతుంది. ఒక్కడే నిర్మిస్తే తనీ మండపం అవుతుంది. మీరు ఉన్నంత వరకే దాని ఆలనా పాలన జరుగుతుంది. తర్వాత పాడుబడి పోతుంది. ఊరు ఉన్నంత వరకు ఆలయం ఉండాలంటే ఊరిలో అందరి సహ కారం తప్పక తీసుకోవాలి", అని హితవు పలికాడు గురువు. 'తప్పదంటారా ?" అని అమాయకంగా అడిగాడు భాస్క రుడు. దానికి గురువు గారు మరింత లోతుగా చెప్పదలచి "మానవుడు సంఘజీవి". పాలల్లో నీళ్ళలాగా సమాజంలో జీవనం చేసుకుంటూ చుట్టూ ఉన్న మనుషులపట్ల దయ, జాలి, మృదు స్వభావం కలిగి ఉండాలి. మనిషి సామాజిక స్పృహ కలిగి జీవించాలి. బృందంగా ఏర్పడితే అది ఒక బంధంగా మారు తుంది. ఏ పనైనా సులభం అవుతుంది. ఇవి అన్నీ ఆలయ కేంద్రంగా దొరుకు తాయి అని గట్టిగా హితవు చెప్పాడు గురువు. కనువిప్పు కలిగిన భాస్కరుడు ఊరిలోని బంధువులందరికీ ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యత అప్పగిం చాడు. వారి శక్తి కొలది దీపములు, గుడిగంటలు, తీర్థ పాత్రలు, శఠగోపము, గోపురము పైన కలశము, ఉత్స వ మూర్తులు ఇలాంటి వన్ని స్వీకరించాడు.

- కాపా మధుసూదన్

# కళ్ల ఉపశమనం కోసం..

కళ్లు తగినంత కన్నీటిని ఉత్పత్తి చేయనప్పుడూ, లూబ్రికేషన్ అందనప్పుడూ డ్రై ఐ సిండ్రోమ్‌కు దారితీస్తుంది. దీనివల్ల ఒక్కోసారి కళ్లలో మంట, దురద, ఎర్రబడటం, కాంతిని చూడలేకపోవడం జరుగు తుంది. వీటి నుంచి ఉపశమనం పొందడానికి ఈ కింది చిట్కాలను పాటిస్తే సరి.

**కలబంద గుజ్జు :** ఇందులో ఉండే ఆల్కలీన్ గుణాలు కళ్లను తేమపూరితం చేస్తాయి. దీనిలోని మాయిశ్చరైజింగ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఎరుపు తద్వారా వచ్చే వాపును తగ్గిస్తాయి. ఇందుకుగానూ కలబంద గుజ్జు తీసుకుని కంటి చుట్టూ సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటిలో శుభ్రం చేస్తే సరి. రోజుకి రెండుసార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

**శుభ్రం చేయడం..** కాటన్ వస్త్రాన్ని గోరువెచ్చని నీళ్లలో ముంచి నీటిని పిండాలి. కళ్లపై ఐదు నిమిషాలు ఉంచి, వృత్తా కారంలో కను రెప్పలపై మృదువు గా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల కంటిలో ఉండే దుమ్మూధూళీ బయటకు వచ్చేస్తాయి. ఇలా రోజులో కనీసం మూడు సార్లు చేయాలి.



**కొబ్బరినూనె..** కళ్లు తేమను కోల్పోకుండా ఇది కాపాడుతుంది. అంతేకాదు ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పొడిబారడం వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కొబ్బరి నూనెలో దూదిని ముంచి మూసి ఉనన కనురెప్పలపై 15 నిమిషాలు ఉంచాలి. ఇలా ఉపశమనపం కలిగేంత వరకూ రోజులో ఎన్నిసార్లైనా చేయవచ్చు.

**రోజ్‌వాటర్ :** ఒత్తిడి వల్ల అలసి పోయిన కంటికి ఇది ఉపశమనం కలిగిస్తుంది. విటమిన్-ఎ లోపం వల్ల కళ్లు పొడిబారుతుంటాయి. రోజ్‌వాటర్ లో విటమిన్-ఎ పుష్కలంగా ఉంటుంది. గులాబీ నీళ్లలో దూది ఉండల్ని నాననివ్వాలి. వాటిని కళ్లపై పదినిమిషాలు ఉంచాలి. తరవాత చల్లటి నీటితో శుభ్రం చేస్తే సరి. రోజులో కనీసం మూడు సార్లు చేస్తే సమస్య తగ్గుతుంది. కంటి ఆరోగ్యాన్ని కాపాడే కొన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకుంటే మంచిది. చేపలు, అవిసెలు, వాల్‌నట్స్‌తోపాటు ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలుండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కంటిలో తేమ పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. □

# డబ్ల్యుటిసి గెలవకున్నా.. నంబర్ వన్‌లో ఆస్ట్రేలియా

## నాలుగుకి పడిపోయిన ఇండియా

## లేటెస్ట్ ర్యాంకింగ్స్‌లో షాకింగ్





**న్యూఢిల్లీ:** 2025 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటీసీ) దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది. కానీ లేటెస్ట్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మాత్రం ఆ జట్టు నెంబర్ వన్ స్థానానికి చేరుకోలేకపోయింది. అదే సమయంలో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి చెందిన ఆస్ట్రేలియా నెంబర్ వన్‌గా నిలిచింది. త్వరలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ప్రారంభం కానుంది, దీనికి ముందు టెస్ట్ ఫార్మాట్‌లో తాజా ర్యాంకింగ్‌లను ఐసీసీ విడుదల చేసింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 రన్నరప్ ఆస్ట్రేలియా ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్‌లలో మొదటి స్థానంలో ఉంది, ప్రస్తుతం ఆ జట్టుకు 123 పాయింట్లు ఉన్నాయి. డబ్ల్యూటీసీ 2025 ఛాంపియన్ దక్షిణా ఫ్రికాకు ర్యాంకింగ్‌లలో ప్రయోజనం చేకూరింది, ఇది రెండో స్థానానికి చేరుకుంది, ఇప్పుడు ఆ జట్టు 114 పాయింట్లతో ఉంది. ఇంగ్లాండ్ 113 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. కొన్ని నెలల క్రితం వరకు భారత జట్టు టెస్ట్ ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో ఉంది, అయితే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో వరుస సిరీస్‌లలో ఓడిపోవడంతో నాల్గో స్థానానికి పడిపోయింది, ప్రస్తుతం 105 పాయింట్లు ఉన్నాయి. డబ్ల్యూటీసీ 2021 విజేత న్యూజిలాండ్ ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో ఉన్నాయి. పాకిస్తాన్ ఏడో, వెస్టిండీస్ ఎనిమిదో, బంగ్లాదేశ్ తొమ్మిదో, ఐర్లాండ్ పదో స్థానంలో ఉన్నాయి. భారత్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ఇంగ్లాండ్‌తో సిరీస్‌తో ప్రారంభం కానుంది. భారత జట్టు ఈ ఏడాదిలో ఇంగ్లాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లు ఆడనుంది. అయితే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ కోసం జట్లు ఐసీసీ ర్యాంకింగ్‌ల ఆధారంగా అర్హత సాధిస్తాయి. ప్రస్తుత ర్యాంకింగ్‌ల ఆధారంగా, భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ డబ్ల్యూటీసీ 2025-27కి అర్హత సాధించాయి. వన్డే, టీ20లలో జట్టు ర్యాంకింగ్‌ల గురించి మాట్లాడితే, భారత్ ఇప్పటికీ ఈ రెండు ఫార్మాట్‌లలో నంబర్1 జట్టుగా కొనసాగుతోంది.

# ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో నం.1 స్మృతి

## 15, 16 స్థానాల్లో రోడ్రిక్స్, హార్మన్‌ప్రీత్





**న్యూఢిల్లీ:** భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఐసిసి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్ 1 స్థానానికి ఎగబాకింది, దాదాపు ఆరు సంవత్సరాల విరామం తర్వాత కెరీర్‌లో ఇది ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. 727 రేటింగ్ పాయింట్లతో, స్మృతి ఒక స్థానం మెరుగుపరుచుకుని, దక్షిణాఫ్రికాకు చెందిన లారా వోల్వార్ట్, ఇంగ్లాండ్ కెప్టెన్ నటాలీ స్కైవర్ బ్రంట్‌లను అధిగమించింది. ఇద్దరూ ఇప్పుడు 719 పాయింట్లతో సమానంగా ఉన్నారు. 2019 తర్వాత భారత ఓపెనర్ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉండటం ఇదే మొదటిసారి. ముఖ్యంగా కొలంబోలో శ్రీలంక మరియు దక్షిణాఫ్రికాతో జరిగిన భారత్ ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో స్మృతి సెంచరీ చేసింది. ఆమె కెరీర్‌లో 11వ వన్డే సెంచరీ అయిన ఆ ఇన్నింగ్స్ ఆమెను ర్యాంకింగ్స్‌లో తన సన్నిహిత ప్రత్యర్థులను అధిగమించేలలా చేసింది. టాప్ 10లో నిలకడగా స్థానం సంపాదించినప్పటికీ, ఈ టాప్‌కి తిరిగి రావడం చాలా కాలం నిరీక్షణకు ముగింపు పలికింది. ఇక వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇతర భారత క్రీడాకారిణులు జెమిమా రోడ్రిగ్స్ 15వ స్థానంలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 16వ స్థానంలో ఉన్నారు, దక్షిణాఫ్రికాకు చెందిన టాజ్మిన్ బ్రిట్స్ ఐదు స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకోగా, ఆమె సహచరురాలు మరియు మాజీ కెప్టెన్ సునే లూస్ ఏడు స్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకుంది. వెస్టిండీస్ జట్టులో షెమైన్ కాంప్‌బెల్ 62వ స్థానానికి, ఓపెనర్ కియానా జోసెఫ్ 67వ స్థానానికి చేరుకుంది. కాగా బౌలర్ల ర్యాంకింగ్స్‌లో, కేప్ హిల్‌లో దక్షిణాఫ్రికాపై నాలుగు వికెట్లు తీసిన అఫీ ఫ్లెచర్ నాలుగు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి చేరుకుంది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ నాన్కులులెకో మ్లాబా బౌలర్ల జాబితాలో ఆరు స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకోగా, క్లోయ్ ట్రయాన్ కూడా ఆరు స్థానాలు ఎగబాకి 45వ స్థానానికి చేరుకుంది. మ్లాబా 11 స్థానాలు ఎగబాకి 35వ స్థానానికి చేరుకుంది.

# చరిత్రనే మార్చిన టి20 ట్రై సిరీస్

## తొలిసారి మూడో సూపర్ ఓవర్

## నేపాల్‌పై నెదర్లాండ్స్ ఉత్కంఠ విజయం



**న్యూఢిల్లీ:** నెదర్లాండ్స్ మరియు నేపాల్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ చరిత్రను మార్చివేసింది. ఈ మ్యాచ్‌లో, రెండు జట్ల మధ్య 3-3 సూపర్ ఓవర్లు ఆడబడ్డాయి. నెదర్లాండ్స్ మరియు నేపాల్ మధ్య జరిగిన స్కాట్లాండ్ టీ20 ట్రై సిరీస్‌లో తొలిసారి మూడు సూపర్ ఓవర్ల తర్వాత విజేతను ప్రకటించారు. గ్లాస్గోలో జరిగిన ఈ ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ నేపాల్‌ను ఓడించింది. రెండు జట్లు 20 ఓవర్లలో 152 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. ఆ తర్వాత సూపర్ ఓవర్‌లో కూడా విషయం టైగా ముగిసింది. చివరికి, నెదర్లాండ్స్ మూడవ సూపర్ ఓవర్‌లో గెలిచింది. జాక్ లియాన్‌కాషెట్ అద్భుతంగా బౌలింగ్ చేసి నెదర్లాండ్స్‌ను చిరస్మరణీయ విజయానికి నడిపించారు. చివరి సూపర్ ఓవర్‌లో అతను ఒక్క పరుగులూ ఇవ్వకుండా రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్ స్కాట్లాండ్ టీ20 ట్రైసిరీస్‌లో రెండవ మ్యాచ్. నెదర్లాండ్స్ మొదట బ్యాటింగ్ చేసి 7 వికెట్లకు 152 పరుగులు చేసింది. ఇక నేపాల్ 8 వికెట్లకు 152 పరుగులు చేయడంతో స్కోరు టై అయింది. మొదటి సూపర్ ఓవర్ లో నేపాల్ 19 పరుగులు చేసింది. కుశాల్ భూర్టెల్ 5 బంతుల్లో 18 పరుగులు చేశాడు. కానీ నెదర్లాండ్స్ కూడా సులభంగా 19 పరుగులు చేసింది. మాక్స్ ఓ'డౌడ్ కేవలం 3 బంతుల్లో 12 పరుగులు, లెవిట్ 6 పరుగులు చేశారు. రెండవ సూపర్ ఓవర్‌లో నెదర్లాండ్స్ మొదట బ్యాటింగ్ చేసి 17 పరుగులు చేసింది. స్కాట్ ఎడ్వర్డ్స్ ఒక సిక్స్ కొట్టాడు. నేపాల్‌పై ఒత్తిడి ఉంది, కానీ రోహిత్ పౌడెల్ (7), ఆరీ (10) కలిసి స్కోరును సమం చేశారు. రెండు జట్లు వదులుకోవడానికి సిద్ధంగా లేవు, కాబట్టి మ్యాచ్ మూడవ సూపర్ ఓవర్‌లోకి వెళ్ళింది. ఈసారి లయన్‌కాచెట్ నెదర్లాండ్స్ తరపున అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను మొదటి బంతికే రోహిత్ పౌడెల్‌ను అవుట్ చేసి, మూడు బంతుల తర్వాత రూపేష్ సింగ్‌ను అవుట్ చేశాడు. నేపాల్ ఒక్క పరుగు కూడా చేయలేకపోయింది మరియు ఒత్తిడిలో కూలిపోయింది. నెదర్లాండ్స్ గెలవడానికి కేవలం ఒక పరుగు మాత్రమే అవసరం. మైఖేల్ లెవిట్ మొదటి బంతికే లామిచానే బౌలింగ్‌లో సిక్స్ కొట్టడం ద్వారా జట్టుకు విజయాన్ని అందించాడు.

# ఆసియా కప్‌లో భారత్ మహిళల ఆర్చరీ టీం వరల్డ్ రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్‌లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు అండర్21 ప్రపంచ రికార్డును నెలకొల్పింది. సింగపూర్‌లో జరుగుతున్న ఆసియా కప్ 2025లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు రికార్డు స్థాయిలో ప్రదర్శన ఇచ్చింది, ర్యాంకింగ్ రౌండ్‌లో అండర్21 ప్రపంచ రికార్డును తిరగరాసింది. షణ్ముఖి బుడ్డే, తేజల్ సాల్వే మరియు తనిష్క తోకల్ త్రయం అసాధారణమైన ప్రదర్శన చేసి 2101 పాయింట్లతో లీడర్ బోర్డ్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఇది 2076లో భారతదేశం పేరిట ఉన్న మునుపటి అండర్21 ప్రపంచ రికార్డును అధిగమించింది, ఈ రికార్డును 2023 ఆసియా కప్ ఎడిషన్ సందర్భంగా దీప్శి, ప్రగతి మరియు సాక్షిచౌదరి ఒకే వేదికపై నెలకొల్పారు. కుశాల్ దలాల్ 714 స్కోరుతో కాంపౌండ్ పురుషుల ర్యాంకింగ్ రౌండ్‌లో ముందంజలో ఉన్నాడు. కాంపౌండ్ మహిళల విభాగంలో షణ్ముఖి నాగ సాయి బుడ్డే 706 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచాడు, ఆ తర్వాత సహచరురాలు తేజల్ సాల్వే 700 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచాడు. పురుషుల రికర్వ్ విభాగంలో విష్ణు చౌదరి మరియు పరాస్ హుడా వరుసగా మూడు మరియు నాల్గవ స్థానంలో నిలిచారు, ఇద్దరూ 669 పాయింట్లు సాధించారు. రికర్వ్ మహిళలలో, వైష్ణవి బాబారావు పవార్ భారతదేశంలో అత్యుత్తమ ప్రదర్శనకారిగా నిలిచారు, 654 పాయింట్లతో 7వ స్థానంలో నిలిచారు.

# ఎటిఎంలలో పెరిగిన రూ.100, రూ.200 నోట్ల లభ్యత




**ముంబై, జూన్ 17:** ఏటీఎంల్లో రూ.100, రూ.200 నోట్ల లభ్యత పెరిగింది. ఏటీఎంల్లో (తిగిల్పీ)ఎప్పటికప్పుడు ఈ నోట్లు అందుబాటులో ఉండేలా చూడాలని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించిన గడువుకు మూడు నెలల ముందే వీటి లభ్యత 73 శాతం పెరిగింది. గతేడాదిలో డిసెంబర్‌లో 65 శాతంగా ఉన్న ఈ నోట్ల లభ్యత ప్రస్తుతం 73 శాతానికి చేరింది. ఏటీఎంలను నిర్వహిస్తున్న సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ ఈ గణాంకాల్ని వెల్లడించింది.ప్రజల కోసం చిన్న నోట్లు ప్రజలు ఎక్కువగా వాడే నోట్ల లభ్యతను పెంచే ఉద్దేశంతో బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం (తిగిలీ)ఆపరేటర్లు వాటి ఏటీఎంలలో రూ.100, రూ.200 నోట్లు అందుబాటు ఉండేలా చూడాలని ఆర్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసింది. 2025 సెప్టెంబరు 30 నాటికి 75 శాతం ఏటీఎంలు, 2026 మార్చి 31 నాటికి 90 శాతం ఏటీఎంల్లో రూ.100 లేదా రూ.200 నోట్ల ఉపసంహారణ జరగా లని తెలిపింది. ఇక ఆర్‌బీఐ నిర్దేశించిన గడువుకు మూడు నెలల కంటే ముందే ఈ నోట్ల వినియోగం 73 శాతం చేరడం విశేషం. బ్యాంకులు తమ ఏటీఎంల్లో చిన్న నోట్ల స్టాక్‌ను నియమితంగా నింపుతున్నాయి. వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు కూడా ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. పాత ఏటీఎంలలో పెద్దనోట్ల కోసం మాత్రమే ప్రత్యేకంగా ట్రేలుఉండేవి. రూ.100, ..200 నోట్ల లభ్యతలో పెరుగుదల ప్రజలకు నగదు లావాదేవీలలో ఎంతో సౌలభ్యం కలిగించనుంది. ఆర్‌బీఐ నిర్దేశించిన గడువులను ముందుగానే చేరుకోవడం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు మంచి సూచన. ప్రజలు చిన్న మొత్తాల చెల్లింపుల కోసం ఇక ఏటీఎంల ముందు తిప్పలు పడాల్సిన అవసరం ఉండదు.

# టీసీఎస్ కొత్త పాలసీ.. బెంచ్‌పై ఇక 35 రోజులే!



**ముంబై, జూన్ 17:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కొత్త పాలసీని తీసుకొచ్చిం ది. ఇకపై ఏటా ప్రతి ఉద్యోగి 225 బిల్లడ్ బిజినెస్ డేస్ పనిచేసి ఉండా లన్న నిబంధన తీసుకొచ్చింది. బెంచ్ మీద ఉండే సమయాన్ని 35 రోజుల కు పరిమితం చేసింది. జూన్ 12 నుంచి ఈ కొత్త నిబంధనను అమ ల్లోకి తీసుకొచ్చింది. ఉద్యోగులు పనిచేయకుండా ఉండే సమయాన్ని తగ్గించడం, వర్క్‌ఫోర్స్‌ను సమర్థంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా దీన్ని తీసుకొచ్చినట్లు పేర్కొంది.

ఐటీ కంపెనీల్లో బిల్లడ్ డేస్ అంటే క్లయింట్ ప్రాజెక్ట్‌పై పని చేయాల్సిన రోజులు. ఇది ఏడాదికి 225 రోజులు గా టీసీఎస్ నిర్ణయించింది. అంటే ప్రతి ఉద్యోగి కనీసం అన్ని రోజులు ప్రాజెక్టు లపై పని చేయాల్సి ఉంటుంది. ఇక ఏ ప్రాజెక్ట్‌పై పనిచేయకుం డా ఖాళీగా ఉండే సమయాన్ని బెంచ్ పీరియడ్‌గా పేర్కొంటారు. ఇకపై 35 రోజులు మాత్రమే ఒక ఉద్యోగి బెంచ్ మీద ఉండాలి. దీర్ఘకాలం పాటు ఏ ఉద్యోగి ప్రాజెక్టుపై లేకుండా ఖాళీగా ఉండకూడదని కొత్త పాలసీ నిర్దేశిస్తోంది. అలా జరిగితే అతడి పారి తోషికం, కెరీర్‌లో వృద్ధి, చివరికి ఉద్యోగ జీవితం పైనా ప్రభావం పడుతుందని కంపెనీ తన పాలసీ డాక్యుమెంట్‌లో పేర్కొంది. టీసీఎస్‌లో ఏ ప్రాజెక్ట్‌కు ఎవరు సరిపోతారు? ఎవరి నైపుణ్యాలు సరిపోతాయి? వంటివి రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్ చూస్తుంది. దీనికి గ్లోబల్ హెడ్‌గా ఉన్న చంద్రశేఖరన్ రామ్‌కుమార్ నిర్ణయా నికి అనుగుణంగా ఈ పాలసీ రూపుదిద్దుకుంది. అసోసి యేట్‌కు ఏ ప్రాజెక్ట్‌నూ కేటాయించని సందర్భంలో తనకు సరిపడే ప్రాజెక్ట్ అప్పగించేలా ఎప్పటికప్పుడు యూనిట్/ రీజనల్ ఆర్‌ఎంజీతో సంప్రదింపులు జరపడం వారిదే బాధ్యత అని పాలసీలో పేర్కొన్నారు. బెంచ్‌పై ఉన్న ఉద్యోగులు సంస్థ అందిస్తున్న ఐవాల్వ్, ఫ్రెస్కో ప్లే, వీఎల్ఎస్, లింక్డిన్ వంటి ప్లాట్‌ఫామ్‌లను వినియో గించుకొని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. ఆర్‌ఎంజీ నిర్దేశించిన సెషన్లకు హాజరవ్వాలి. బెంచ్‌పై ఉండేటప్పుడు ఆఫీసుకు రావడం తప్పనిసరి. వర్క్‌ఫ్రమ్ ఆఫీసు నుంచి మినహాయింపులు, ఫ్లెక్సిబుల్ వర్క్ వంటివి వర్తించవు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.